

సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 262 | శుక్రవారం | 22-08-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



సినీ కార్మికుల వేతనాలు
22.5శాతానికి పెంపు
ఇరు వర్గాల మధ్య కుదిరిన ఒప్పందం
ఆందోళన విరమించిన సినీ కార్మికులు
కార్మిక శాఖతో ఫెడరేషన్, ఛాంబర్ చర్చలు
నేటి నుంచి షూటింగ్ షురూ 04


## అధికార కేంద్రీకరణకు బిజెపి యత్నం

- సిబిఐ, ఇడి, న్యాయవ్యవస్థ, నీతి ఆయోగ్‌లను స్వతంత్రంగా పనిచేయనివ్వడంలేదు
- ప్రధాని కార్యాలయం ఏది చెబితే రాష్ట్రపతి భవన్ అదే చేస్తోంది
- అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠను, ప్రయోజనాలను కాపాడడంలో మోదీ విఫలం
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి బిఆర్ఎస్ మద్దతు ఇవ్వబోమనడమేమిటి?
- సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో డాక్టర్ కె.నారాయణ విమర్శ







ప్రజాపక్షం/ కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్

స్వయం ప్రతిపత్తి గల రాజ్యాంగబద్ధ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి అధికారాన్ని కేంద్రీకృతం చేసుకునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సిబిఐ, ఇడి, న్యాయవ్యవస్థ, నీతి అయోగ్ తదితర వ్యవస్థలను స్వతంత్రంగా పనిచేయనివ్వడంలేదని విమర్శించారు. చివరకు ప్రధానమంత్రి కార్యాలయం ఏది చెబితే రాష్ట్రపతి భవన్ అది చేసే స్థాయికి పరిస్థితి దిగజారిందన్నారు. మరోవైపు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను, ప్రయోజనాలను కాపాడడంలో ప్రధాన మోదీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో రెండవ రోజు ప్రతినిధుల సభలో నారాయణ ప్రసంగించారు. భారత పార్లమెంటరీ వ్యవస్థను కుదించి నాశనం చేయడం ద్వారా దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లు దేశాభివృద్ధి జరగడంలేదని, కార్పొరేట్ సంస్థల అభివృద్ధికి కుట్ర జరుగుతున్నదని, బిజెపిని వ్యతిరేకించే వారిని రాజకీయ కక్షతో జైలులో పెట్టడం, నక్సలైట్ల అంతం పేరుతో అటవీ, గిరిజన సంపదను తరువాయి 2లో

మహాసభకు హాజరైన ప్రతినిధుల దృశ్యం



## రెండింతలు పెరిగిన అవినీతి

- బిజెపి సర్కార్ ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక పరిస్థితి దిగజారింది
- విభజన రాజకీయాలతో దేశాన్ని అస్థిరపరిచేందుకు కాషాయ పార్టీ కుట్ర
- సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా

ఎలాంటి పోరాట, రాజకీయ, మంచి చరిత్ర లేని బిజెపి దేశంలో మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం అవినీతి రెండింతలు పెరిగిందని, ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని విమర్శించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తుల విభజన, ఫాసిస్టు, స్వార్థ రాజకీయాలపై ప్రజలను మరింత చైతన్యం చేసి వారి విధానాలను ఎండగట్టాలని, లేకపోతే ఆ శక్తులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్యాపిటలిస్టులకు తరువాయి 2లో

## సకాలంలో దిగుమతి జరగనందునే రాష్ట్రాల్లో యూరియా కొరత

- విదేశాల నుంచి తెప్పించడంలో కేంద్ర సర్కార్ విఫలం
- ఒక్క తెలంగాణలోనే లోటు ఉన్నట్లు చిత్రీకరిస్తున్న ప్రతిపక్షాలు
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్



విదేశాల నుంచి యూరియా తెప్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని..రైతుల పట్ల బిజెపికి ముందు చూపు లేదని చెప్పడానికి ఇదే నిదర్శనమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూరియా ఇంపోర్ట్ సకాలంలో బిజెపి సర్కార్ చేయకపోవడం వల్లనే అన్ని రాష్ట్రాల్లో యూరియ కొరత ఏర్పడిందన్నారు. అయితే యూరియా కొరత కేవలం తెలంగాణలోనే ఉన్నది అన్నట్లు బిఆర్ఎస్, బిజెపి నేతలు కట్టుకథలు సృష్టించి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఇక దేశీయంగా కూడా యూరియా ఉత్పత్తి అనుకున్న స్థాయిలో చేయడంలో కేంద్ర ప్రభుత్వం తరువాయి 2లో

## అసెంబ్లీలో చర్చ తర్వాతా? ముందా?

- కాళేశ్వరం రిపోర్టుపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు
- కెసిఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాదన – విచారణ నేటికి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై రాష్ట్రం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ నివేదికపై చర్యలు ఎలా ఉంటాయో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ చేశాక ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటారా లేనిపక్షంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందే చర్యలపై నిర్ణయం తీసుకుంటారా అని ఆరా తీసింది. కీలకమైన ఈ అంశంపై శుక్రవారం జరిగే విచారణలో తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటికిప్పుడే జవాబు చెప్పలేమని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి చెప్పడంతో విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ సారధ్యంలో విచారణ కమిషన్ ఏర్పాటు జీవో 6ను, కమిషన్ గత నెల 31న సమర్పించిన నివేదికలను రద్దు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రి టి. హరీష్ రావు హైకోర్టును ఆశ్రయించారు. గురువారం చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ ఎదుట సుదీర్ఘ వాదనలు తరువాయి 2లో

## అటవీ హక్కుల చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలి

- అర్హులైన గిరిజనులకు పోడుభూములు ఇవ్వాలి
- కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలి
- సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ తీర్మానం

ప్రజాపక్షం/కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్

అటవీ హక్కుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు అర్హులైన గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కార్మికులకు రూ.26 వేలు, స్కిల్డ్ వర్కర్లకు రూ.42 వేల కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వంలో టి జి ఆర్ టి సి విలీనం ప్రక్రియను పూర్తి చేయాలని, సంస్థలో కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్య, ఉద్యోగ రంగాల్లో బిసిలకు 42 శాతానికి రిజర్వేషన్లను పెంచాలని తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని సిపిఐ మహాసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామారంలో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో రెండవ రోజు గురువారం వివిధ సమస్యలు, అంశాలపై అధ్యక్షవర్గం సభ్యులు, ప్రతినిధులు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను ప్రతినిధుల సభ ఏక గ్రీవంగా ఆమోదించింది. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ తరువాయి 2లో

## జిఎస్‌టిలో ఇక రెండు శ్లాబులే

- మంత్రుల బృందం సూత్రప్రాయ ఆమోదం
- హేతుబద్ధీకరణకు రాష్ట్రాలు సుముఖత చూపినా ఆదాయ స్థిరీకరణపై అభ్యంతరాలు
- కొత్త విధానంలో ఆదాయనష్టం చెల్లించాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మంత్రుల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** వస్తుసేవల పన్ను(జిఎస్‌టి) విధాన సంస్కరణల్లో భాగంగా నాలుగు శ్లాబుల బదులు రెండు శ్లాబులు కొనసాగించేందుకు మంత్రుల బృందం (జిఓఎం) సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధురి అధ్యక్షతన ఆరు రాష్ట్రాలకు చెందిన జిఎస్‌టి కౌన్సిల్ ఆర్థికమంత్రుల బృందం గురువారంనాటి కీలక సమావేశంలో కేంద్రం ప్రతిపాదనలను ఆమోదించింది. జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణకు సంబంధించిన రెండు శ్లాబుల విధానానికి అన్ని రాష్ట్రాలు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ ఆదాయాల స్థిరీకరణపై కొన్ని అభ్యంతరాలు తెలియజేశాయి. ఇప్పటివరకూ ఉన్న నాలుగు శ్లాబులలో 12 శాతం, 28 శాతం శ్లాబులను తొలగించి ఐదూ శాతం, 18 శాతం శ్లాబులను కొనసాగిస్తారు. హానికరమైన వస్తువులపై 40 శాతం పన్నును కేంద్రం ప్రతిపాదించింది. కొత్త శ్లాబువిధానంవల్ల కలిగే ఆదాయనష్టాన్ని భర్తీ చేయాలని, ఆ పరిహారం చెల్లించాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. కేంద్రం ప్రతిపాదనలో ఆదాయనష్టం భర్తీ విషయం ప్రస్తావించలేదని జిఓఎంలో ప్రతిపక్ష పాలిత మంత్రులు విమర్శించారు. రాష్ట్రాల ఆదాయాలను సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క డిమాండ్ చేశారు. కాగా వ్యక్తుల ఆరోగ్యం, జీవిత బీమా విధానాలకు సంబంధించి కేంద్రం ప్రతిపాదించిన మినహాయింపులను బుధవారంనాడు జిఎస్‌టి మంత్రుల బృందం చర్చించింది. దీనివల్ల ప్రతి సంవత్సరం రూ.9,700 కోట్లు ఆదాయంపై ప్రభావం పడుతుంది. ఐనాగానీ చాలా రాష్ట్రాలకు ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించాయి. జిఎస్‌టిలో ఉన్న ఆరుగురు మంత్రుల బృందంలో ముగ్గురు బిజెపి పాలిత బీహార్, ఉత్తర ప్రదేశ్, తరువాయి 2లో



## ఆదాయం క్షీణిస్తే సంక్షేమ పథకాలు దెబ్బతింటాయ్

- వాటాకు తగినవిధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరగడంలేదు
- జిఎస్‌టి హేతుబద్ధీకరణ సమావేశంలో భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

జిఎస్‌టి రేట్ల సరళీకరణ,పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగిన విషయమై నప్పటికీ, రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా రక్షించే చర్యలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రాల ఆధాయం క్షీణిస్తే పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బ తింటాయని హెచ్చరించారు. వాటకు తగిన విధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరగడం లేదన్నారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన జిఎస్‌టి రేషనలైజేషన్ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిఎస్‌టి ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉండటంతో, వార్షికంగా 14 శాతం వృద్ధి కలుగుతుందని హామీనిచ్చిన విషయాన్ని తరువాయి 2లో

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

నిబద్ధతతో నామినేషన్ వేశానని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి పదవికి ప్రతిపక్షాల అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి గురువారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్, ఎస్‌పి నాయకుడు రాంగోపాల్ యాదవ్, డిఎంకెకు చెందిన తిరుచ్చి శివ, టిఎంసికి చెందిన శతాబ్ధి రాయ్, శివసేన (యుబిటి)కి చెందిన సంజయ్ రౌత్, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్ వంటి అగ్ర ప్రతిపక్ష నాయకుల సమక్షంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నామినేషన్ దాఖలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారి అయిన రాజ్యసభ సెక్రటరీ జనరల్ ముందు సుదర్శన్ రెడ్డి నాలుగు సెట్ల నామినేషన్ తరువాయి 2లో



## ఉగ్ర గోదారి

మూడో ప్రమాదస్థాయి హెచ్చరికకు చేరువలో నీటిమట్టం

ప్రజాపక్షం/భద్రాచలం

గోదావరి వరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గురువారం రాత్రి కడపటి వార్తలు అందే సమయానికి 51.09 అడుగుల చేరుకుని నిలకడగా మారింది. గత వారం రోజులుగా గోదావరి పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు తరువాయి 2లో

## గవర్నర్లు బిల్లులు ఆమోదించకుంటే చూస్తూ ఊరుకోవాలా?

- కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ఏదైనా తప్పు జరిగితే దానికి పరిష్కారం ఉండాలని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** రాజ్యాంగ కార్యనిర్వాహకులు విధులు నిర్వర్తించడానికి నిరాకరిస్తే, లేదా రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో గవర్నర్ నిష్క్రియాత్మకంగా ఉన్నప్పుడు రాజ్యాంగ న్యాయస్థానాల చేతులు కట్టేయవచ్చా? అని గురువారం సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా మాట్లాడుతూ కొంతమంది గవర్నర్లు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై కూర్చుంటే న్యాయపరమైన పరిష్కారాలకు బదులు రాష్ట్రాలు రాజకీయ పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంటుందని చెప్పిన తర్వాత ఐదుగురు జడ్జిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి పరిష్కరించేందుకు కాలపరిమితి విధించవచ్చా అనే ప్రశ్నపై రాష్ట్రపతి సూచనను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిఎస్.నర్సింహ్మా, జస్టిస్ ఏఎస్.చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. ఏదైనా తప్పు జరిగితే దానికి పరిష్కారం ఉండాలని ధర్మాసనం తెలిపింది. రాజ్యాంగ కార్యనిర్వాహకులు ఎలాంటి కారణం లేకుండా తమ విధులను నిర్వర్తించకపోతే రాజ్యాంగ న్యాయస్థానం చేతులు కట్టేయవచ్చా అని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తాను ప్రశ్నించారు. దీనిపై మెహ్‌తా మాట్లాడుతూ 'అన్ని సమస్యలకు కోర్టులు పరిష్కారం కాలేవని, చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గవర్నర్ వైపు నుండి ఏదైనా నిష్క్రియాత్మకత ఉంటే అది రాష్ట్రానికి రాష్ట్రానికి మారవచ్చు. బాధిత రాష్ట్రం కోర్టును ఆశ్రయిస్తే అలాంటి నిష్క్రియాత్మకతపై న్యాయ సమీక్షను నిషేధించవచ్చా? పరిష్కారం ఏమిటో మీరు మాకు చెప్పండి' అని జస్టిస్ సూర్యకాంత్ వాదించారు. కొంత 'సరళత' కోసం మెహ్‌తా పిలుపునిస్తూ ఇలా అన్నారు. 'ఒకవేళ గవర్నర్ బిల్లులపై కూర్చున్నారనుకోండి. ఆమోదించదగిన రాజకీయ పరిష్కారాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి దీనిపై కోర్టుకు పరుగెత్తడం అన్ని చోట్లా జరుగదు. చర్చలు జరిగే సందర్భాలు, ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసే సందర్భాలు, ఆయన ప్రధాన మంత్రిని, రాష్ట్రపతిని కలిసే సందర్భాలు కూడా ఉన్నాయి. పరిష్కారాలు కనుగొనబడతాయి. అంతేకాకుండా కొన్ని సందర్భాలలో టెలిఫోనిక్ సంభాషణలు కూడా ప్రతిష్ఠంభనను పరిష్కరించేందుకు దోహదపడతాయి. ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించుకోవడానికి దశాబ్దాలుగా ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. ప్రతినిధులు వెళ్లి గవర్నర్‌ను, రాష్ట్రపతిని కలుస్తారు. కొన్నిసార్లు మధ్యే మార్గాన్ని తరువాయి 2లో




## కేరళ సిపిఐ ఎమ్మెల్యే వఝూర్ సోమన్ ఆకస్మిక మృతి

నివాళులర్పించిన ముఖ్యమంత్రి పినరయి విజయన్

05



# ప్రపంచం
WORLD NEWS

## రాజకీయపార్టీ ఆలోచన విరమించిన ఎలాన్‌మస్క్

వాషింగ్టన్: సొంతంగా రాజకీయపార్టీ ఏర్పాటు చేయాలనే ఆలోచనను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ విరమించుకున్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ విషయం ప్రకటించింది. గత ఏడాది అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడుగా ఉండి ఆయనకు దాదాపు 300 మి.డాలర్ల ఫండింగ్ చేసిన ఎలాన్‌మస్క్ ఆ తర్వాత ప్రభుత్వంలో 'డాడ్జ్' ప్రత్యేక విభాగాన్ని నిర్వహించి పొదుపు చర్యలు చేపట్టి ఫెడరల్ ఉద్యోగుల నుండి విమర్శలు ఎదుర్కొన్నారు. మే 28న ట్రంప్ పాలనాయంత్రాంగం 'డాడ్జ్' నుండి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ట్రంప్ తీసుకువచ్చిన బ్యూటిఫుల్ బిల్లును మస్క్ తీవ్రంగా ప్రతిఘటించారు. అమెరికాలో రెండు పార్టీల వ్యవస్థను సవాలు చేస్తూ ''ద అమెరికన్ పార్టీ''ని ప్రారంభిస్తున్నట్లు ఈ ఏడాది జూన్ ఏనిమిదో తేదీన ఎలాన్ మస్క్ ప్రకటించారు. దేశంలో రెండు పార్టీలకూ ప్రభుత్వ వ్యయాలమీద, అవినీతిమీద పట్టలేదని, వాటిని నిర్మూలించలేక పోతున్నాయని మస్క్ విమర్శించారు.

## ఆరు నెలల్లో 2,100 మంది హమాస్ ఉగ్రవాదులు హతం

### ఐడిఎఫ్ ప్రకటన

టెల్‌అవీవ్: గడచిన ఆరు నెలల్లో గాజాలో 2,100మంది హమాస్ ఉగ్రవాదులను హతమార్చి, 75 శాతం గాజా స్ట్రిప్ ప్రాంతాన్ని సైనిక కార్యకలాపాల అధీనంలోకి తెచ్చినట్లు ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) ప్రకటించింది. ఇదే అదే సమయంలో 10,576 మంది పాలస్తీనియన్లు కూడా మరణించినట్లు హమాస్ హయాంలోని ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. మధ్యవర్తుల ప్రమేయంతో బలవంతంగా 45 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం అమలు జరిగిన తర్వాత మార్చినెల రెండోవారంలో ఇజ్రాయెల్ తిరిగి గాజాలో రెండో దశ యుద్ధం ప్రారంభించింది. అప్పటినుండి 2,100 మంది హమాస్ ఉగ్రవాదులను హతమార్చినట్లు ఐడిఎఫ్ గురువారం ప్రకటించింది. గడచిన ఆరునెలల్లో హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకాదళ సహాయంతో 10,000 ఉగ్రవాద కేంద్రాలను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులమధ్య అనుసంధాన వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశామని పేర్కొంది. గాజాలో హమాస్ నాయకుడు మహ్మద్ సిన్వర్‌ను ప్రధానంగా దాడుల్లో మట్టుపెట్టామని తెలిపింది. సిన్వర్ సోదరుడు, హమాస్ నాయకుడు యాహ్యా సిన్వర్‌ను గత ఏడాదిలోనే హతమార్చామని గుర్తుచేసింది. రఫా బ్రిగేడ్ కమాండర్ మహ్మద్ షబనా, దక్షిణ ఖాన్ యూనిస్ బెటాలియన్ కమాండర్ కమాండర్ మహ్దీ క్వారాను చంపినట్లు తెలిపింది. హమాస్‌కు చెందిన ఆరుగురు అత్యున్నతస్థాయీ కమాండర్లను, అనేకమంది హమాస్ ప్రభుత్వ అధికారులను, ఇంటర్నల్ భద్రతాధికారులను హతమార్చామని ఐడిఎఫ్ ప్రకటించింది. 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై దాడికి సూత్రధారులైన అనేకమందిని పూర్తిగా మట్టుపెట్టామని తెలిపింది.

# పేలుళ్ళతో దద్దరిల్లుతున్న గాజాసిటీ

**ఐడిఎఫ్ ఆక్రమణ ప్రారంభం**
**ఇళ్ళు వదలి పారిపోతున్న ప్రజలు**

గాజా: గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికను గడచిన మంగళవారం ఆమోదించిన ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) మరునాటి నుండే కార్యాచరణ ప్రారంభించింది. గాజాసిటీ తొలిదశ ఆక్రమణ ప్రారంభమైందని ఐడిఎఫ్ ప్రకటించింది. గురువారంనాడు భూతల ఆక్రమణ దాడ పెరగడంతో ప్రజలు భయభ్రాంతులై దక్షిణ ప్రాంతానికి పరారవుతున్నారని స్థానిక అధికారులు చెప్పారు. గాజా సిటీలో దాదాపు 10 లక్షలమంది ప్రజలు బతుకుతున్నారు. రాత్రి తెల్లారకముందే గాజా సిటీ బాంబు పేలుళ్ళతో దద్దరిల్లుతోంది. ''పేలుళ్ళతో మా ఇల్లు రాత్రంతా ప్రకంపనలు పుట్టాయి. పదాతి దళాలు, యుద్ధవిమానాలు హోరెత్తిస్తున్నాయి. అంబులెన్సుల సైరన్లు వినిపిస్తున్నాయి, మేం ఎక్కడికి పారిపోవాలి?'' అని గాజా సిటీ నివాసి అహ్మద్ అల్ షాంటీ ప్రశ్నించారు. జైటౌన్,సాబ్రా ప్రాంతాల నుండి పాలస్తినా ప్రజలు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు. ''వారం రోజులుగా రాత్రిళ్ళు మాకు నిద్ర లేదు, రాత్రంగా దూరంగా తూర్పున పేలుళ్ళతో ఆకాశమంతా భయంకరమైన కాంతులు పరచుకుంటున్నాయి, దాడులు ఆగడంలేదు'' అని గాజా సిటీ నుండి వెళ్ళిపోతున్న మహిళ అమల్ అబ్దెల్ ఆల్ చెప్పారు. మరోవైపు హమాస్ ఒక ప్రకటన చేస్తూ, అమాయకులైన ప్రజలపై ఇజ్రాయెల్ అమానుషమైన యుద్ధాన్ని కొనసాగిస్తోందని విమర్శించింది. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పుకున్నాగానీ ఇజ్రాయెల్ పట్టించుకోవడంలేదని హమాస్ విమర్శించింది. ఇప్పటివరకూ యుద్ధంలో కొన



సాగుతున్న సైనకులకు విశ్రాంతి ఇచ్చేందుకు వీలుగా సెప్టెంబరు నుండి 60,000 మంది రిజర్విస్టు సైనికులను ఇజ్రాయెల్ దశలవారీగా గాజా యుద్ధరంగంలోకి దింపుతున్నది.

### బందీల విడుదల, కాల్పుల విరమణ ఐక్యరాజ్యసమితి పిలుపు

బందీల విడుదల, గాజాలో తక్షణం కాల్పులు విరమణకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ పిలుపు ఇచ్చారు. గాజా సిటీ ఆక్రమణ కొత్త ప్రణాళిక అమలు కార్యాచరణ ప్రారంభించిన వెంటనే ఆయన తీవ్రంగా స్పందించారు. గాజాలో యుద్ధం ప్రారంభమై గురువారం (ఆగస్టు 21) నాటికి 685 రోజులు పూర్తయ్యాయి. గాజాలో మరణాలను, విధ్వంసాన్ని ఆపేయడానికి కాల్పుల విరమణ చాలా ముఖ్యమైన విషయమని ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. ఆఫ్రికా అభివృద్ధిపై టోక్యోలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. 50 మంది ఇజ్రాయెలీ బందీలను బేషరతుగా ఒకేసారి హమాస్ విడుదల చేయాలని, ఇజ్రాయెల్ కూడా కాల్పుల విరమణ తక్షణం అమలు చేయాలని కోరారు. అంతర్జాతీయస్థాయిలో ఒత్తిడి చేస్తున్నాగానీ ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 86 శాతం గాజా ప్రాంతంలో ప్రజలను ఖాళీ చేయాలని సైన్యం ఒత్తిడిచేస్తోందన్నారు. రెడ్‌క్రాస్ కూడా ఒక ప్రకటన చేస్తూ, గాజా సిటీ ఆక్రమణ వల్ల మరింత సంక్షోభం ఏర్పడుతుందని, ప్రజలకు ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

### హమాస్‌తో సంబంధంలేదు గాజాను ఆక్రమిస్తాం : నేతన్యాహూ

హమాస్‌తో సంబంధం లేకుండా గాజాను పూర్తిగా ఆక్రమిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి, బందీల విడుదలకు హమాస్ అంగీకరించిందా? లేదా? అనే విషయంతో తమకు సంబంధం లేదని, గాజాను పూర్తిగా ఆక్రమించి తీరుతామని అన్నారు. గురువారం నాడు ప్రసారమైన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం చెప్పారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌పై తన విమర్శల దాడిని కొనసాగించారు. ఉగ్రవాదులపట్ల అల్బనీస్ బుజ్జగింపు ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అత్యంత బలహీనమైన ప్రధానమంత్రిగా ఆల్బనీస్‌ను విమర్శించడంతో ఇంతకుముందే వివాదం చెలరేగింది. ''ఆయన ఒక ప్రజా నాయకుడుగా కీర్తిప్రతిష్టలున్నమాట ఒప్పుకుంటా,కానీ హమాస్ ఉగ్రవాదులు ఆయన చూపిస్తున్న ప్రేమ, సమర్థింపు ఆయన బలహీనత, ఆయన ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని నెతన్యాహూ విమర్శించారు. ప్రపంచంలో అత్యంత దుర్మార్గపూరితమైన ఉగ్రవాద సంస్థగా హమాస్‌ను ఆయన పేర్కొన్నారు. వారు మహిళల తలలు నరుకుతున్నారు, వారిపై అత్యాచారాలు చేస్తున్నారు, హీనంగా ప్రవర్తిస్తున్నారు, అలాంటివారు అల్బనీస్‌ను ప్రశంసించారంటే ఎక్కడో తప్పు జరుగుతోందని నెతన్యాహూ విమర్శించారు.

## ఉగ్ర గోదారి (మొదటి పేజీ తరువాయి)

గోదావరికి వరద తాకిడి పెరిగింది. గోదావరిపై ఉన్న ప్రాజెక్టులు నీటితో నిండుకోవడంతో గేట్లు ఎత్తి ఆ నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో పాటు ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహిత నదులు, తాలిపేరు ప్రాజెక్టు వరద నీరు గోదావరిలోనే కలవడంతో వరద మరింతగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం గోదావరి నిరకడగా మారడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. భద్రాచలం నుండి చర్ల వెళ్లే రహదారిలోని ఎటపాక, తూరుబాక, గంగోలు, పెద్దబండిరేవు ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్‌టిసి సైతం రవాణా సదుపాయాలను నిలుపుదల చేశారు. కూనవరం వెళ్లే దారిలో కొల్లుగూడెం, నెల్లిపాక వద్ద గోదావరి రోడ్డుపై తిష్ట వేయడంతో అంతరాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్‌కాలనీ ప్రజలను అధికారులు అప్రమత్తం చేశా రు. ఏక్షణమైనా వరద పెరిగే అవకాశం ఉండటంతో అంతా వరద శిభిరాలకు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచించారు. గోదావరి తీరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రజలు ఎవ్వరూ గోదావరి తీరానికి వెళ్లరాదని, మత్స్యకారులు చేపలు పట్టేందుకు నదిలోనికి దిగడం మంచిదికాదని తెలిపారు.

## అవినీతి (మొదటి పేజీ తరువాయి)

దాదాపు రూ.16 లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇచ్చి దేశానికి అన్నం పెట్టే రైతులకు ఎలాంటి రాయితీలు ఇవ్వకపోవడం వారి ఆర్థిక విధానాలను తెలియజేస్తుందన్నారు. పాలస్తీనాలో తొంబై శాతం మంది భారతీయులు ఉండగా, ఆ దేశంపై యుద్ధం చేస్తూ మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ వైఖరిని ప్రపంచంలోని 142 దేశాలు వ్యతిరేకిస్తుండగా, భారత్‌లోని బిజెపి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం గర్హనీయమన్నారు. పహల్గామ్ సంఘటనకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' ప్రపంచంలోని ఒక్క దేశం కూడా మద్దతు ఇవ్వకపోవడం విదేశాంగ విధానంలో భారత్ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి నిదర్శనమన్నారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా మరింత పటిష్టమైన విధానాలను రూపొందించుకుని ముందుకు సాగితే తప్ప బిజెపిని ఎదుర్కోలేమని, ఇందు కోసం దేశంలో వామపక్ష పార్టీల ఐక్యత కోసం సిపిఐ విశేష కృషి చేస్తున్నప్పటికీ ఇంకా చేయాల్సి ఉందన్నారు. సిపిఐలోని ప్రతి నాయకుడు, కార్యకర్త తీసుకున్న బాధ్యతను సమర్థివంతంగా నిర్వర్తించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాల్న ఆయన కోరారు.

## యూరియా కొరత (మొదటి పేజీ తరువాయి)

విషలమైందన్నారు. యూరియ కొరత ఏర్పడటానికి కేంద్ర ప్రభుత్వమే కరణమన్నారు. తెలంగాణ రైతులను ఆదుకునేందుకు కేంద్రం మెడలు వంచైనా యూరియా తెప్పిస్తామని అన్నారు. అధికారం కోల్పోయిన పార్టీలు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తుతాం బటన్‌లు నొక్కుతామని సొల్లు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు.టి బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. యూరియా ఇతర పారిశ్రామిక అవసరాలకు వినియోగం పై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు అధికారం పీకేసిన పార్టీలు పెత్తనం చేస్తామంటే అపహాస్యంగా ఉందన్నారు. రాజకీయ స్వార్థంతో బిఆర్‌ఎస్,బిజెపి పార్టీలు రైతాంగం ను గందరగోళం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం కోసం పార్టీలు పని చేయాలని హితవు పలికారు. రష్యా ఉక్రెయిన్, ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధాల వల్ల రెడ్‌సీలో నౌకాయనం నిలిచి ఇంపోర్ట్ యూరియా సరఫరా లో జాప్యం జరిగిందన్నారు. చైనా నుంచి ఇంపోర్ట్ కావల్సిన యూరియా ను తెప్పించడం లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. పార్లమెంట్ ఆవరణలో మా ఎంపిలు ఆందోళన చేస్తేనే ఈ వారంలో యాభై వేల మెట్రిక్ టన్నులు యూరియా ఇస్తామన్నారు. గత ఐదు నెలలుగా లోటు సరఫరా చేసిన యూరియా కూడా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి యూరియా సరఫరాపై చొరవ తీసుకోవాలని కోరారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు యూరియా కొరత పై వ్యక్తిగతంగా వివరించానని తెలిపారు.

## నామినేషన్ దాఖలు

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలను సమర్పించారు. 160 మంది ఎంపిలు ప్రతిపాదకులు, ద్వితీయులుగా సంతకం చేశారు. వీరిలో ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, డింపుల్ యాదవ్, అఖిలేష్ యాదవ్, ఇతర అగ్ర నాయకులు ఉన్నారు. ప్రతి సెట్‌లో 20 మంది ద్వితీయ ప్రతిపాదకులు కూడా ఉన్నారు. రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలను పరిశీలించి, సుదర్శన్‌రెడ్డి రసీదు అందజేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని కనీసం 20 మంది ఓటర్లు ప్రతిపాదకులుగా, కనీసం 20 మంది ఓటర్లు ద్వితీయులుగా సభ్యత్వాన్ని పొందాలి. విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయాలనే చర్య ఉఈ ఎన్నికల్లో దక్షిణ వర్సెస్ దక్షిణ పోటీగా మార్చింది. దేశంలో రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవికి రాజకీయేతర ముఖాన్ని తమ నామినీగా ఎంచుకోవాలని కూడా ప్రతిపక్షాలు కోరుకున్నాయి. అధికార ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ ను ఎంపిక చేసింది. తమిళనాడుకు చెందిన అనుభవజ్ఞుడైన బిజెపి నాయకుడు, ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం కలిగిన వారు రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.

**నిబద్ధతతో నామినేషన్ వేశా : సుదర్శన్‌రెడ్డి**

నామినేషన్ దాఖలు అనంతరం సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నిక కేవలం ఒక వ్యక్తికి సంబంధించినది కాదన్నారు. పార్లమెంటు సమగ్రతతో పనిచేసే, అసమ్మతిని గౌరవించే సంస్థలు, స్వాతంత్ర్యం, న్యాయంగా ప్రజలకు సేవ చేసే భారతదేశ ఆలోచనను పునరుద్ఘాటించేదని నొక్కి చెప్పారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే, నిష్పాక్షికత, గౌరవం, సంభాషణలు, మర్యాదకు దృఢమైన నిబద్ధతతో తన పాత్రను నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ చేశారు. 'ఈరోజు, ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా భారత ఉపరాష్ట్రపతి పదవికి నా నామినేషన్ పత్రాలను దాఖలు చేసే గౌరవం నాకు లభించింది. నేను లోతైన వినయం, బాధ్యత, మన రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువల పట్ల అచంచలమైన నిబద్ధతతో నామినేషన్ పత్రాలు దఖాలు చేశాను' అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. 'భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, న్యాయ విద్యార్థిగా, ఈ గణతంత్ర ప్రజాస్వామ్య సంప్రదాయాలలో పాతుకుపోయిన పౌరుడిగా నా ప్రజా సేవ జీవితం ప్రతి వ్యక్తి గౌరవం, రాజ్యాంగ నైతికత రక్షణ, మన వైవిధ్యంలో ఐక్యతలో భారత దేశ నిజమైన బలం ఉందని నాకు నేర్పింది' అని ఆయన అన్నారు. రాజ్యసభ చైర్‌పర్సన్‌గా ఉపరాష్ట్రపతి పార్లమెంటరీ ప్రజాస్వామ్య అత్యున్నత సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యతను నిర్వర్తిస్తున్నారని ఆయన అన్నారు. తనపై నమ్మకం ఉంచినందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులకు, న్యాయం, సమానత్వం, సామరస్యం కోసం ఈ సమష్టి పోరాటాన్ని ప్రేరేపిస్తున్న అనేక మంది పౌరులకు సుదర్సన్‌రెడ్డి కూడా ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. మన రాజ్యాంగం పట్ల నమ్మకంతో, ప్రజలపై ఆశతో తాను ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానన్నారు. మన ప్రజాస్వామ్య స్ఫూర్తి మనందరికీ మార్గనిర్దేశం చేస్తూనే ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు.

## రెండు శ్లాబులే

(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్‌లకు చెందినవారు కాగా, మిగిలిన ముగ్గురూ ప్రతిపక్ష పాలిత కర్ణాటక (కాంగ్రెస్), కేరళ (వామపక్ష సంఘటన ప్రభుత్వం), పశ్చిమ బెంగాల్ (తృణమూల్ కాంగ్రెస్) రాష్ట్రాలకు చెందినవారు. జిఎస్‌టి విధానంలో, కేంద్ర రాష్ట్రాలమధ్య ఆదాయ వనరుల పంపిణీలో అనేక లొసుగులు ఉన్నాయని రాష్ట్రాల నుండి విమర్శలు వెల్లువెత్తటం, మరోవైపు కొన్ని రాష్ట్రాలలో ఎన్నికలు రావడంతోపాటు అనేక ప్రతికూల పరిస్థితులమధ్య వినియోగదారు అనుకూల విధానం అనుసరించడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను ఆరుగురు సభ్యులతో కూడిన జిఎస్‌టి మంత్రుల బృందం ఆమోదించింది. సామాన్య ప్రజలకు, సాధారణ వినియోగదారులకు మేలు కలుగుతుందనుకుంటే ఈ నిష్పత్తిని, శ్లాబుల హేతుబద్ధీకరణకు కూడా మం త్రులబృందం సానుకూలంగా ఉందని సామ్రాట్ చౌధురి చెప్పా రు. రెండు శ్లాబులను తొలగించేందుకు మంత్రుల కమిటీ అంగీకరించిందని, కేంద్రానికి ఈ మేరకు సిఫార్సు చేస్తామని చెప్పారు. అన్ని రాష్ట్రాలూ ఈ ప్రతిపాదిత మార్పులను స్వాగతించాయని ఉత్తర ప్రదేశ్ ఆర్థికమంత్రి సురేశ్ కుమార్ ఖన్నా చెప్పారు. పశ్చిమ బెంగాల్ ఆర్థికమంత్రి చంద్రిమా భట్టాచార్య మాట్లాడు తూ, కేంద్రం ప్రతిపాదించిన రేటు హేతుబద్ధీకరణలో రాష్ట్రాల కు వచ్చే నష్టాన్ని ఎలా భర్తీచేస్తారన్న విషయాన్ని వివరించి చెప్పలేదని విమర్శించారు. శ్లాబుల మార్పులవల్ల జరిగే ఈ ఆదాయ నష్టాన్ని ఎలా భర్తీ ని ఒక వైపు ప్రతిపక్ష పాలిత మంత్రులు ప్రశ్నిస్తుండగా, దీనిపై ఎస్‌బిఐ పరిశోధనా నివేదిక వెలువడింది. దీని ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జిఎస్‌టి సంస్కరణలవల్ల ప్రతి సంవత్సరం కోశాగారానికి రూ.85,000 కోట్ల మేరకు భారం పడతుంది. దీనివల్ల రూ.1.98 లక్షల కోట్ల మేరకు వినియోగవృద్ధి జరుగుతుందని నివేదిక అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థ ఊపు అందుకుంటుందని, పన్నుల్లో కోతల వల్ల ధరలు తగ్గుతాయని, ప్రజల్లో వ్యయాలు భారీగా పెరగుతాయని కూడా నివేదిక అంచనావేసింది.

## చూస్తూ ఊరుకోవాలా?

(మొదటి పేజీ తరువాయి)

అవలంబించడం కూడా కనుగొనబడింది.రాష్ట ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఉన్నటువంటి ప్రతిష్ఠంభనకు ముగింపు పలకడానికి రాజనీతిజ్ఞత, రాజకీయ పరిణతితో ప్రార్థిస్తారు' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఉద్ఘాటించారు.'ఈ దేశంలోని ప్రతీ సమస్యకూ కోర్టులో పరిష్కారాలు ఉండకపోవచ్చని నేను చెబుతున్నాను. దేశంలో ఉన్న ఎన్నో సమస్యలకు అక్కడ మీరు వ్యవస్థలోనే పరిష్కారాలు కనుగొంటారు' అని తుషార్ మెహతా చెప్పారు. అప్పుడు సిజెఐ బిఆర్.గవాయ్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి మాట్లాడుతూ 'ఏదైనా తప్పు ఉంటే దానికి పరిష్కారం ఉంటుంది. ఈ కోర్టు రాజ్యాంగానికి సంరక్షుడు.రాజ్యాంగానికి అక్షరాల అర్థం ఇవ్వడం ద్వారా రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి' అని ఆయన అన్నారు. అప్పుడు జస్టిస్ సూర్యకాంత్ సిజెఐ బిఆర్.గవాయ్‌తో ఏకీభవిస్తూ వ్యాఖ్యాన అధికారం సుప్రీం కోర్టుకు ఉంటే, చట్టం యొక్క వ్యాఖ్యానాన్ని కోర్టు ప్రయత్నించాలన్నారు. ఈ కోర్టు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పరిష్కరించడంలో గవర్నర్‌కు నిర్దిష్ట టైమ్‌లైన్‌ను నిర్ణయించమని పార్లమెంట్‌ను కోరవచ్చు. కానీ ఈ కోర్టు తీర్పు ద్వారా అది సాధ్యం కాకపోవచ్చని మెహతా జోడించారు. 'మీరు అలాచేయలేరని తీవ్రమైన అభిప్రాయం ఉంటే రాజ్యాంగాన్ని అమలు చేస్తే మాకు అలా అధికారం లేదని మీరు అంటున్నారా?' అని జస్టిస్ నరసింహ్మ ప్రశ్నించారు. తర్వాత సొలిసిటర్‌జనరల్ తుషార్ మెహతా తమిళనాడు గవర్నర్ కేసులో ఏప్రిల్ 8నాటి తీర్పును ప్రస్తావించారు.ఇది ప్రస్తుత రాష్ట్రపతి సూచనకు దారితీసింది. రాష్ట్రపతి, గవర్నర్ కారణాలను నమోదు చేస్తారని, వారు టైమ్‌లైన్‌ను పాటించకపోతే రాష్ట్రాలు సుప్రీంకోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించవచ్చని తీర్పులు చెబుతున్నాయి. 'దీని అర్థం ఒక సంస్థ రాష్ట్రపతిని కొంత కాలపరిమితిలోపు అతా చేయమని నిర్దేశిస్తోంది. నేను ఆదేశాలను గౌరవిస్తాను. సమర్థన ఉండవచ్చు కానీ అది అధికార పరిధిని ఇవ్వదు' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.విచారణ జరుగుతోంది. అంతకు ముందు న్యాయపరమైన కార్యకలాపాలు న్యాయపరమైన ఉగ్రవాదంగా మారకూడదు అని ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ అన్నారు. ఎంతో అనుభవం ఉన్న ఎన్నికైన వ్యక్తులను ఎప్పుడూ తక్కువ అంచనావేయకూడదని తుషార్ మెహతా చెప్పినప్పుడు ప్రధానన్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు.

## దెబ్బతింటాయ్ (మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. వృద్ధి రేటులో లోటును పూరించేందుకు, రాష్ట్రాలు స్థిరంగా 14 శాతం వృద్ధిని సాధించేందుకు, మొదటి 5 సంవత్సరాల పాటు జిఎస్‌టి పరిహారం అందించే విధానం అమలులోకి వచ్చిందని, కానీ ఇప్పటి వరకు 14 శాతం వృద్ధి స్థిరపడలేదని, ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9 శాతం మధ్యలోనే ఉందని ఆయన తెలిపారు. ఆదర్శ వృద్ధి రేటు 14 శాతాన్ని, ప్రస్తుత 89 శాతం వృద్ధి రేటును అంశాన్ని పక్కన పెడితే , ప్రతిపాదనలు ఒంటరిగా పరిశీలిస్తే రాష్ట్రాలకు ప్రతికూల ఆదాయ వృద్ధికి దారితీసే అవకాశం ఉందని వివరించారు. తెలంగాణ, కర్నాటక, తమిళనాడు వంటి దక్షిణ రాష్ట్రాలు దేశ ఆదాయాలకు గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ, జాతీయ ఆదాయంలో వాటి వాటాకు తగిన విధంగా నిధుల పంపిణీ జరగడం లేదన్నారు. జిఎస్‌టి సంస్కరణలలో భాగంగా రేట్ రేషనలైజేషన్ ప్రతిపాదనకు మద్దతు తెలిపినా, ఇందుకు సరైన పరిహార యంత్రాంగం ఉండాలని స్పష్టం చేశారు.

**పరిహార సెస్సును రాష్ట్రాలకు ఇవ్వండి..**

లేదంటే 'లగ్జరీ'వస్తువులపై పన్ను పెంచి..ఆ అదనపు ఆదాయమైనా ఇవ్వండి...ప్రస్తుతం అమలులో ఉన్న పరిహార సెస్సును కొనసాగిస్తూ, దానివల్ల సమకూరే మొత్తాన్ని పూర్తిగా ఆయా రాష్ట్రాలకు ఇవ్వాలని భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. పరిహార సెస్సును రద్దు చేసి, సిగరెట్లు, మద్యం, విలాస వస్తువుల వంటి 'సిన్' లేదా లగ్జరీ ఉత్పత్తులపై జిఎస్‌టి రేట్లు ప్రస్తుత స్థాయికి పెంచి, అదనంగా లభించే ఆదాయాన్ని రాష్ట్రాలకు కేటాయించాలని సూచించారు. తద్వారా సాధారణ పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గడంతో పాటు, పేద, మధ్యతరగతి సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా కొనసాగిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

## అమలుచేయాలి (మొదటి పేజీ తరువాయి)

తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆర్‌టిసిలో కార్మిక సంఘాలకు ఎన్నికలను నిర్వహించడంతో పాటు కార్మికుల అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ప్రతిపాదించిన తీర్మానాన్ని ప్రతినిధుల సభ ఆమోదించింది. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు అర్హులైన గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కల్లూరి వెంకటేశ్వరరావు, స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్యా ఉద్యోగ రంగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘ ం ప్రధాన కార్యదర్శి కె.సూర్య నారాయణ, పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి గత ఏడు దశబ్దాలు సాగు నీటికి నోచుకోని 57 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీటిని అందించాలని కొండపర్తి గోవిందరావు, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి జిఓ 60 ప్రకారం రూ.13,600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా తీర్మానాన్ని పెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ నాయకులు కె.ఏసురత్నం, సింగరేణి సంస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం ఉండరాదని సింగరేణి క్యాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య తీర్మానాలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని శ్రామిక ఫోరం నాయకురాలు పి.ప్రేమ్ పావని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని హైకోర్టు న్యాయవాది కె.ప్రభాకర్ రావు, జాబ్ క్యాలెండర్‌ను అమలు, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ పథకం అమలు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్, కుల వివక్ష, దళితులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని డిహెచ్‌పిఎస్ నాయకులు టి.లక్ష్మ ణ్‌లు ప్రవేశ పెట్టిన తీర్మానాలను ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. గీతపనివారల పెండింగ్ ఎక్స్‌గ్రేషియో రూ.13 కోట్లు వెంటనే చెల్లించాలని, 1/70 చట్టం పరిధిలోని ప్రాంతాల్లో టి ఎఫ్ టి, టి సి ఎస్ లలో గీత కార్మికులకు సభ్యత్వం కల్పించి ఇతర ప్రాంతాలలో మాదిరిగానే అన్ని ప్రయోజనాలను వర్తింపజేయాలని గీతపనివారల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది.

## చర్చ తర్వాతా? ముందా?

(మొదటి పేజీ తరువాయి)

జరిగాయి. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యం సుందరం, దామాశేషాద్రి నాయుడు వాదించారు.కమిషన్ నివేదిక ఏకపక్షంగా ఉంది. సాక్షిగా విచారణకు పిలిచి వివరాలు కోరితే పిటిషనర్లు కమిషన్‌కు చెప్పారు. ఇతర సాక్షులు అభియోగాలు చేసి ఉం ఎంక్వయిరీస్ ఆఫ్ కమిషన్ యాక్ట్–1952లోని సెక్షన్ 8–బి కింద పిటిషనర్లకు నోటీసు ఇవ్వాలేదు. తమపై ఆరోపణలు చేసిన వాళ్లను క్రాస్ ఎగ్జామ్ చేసేందుకు కమిషన్ నోటీసులు ఇవ్వలేదు. కమిషన్ విచారణకు ఆఖరి సాక్షి కేసీఆర్. అప్పటికే తమపై ఎవరైనా ఆరోపణలు చేసి ఉం ఆ విషయాలను కేసీఆర్‌ను కమిషన్ ప్రశ్నించాలి. ఇలా చేయలేదు. ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై లేనిపోని విమర్శలు చేసింది. అధికారంలోకి రాగానే మేడిగడ్డ పిల్లర్ బీటలు వారడాన్ని అడ్డం పెట్టుకుని విచారణ కమిషన్‌ను నియమించింది. కుట్రతో 2024 మార్చి 14న జీవో 6 ద్వారా కమిషన్ ఏర్పాటు చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీల ప్రణాళిక, డిజైన్, నిర్మాణంపై కమిషన్ విచారణ చట్ట వ్యతిరేకంగా సాగింది. 2007లో ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మించాలని ఉమ్మడి ఏపీ సర్కార్ నిర్ణయించింది. మహారాష్ట్ర అభ్యంతరం చెప్పడంతో ముందుకు సాగలేదు. 2014లోతెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో సెంట్రల్ పబ్లిక్ సెక్టర్ సంస్థతో సర్వే జరిగింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బారేజీల నిర్మాణాలతో కాళేశ్వరం లిఫ్ట్ ప్రాజెక్టుకు పిటిషనర్ కేసీఆర్ సీఎంగా ఉండగా క్యాబినెట్ ఆమోదం చెప్పింది. సెంట్రల్ వాటర్ కమిషన్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతులు కూడా ఇచ్చాయి. అయితే, కేసీఆరే స్వయంగా ప్రాజెక్ట్ ప్రదేశాలను ఎంపిక చేశారని తప్పుగా కమిషన్ తేల్చింది. కేబినెట్ ఆమోదం లేదని కూడా చెప్పడం సరికాదు. పరిపాలనా అనుమతులు కూడా ఉన్నాయి. కాంట్రాక్టర్లకు అనుకూలంగా, అదనపు పనులకు ఆదేశాలిచ్చామని కమిషన్ చెప్పడం వాస్తవం కాదు. బారేజీల్లో పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేయడంతో మేడిగడ్డ పిల్లర్ బీటలు వారిందని చెప్పడం కూడా నిజంకాదు అని వాదించారు. రాష్ట్రం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ కమిషన్ ముందున్న సమాచారం మేరకు విచారణ ఉంటుందని, సెక్షన్ 8–బి, 8–సి సెక్షన్ల కింద నోటీసు ఇవ్వాలనే నిబంధన ఏమీలేదన్నారు. ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా వెచ్చించిన తర్వాత కూడా నీళ్లను లిఫ్ట్ చేయలేని దుస్థితి ఉందన్నారు. కమిషన్ నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో లోతుగా చర్చ జరగాల్సివుందని, పిటిషనర్లు ఇద్దరూ ఎమ్మెల్యేలని, అసెంబ్లీలో జరిగే చర్చలో అన్ని విషయాలు వాళ్లు చెప్పకునే ఆస్కారం ఉందన్నారు. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని, పిటిషన్లను కొట్టివేయాలన్నారు. లేదం కౌంటర్ వేస్తామని, గడువు కావాలని కోరారు. కమిషన్ రిపోర్టును ప్రభుత్వ వెబ్‌సైట్స్‌లో అప్‌లోడ్ చేయదన్నారు. కమిషన్ తరపున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదిస్తూ, కమిషన్ సమగ్రంగా విచారణ జరిపిందన్నారు. పిటిషనర్లు చెబుతున్న సుప్రీం కోర్టు తీర్పులు ఇక్కడ వర్తించవన్నారు. కమిషన్ రిపోర్టుపై జోక్యం అవసరం లేదన్నారు. వాదనలపై హైకోర్టు, కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాక తదుపరి చర్యలు ఉంటాయో, లేక చర్యలు తీసుకున్నా అసెంబ్లీలో రిపోర్టు పెడతారో శుక్రవారం జరిగే విచారణ సమయంలో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## బిజెపి యత్నం (మొదటి పేజీ తరువాయి)

కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ముప్పై రోజులు జైలులో ఉంటే చట్టసభల పదవులను రద్దు చేసేలా చట్టం చే సేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఒ క వేళ అలాంటి చట్టం తీసుకువస్తే దాదాపు రెండేళ్లు జైలులో ఉన్న అమిత్‌షా పదవినే తొ లుత రద్దు చేయాలన్నారు. అత్యంత ప్రజాస్వా మ్య దేశంగా ఉన్న భారతదేశం, అమెరికాకు భయపడాల్సిన అవసరం ఏమిటని డాక్టర్ నా రాయణ ప్రశ్నించారు. భారత అలీన విధానానికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం ఇజ్రాయెల్ తదితర దేశాలకు మద్దతు ఇస్తుందన్నారు. ఉప రాష్ట్రపతి స్థాయి వ్యక్తి చట్ట సభ నుంచి రాత్రికి రాత్రి మాయం కావడం భారతదేశ చరిత్రలో మొదటిసారి అని నారాయణ అన్నారు. చట్టసభల్లో ప్రభుత్వానికి మద్దతు కోసం ఎంపిల లొ సుగులను ఆసరాగా చేసుకుని ఇడి, ఐటి దా డులను చేస్తున్నారని, వారికి లొంగితే క్షమాభిక్ష పెడుతున్నారని, లొంగకపోతే జైలుకు పం పుతున్నారన్నారు. చివరకు ఉప రాష్ట్రపతి ఎన్నికలో సైతం ప్రజాప్రతినిధులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఎపిలోని చంద్రబాబు నా యుడు, జగన్ పార్టీ సభ్యులు బిజెపి అభ్యర్థికి ఓటు వేయనట్లయితే మరుసటి రోజే వారు జైలులో ఉంటారన్నారు.

**సిపిఐలో ట్రాన్స్‌జెండర్‌లకు సభ్యత్వం**

సమాజంలో పెద్ద సంఖ్యలో ఉన్న ట్రాన్స్‌జెండర్‌లకు కూడా కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం ఇవ్వాలని, వారి సమస్యలపై దృష్టి సారించాలని డాక్టర్ నారాయణ సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయనట్లయితే ప్రజా సంఘాల మనుగడ కష్టసాధ్యమని, ప్రజా పోరాటాలు కొనసాగించాల్సిందేనని ఆయన ఉద్ఘాటించారు. పార్టీలో యువత, విద్యార్థులు, మహిళలను పార్టీలో ప్రొత్సహించాలలన్నారు. వెనుకబడిన తరగతుల (బిసి) కు 52 శాతం రిజర్వేషన్‌ను, రాజ్యాంగపరమైన హక్కులను కల్పించాలని బిసిలు చేస్తున్న పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, వారితో కలిసి కదనరంగంలోకి దిగాల్సిందేనన్నారు.

### జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బిఆర్‌ఎస్ మద్దతు ఇవ్వబోమనడమేమిటి?

జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ప్రకటించిన ఉప రాష్ట్రపతి అభ్యర్థి, తెలంగాణ వాది జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి తెలంగాణ సెంట్‌మెంట్ ఉన్న బిఆర్‌ఎస్ మద్దతు ఇవ్వబోదనడం బిఆర్‌ఎస్ అవకాశవాద రాజకీయాలకు నిదర్శమని డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఇండియా కూటమిలో ఉండబోమని ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కెజ్రివాలే ఇప్పుడు ఇండియా కూటమి ప్రకటించిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ప్రకటించారని, మరి బిజెపికి వ్యతిరేకమైన బిఆర్‌ఎస్ పార్టీ మాత్రం మద్దతు ఇవ్వకపోవడం కెటిఆర్‌ది వీరోచిత పలాయనమని డాక్టర్ నారాయణ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న ధైర్యం బిఆర్‌ఎస్‌కు లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి తాము ఓటు వేయబోమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారాక రామారావు ప్రకటించడం సిగ్గు చేటు అని అన్నారు. సిఎంరేవంత్ రెడ్డికి ఉప రాష్ట్రపతి అభ్యర్థి ప్రకటనకు అసలు ఏమి సంబంధమని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని ఎన్‌డిఎకు ఓటు వేస్తున్న బిఆర్‌ఎస్ వైఖరికి మించిన దివాళాకోరుతనం మరొకటి ఉండబోదని పేర్కొన్నారు.

ఫారం-6
చూడుము రూల్ - 19 యొక్క సబ్ రూల్ -1
మరియు చట్టం - 30/2013 లోని సెక్షన్ 11(1)

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ (భూసేకరణ)

ప్రాథమిక ప్రకటన

జి/358/2025 తేది: 08.08.2025
నెం.జి/335/1/2025 తేది: 08.08.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, దామరచర్ల మండలం, వాడపల్లి గ్రామంలో భూమి విస్తీర్ణం **ఎక. 30-38 3/4 గుంటలు** ప్రజాప్రయోజనార్థం న్యూఫోర్ లేన్ సిసి రోడ్, యదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నుండి నార్కెట్ పల్లి - అద్దంకి - మేదారమెట్ల రోడ్(స్టేట్ హైవే -2) వరకు నిర్మాణానికి ఈ దిగువ చూపిన భూమి అవసరం ఉన్నదని భావించినందున, భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల శాఖ జి.ఓ. నెం. 47, తేదీ: 18.06.2025 జారీ చేసినారు అట్టి G.O నందు భూసేకరణ చట్టం 2013 (చట్టం నెం.30 ఆఫ్ 2013) లోని 2013 చట్టం కింద అధ్యాయం II మరియు అధ్యాయం III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడింది.

కావున, ఈ ప్రాజెక్టు నల్లగొండ జిల్లా, వాడపల్లి మండలం, దామరచర్ల గ్రామంలో భూమి విస్తీర్ణం ఎక. **30-38 3/4 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము: వాడపల్లి మండలము: దామరచర్ల జిల్లా: నల్గొండ

| క్ర.సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | విస్తీర్ణం ఎక గుంటలు | భూమిని కోల్పోయే రైతు పేరు మరియు తండ్రి / భర్త పేరు | [illegible] |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 18 | 2 | ఖుష్కి | పట్టా | 00.25 1/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 2 | 23 | 2 | ఖుష్కి | బంచరాయి | 03-25.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 3 | 117 | 2 | ఖుష్కి | పట్టా | 01.04 1/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 4 | | | ఖుష్కి | పట్టా | 00.30 1/4 | బొడ్డు సాంబయ్య తండ్రి సైదులు | |
| 5 | | | ఖుష్కి | పట్టా | 00.30 1/4 | బొడ్డు శ్రీనివాసులు తండ్రి సైదులు | |
| 6 | | | ఖుష్కి | పట్టా | 00.30 1/4 | బొడ్డు రామయ్య తండ్రి సైదులు | |
| ఉప మొత్తం:- | | | | | 03-15.00 | | |
| 7 | 118 | 2 | ఖుష్కి | పట్టా | 00-09.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 8 | 120 | 2 | ఖుష్కి | పట్టా | 01.08 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 9 | | | ఖుష్కి | | 00.20 1/4 | రైల్వే లైన్ | |
| ఉప మొత్తం:- | | | | | 01-29.00 | | |
| 10 | 125 | 2 | ఖుష్కి | పట్టా | 00-36 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 11 | 143 | 2 | ఖుష్కి | పట్టా | 00-38 1/2 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 12 | 144 | 2 | ఖుష్కి | పట్టా | 00-21 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 13 | 145 | 2 | ఖుష్కి | పట్టా | 00-01.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 14 | 154 | 2 | ఖుష్కి | పట్టా | 03-01.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 15 | 155 | 2 | ఖుష్కి | పట్టా | 00-09.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 16 | 165 | 2 | ఖుష్కి | పట్టా | 00-35 3/4 | స్పిరిట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 17 | 166 | 2 | ఖుష్కి | పట్టా | 00-06 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 18 | | | ఖుష్కి | పట్టా | 01-10 1/2 | స్పిరిట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ | |
| ఉప మొత్తం:- | | | | | 01-17 1/4 | | |
| 19 | 180 | 2 | ఖుష్కి | పట్టా | 00-17.00 | వేముల లక్ష్మమ్మ భర్త భాస్కర్ రావు | |
| 20 | | | ఖుష్కి | పట్టా | 00-17 1/4 | వేముల విజయ్ భర్త అమృతం | |
| ఉప మొత్తం:- | | | | | 00-34 1/4 | | |
| 21 | 181 | 2 | ఖుష్కి | పట్టా | 00-16.00 | బయ్య బంగారమ్మ భర్త సైదులు | |
| 22 | | | ఖుష్కి | పట్టా | 00-16 1/4 | బయ్య సైదయ్య తండ్రి | |
| ఉప మొత్తం:- | | | | | 00-32 1/4 | | |
| 23 | 185 | 2 | ఖుష్కి | పట్టా | 00-03 3/4 | వేముల లక్ష్మమ్మ భర్త భాస్కర్ రావు | |
| 24 | | | ఖుష్కి | పట్టా | 00-03 3/4 | వేముల విజయ్ భర్త అమృతం | |
| 25 | | | ఖుష్కి | పట్టా | 00-01 1/2 | కోల నర్సింహా రావు తండ్రి వెంకటేశ్వర్లు | |
| 26 | | | ఖుష్కి | పట్టా | 00-24 1/2 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| ఉప మొత్తం:- | | | | | 00-33 1/2 | | |
| 27 | 188 | 2 | ఖుష్కి | పట్టా | 00-22 3/4 | కొటిక కొండయ్య తండ్రి వెంకటేశ్వర్లు | |
| 28 | | | ఖుష్కి | పట్టా | 00-04.00 | లొట్టపల్లి నాగ సైదమ్మ భర్త వెంకయ్య | |
| 29 | | | ఖుష్కి | పట్టా | 00-26 3/4 | కొటిక వెంకటేశ్వర్లు తండ్రి సత్తయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-13 1/2 | | |
| 30 | 208 | 2 | ఖుష్కి | పట్టా | 00-01.00 | బెల్లంకొండ సుశీల భర్త శ్రీను | |
| 31 | | | ఖుష్కి | పట్టా | 00-01.00 | వాకిటి వెంకటేశ్వర్లు తండ్రి వెంకయ్య | |
| 32 | | | ఖుష్కి | పట్టా | 00-09 1/2 | గద్దం వెంకన్న తండ్రి మల్లయ్య | |
| 33 | | | ఖుష్కి | పట్టా | 00-07 1/4 | కాసాని దుర్గమ్మ భర్త మల్లయ్య | |
| 34 | | | ఖుష్కి | పట్టా | 00-02 1/4 | కాలువ | |
| ఉప మొత్తం:- | | | | | 00-21.00 | | |
| 35 | 209 | 2 | ఖుష్కి | పట్టా | 00-01 3/4 | గుండు సైదులు తండ్రి గుర్వయ్య | |
| 36 | | | ఖుష్కి | పట్టా | 00-02.00 | కాలువ | |
| 37 | | | ఖుష్కి | పట్టా | 00-17 3/4 | వ్యక్తి తెలియదు | |
| 38 | | | ఖుష్కి | పట్టా | 00-06 3/4 | కాసాని దుర్గమ్మ భర్త మల్లయ్య | |
| 39 | | | ఖుష్కి | పట్టా | 00-03 1/2 | కాసాని వరలక్ష్మి భర్త గోపయ్య | |
| 40 | | | ఖుష్కి | పట్టా | 00-08.00 | రాయికింది ఇందిరమ్మ భర్త నారాయణ | |
| 41 | | | ఖుష్కి | పట్టా | 00-01 1/4 | గద్దం వెంకన్న తండ్రి మల్లయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-01.00 | | |
| 42 | 210 | 2 | ఖుష్కి | పట్టా | 00-20 1/2 | గద్దం వెంకయ్య తండ్రి పెద కోటయ్య | |
| 43 | | | ఖుష్కి | పట్టా | 00-23 1/2 | నార్సింగ్ ఈశ్వరమ్మ భర్త సైదులు | |
| 44 | | | ఖుష్కి | పట్టా | 00-11 1/2 | బెల్లంకొండ సుశీల భర్త శ్రీను | |
| 45 | | | ఖుష్కి | పట్టా | 00-07 1/4 | వాకిటి కోటేశ్వర్‌రావు తండ్రి వెంకయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-22 3/4 | | |
| 46 | 217 | 2 | ఖుష్కి | పట్టా | 00-02 1/4 | దాసరి కొండయ్య తండ్రి శ్రీరాములు | |
| 47 | | | ఖుష్కి | పట్టా | 00-10 1/4 | లొట్టపల్లి గుర్వయ్య తండ్రి తిరుపతయ్య | |
| 48 | | | ఖుష్కి | పట్టా | 00-14 1/4 | బయ్య జీడయ్య తండ్రి లింగయ్య | |
| 49 | | | ఖుష్కి | పట్టా | 00-00 1/2 | ముప్ప లక్ష్మీ నర్సమ్మ భర్త సత్యనారాయణ | |
| 50 | | | ఖుష్కి | పట్టా | 00-02.00 | రాయికింది నాగయ్య తండ్రి వెంకటేశ్వర్లు | |
| ఉప మొత్తం:- | | | | | 00-29 1/4 | | |
| 51 | 218 | 2 | ఖుష్కి | పట్టా | 00-33.00 | పద్దు పాపయ్య తండ్రి వెంకయ్య | |
| 52 | | | ఖుష్కి | పట్టా | 00-18.00 | దాసరి కనకా రావు తండ్రి శ్రీరాములు | |
| 53 | | | ఖుష్కి | పట్టా | 00-18 3/4 | దాసరి కొండయ్య తండ్రి శ్రీరాములు | |
| ఉప మొత్తం:- | | | | | 01-29 3/4 | | |
| 54 | 219 | 2 | ఖుష్కి | పట్టా | 00-01 1/2 | రాయికింది నాగయ్య తండ్రి వెంకటేశ్వర్లు | |
| 55 | | | ఖుష్కి | పట్టా | 00-04.00 | బెల్లంకొండ వెంకన్న తండ్రి ఆదినారాయణ | |
| 56 | | | ఖుష్కి | పట్టా | 00-04.00 | రాయికింది బ్రహ్మం తండ్రి యెర్ర కోటయ్య | |
| 57 | | | ఖుష్కి | పట్టా | 00-10 1/2 | రాయికింది వెంకన్న తండ్రి పల్లయ్య | |
| 58 | | | ఖుష్కి | పట్టా | 00-08 1/2 | రాయికింది ఇందిరమ్మ భర్త రమేష్ | |
| 59 | | | ఖుష్కి | పట్టా | 00-09.00 | రాయికింది నర్సయ్య తండ్రి చిన్న గుర్వయ్య | |
| 60 | | | ఖుష్కి | పట్టా | 00-07 1/2 | రాయికింది బిక్షమ్మ భర్త శేఖర్ | |
| 61 | | | ఖుష్కి | పట్టా | 00-06 1/2 | రాయి కింది వెంకటేశ్వర్లు తండ్రి గుర్వయ్య | |
| 62 | | | ఖుష్కి | పట్టా | 00-13.00 | రాయికింది ఇందిరమ్మ భర్త నారాయణ | |
| 63 | | | ఖుష్కి | పట్టా | 00-07.00 | పాతులోతు రమేష్ తండ్రి హనుమ నాయిక్ | |
| 64 | | | ఖుష్కి | పట్టా | 00-07.00 | రాయికింది సురేశ్ తండ్రి లక్ష్మయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-38 1/2 | | |
| 65 | 220 | 2 | ఖుష్కి | పట్టా | 00-17 1/4 | పాతులోతు వెంకటేశ్వర్లు తండ్రి హనుమ నాయిక్ | |
| 66 | 221 | 2 | ఖుష్కి | పట్టా | 00-02.00 | పాతులోతు వెంకటేశ్వర్లు తండ్రి హనుమ నాయిక్ | |
| 67 | 223 | 2 | ఖుష్కి | పట్టా | 01-05.00 | పయ్యావుల నాగరాజు తండ్రి శివయ్య | |
| 68 | | | ఖుష్కి | పట్టా | 00-03 1/2 | గద్దం వెంకయ్య తండ్రి పెద కోటయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-08 1/2 | | |
| 69 | డొంక | 2 | ఖుష్కి | పట్టా | 00-11.00 | నక్క డొంక | |
| మొత్తం:- | | | | | 30-38 3/4 | | |

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ, భూసేకరణ అధికారి మరియు సబ్-కలెక్టర్, మిర్యాలగూడ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు సబ్-కలెక్టర్, మిర్యాలగూడ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబందిచి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబందించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలుచేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబందిచిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల మరియు నష్టపరిహారం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు సబ్-కలెక్టర్, మిర్యాలగూడ.
సం/- అదనపు కలెక్టర్, నల్గొండ జిల్లా.
సం/- జిల్లా కలెక్టర్, నల్గొండ.

DIPR RO NO. 500/LA/PP/Advt/Pub/2025-26



# జనరల్
STATE & REGIONAL NEWS

## గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి
### సర్పంచుల సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామపంచాయతీలకు పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఏర్పడి 21 నెలలవుతున్నా స్టేట్ ఫైనాన్స్ (ఎస్ఎఫ్‌సి)కార్పొరేషన్ నుంచి చిల్లిగవ్వ పెండింగ్ బిల్లులు చెల్లించలేదని సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం దయచేసి బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని ఆయన అన్నారు.

## ఆదివాసీ గిరిజన సంస్కృతి..
# సంప్రదాయాలకు ప్రజాప్రభుత్వం కృషి
### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమ్మక్కసారలమ్మ మేదారం జాతర నిమిత్తం శాశ్వత పనులు చేపడుతున్నామని, జంపన్నవాగు నుంచి మేదారం ప్రాంగణం వరకు డబుల్ రోడ్లు, రోడ్ల వెడల్పు, డివైడర్లు, 29 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో స్మృతివనాన్ని అభివృద్ధి చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయించడం కెటిఆర్ డర్టీమైండ్‌కు నిదర్శనమన్నారు. కేసులు, వ్యక్తిగత సమస్యలతో విసిగిపోయిన కెటిఆర్ ఫ్రస్ట్రేషన్‌కు గురవుతున్నారని ఎద్దేవాచేశారు. హైదరాబాద్ సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి సీతక్క గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సమ్మక్క సారలమ్మ మహా జాతర కోసం ఎన్నడూ లేని విధంగా ఈ దఫా రూ.150కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. వచ్చే ఏడాది మేదారం సమ్మక్కసారలమ్మ జాతర జనవరి 22 నుండి 31వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలనూ కల్పిస్తామని, భద్రత కోసం 12 వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించనున్నట్లు వివరించారు. 13వ శతాబ్దపు ఈ చారిత్రక జాతరను భవిష్యత్ తరాలకు అందించే విధంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా లక్షా 15వేల పనులను రూ.2198కోట్ల వ్యయంతో ప్రారంభించనున్నామని వెల్లడించారు. గ్రామాల రూపురేఖలను మార్చడంలో 'పనుల జాతర' కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తనకు మంత్రి కొండా సురేఖకు ఎటువంటి విభేదాలు లేవని సీతక్క స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఆడబిడ్డలను ఎదగనివ్వాలని, సమాజంలో ఆడబిడ్డలు ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. తామిద్దరమూ సమ్మక్కసారలమ్మ తరహా అక్కాచెల్లెళ్లలాగా కలిసే ఉన్నామన్నారు. సొంత చెల్లెలు కవిత కూడా లేఖ రాసి తనను సొంత పార్టీ నేతలే వేధిస్తున్నారని ఆరోపించారని, దీనిపైన కెటిఆర్ సమాధానం చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో యూరియా ఇచ్చినవారికి మద్దతు ఇస్తానని కెటిఆర్ చెబుతున్నారని, కానీ యూరియా ఇచ్చేది కేంద్ర ప్రభుత్వం అని కెటిఆర్‌కు తెలియదా? అని ఎద్దేవా చేశారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసిపోయి రాష్ట్రంలో యూరియా కొరతను సృష్టించాయన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో బిజెపికి బిఆర్ఎస్ మద్దతు ఇస్తుందనే విషయాన్ని కెటిఆర్ దాచలేకపోతున్నారని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత మేదారం జాతరకు రూ.105 కోట్లు కేటాయిస్తే, ఈ సారి రూ.150కోట్లు కేటాయించామని వివరించారు. ఆదివాసి పూజారులు కోరిన విధంగా జాతర పనులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాగా అంతకుముందు పంచాయతీరాజ్ శాఖ తరపున 'పనుల జాతర 2025 పోస్టర్'ను మంత్రులు ఆవిష్కరించారు.

## గురుకుల విద్యార్థుల
# ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి
### అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి గురుకుల పాఠశాలలు, బిసి హాస్టల్‌లో ఉండే విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వరుస వర్షాల నేపథ్యంలో బిసి గురుకుల పాఠశాలలు, బిసి హాస్టల్‌లలో తాజా పరిస్థితులపై మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రెటరీ సైదులు, జాయింట్ సెక్రెటరీలు శ్యామ్‌ప్రసాద్, తిరుపతి రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కుస్తుండటం, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో గురుకుల పాఠశాలలు, హాస్టల్‌లలో విద్యార్థుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అన్ని పాఠశాలల ప్రిన్సిపల్‌లు, వార్డెన్‌లకు ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులకు విధిగా సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలలు, హాస్టల్‌లలో గడ్డి, ఇతర బుష్ క్లియరెన్స్ చేయాలని, కీటకాలు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగు నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వంటపాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, బెల్ట్, సాక్స్, స్పోర్ట్స్ పూర్తి చేయాలని తెలిపారు. సరైన సమయంలో పాఠ్యాంశాలు పూర్తి చేయాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యానని .. ఎక్కడైనా ఖాళీలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.



# నవంబర్ 8న హైదరాబాద్‌లో సిఎస్ఆర్ సమ్మిట్
### పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) సమ్మిట్‌ను హైదరాబాద్‌లో నవంబర్ 8న నిర్వహిస్తున్నట్లుగా రోడ్లు, భవనాల మంత్రి కోమటి వెకంట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సమ్మిట్‌కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రతీక్ ఫౌండేషన్ సిఇఒ గోనరెడ్డి, ఈవెంట్ లైసెన్సీ ఎదుడొడ్ల వినిల్ రెడ్డి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని ఈ సమ్మిట్‌ను దక్షిణ భారతదేశ సిఎస్ఆర్ రంగంలో ఒక మైలురాయిగా మార్చాలని తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ ప్రఖ్యాత సమ్మిట్‌లో ప్రముఖ కార్పొరేట్ నాయకులు, సిఎస్ఆర్ నిపుణులు, అభివృద్ధిరంగ నిపుణులు మరియు పాలసీ మేకర్లు పాల్గొనబోతున్నారు. సామాజిక ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి మరియు సహకార భాగస్వామ్యాలపై ప్రభావవంతమైన చర్చల కోసం ఇది ఒక వేదికగా నిలవనుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సమ్మిట్‌కు హైదరాబాద్‌ను వేదికగా ఎంచుకున్న నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ రాబోయే సమ్మిట్‌లో వినూత్న సిఎస్ఆర్ కార్యక్రమాలను ప్రదర్శించడంతో పాటు, ఉత్తమ అనుభవాలను పంచుకోవడానికి, వివిధ రంగాలలో భాగస్వామ్య అవకాశాలను అన్వేషించడానికి ఇది ఒక శక్తివంతమైన వేదికగా మారనుందన్నారు.

## తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారునిగా
# మాజీ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ హర్‌పాల్ సింగ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారునిగా మాజీ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ హర్‌పాల్ సింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. హర్‌పాల్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి గౌరవ వేతనం పొందకుండానే రెండేళ్ల సలహాదారు పదవిలో కొనసాగనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల సొరంగ ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించి, ఆ పనులను వేగవంతం చేయడంతోపాటు ఆయన నైపుణ్యాన్ని, సేవలను నీటి పారుదల, సిఎడి విభాగంలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశ సరిహద్దులలో రహదారుల సంస్థలో డైరెక్టర్ జనరల్‌గా,భారత సైన్యం ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా హర్‌పాల్ సింగ్ ముఖ్య భూమిక పోషించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతుడైన హర్‌పాల్‌సింగ్ భారత సైన్యంలో నాలుగు దశాబ్దాలకుపై చిలుకు విశిష్ట సేవలను అందించారు. ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌గా భారత సైన్యంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే రోహ్తాంగ్ పాస్ కింద అటల్ టన్నెల్‌ను, అరుణాచల్ ప్రదేశ్‌లో సెల, నేచిప్ టన్నెల్‌ల నిర్మాణాలను పూర్తి చేశారు. హిమాలయాల ప్రాంతంలో అత్యంత క్లిష్టతరమైన భౌగోళిక పరిస్థితిలను అధిగమించి సొరంగాలను నిర్మించడంలోనూ హర్‌పాల్ సింగ్ కీలకపాత్రను పోషించారు. సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడైన హర్‌పాల్‌సింగ్ అమెరికాలోని ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయం నుండి ఉన్నత చదువులు పూర్తిచేశారు. అపార అనుభవంతోపాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో గౌరవప్రదమైన విధులను కూడా నిర్వర్తిస్తున్నారు. అంతర్జాతీయ రోడ్ ఫెడరేషన్‌కు అధ్యక్షునిగా, భారత ఇనిస్టిట్యూషన్ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ ఉపాధ్యక్షునిగా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జి ఇంజినీర్స్ చైర్మన్‌గా, ఇండస్ట్రీ కనస్ట్రక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా ఆయన విధులు నిర్వర్తించారు.

**సొరంగ మార్గాల నిర్మాణంలో అపార అనుభవం :** సొరంగమార్గాల నిర్మాణంలో హర్‌పాల్ సింగ్‌కు ఉన్న అపార అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ చేపడుతున్న సొరంగాల నిర్మాణాలను వేగవంతం చేయడంతోపాటు సొరంగ మార్గాల ఏర్పాటులో ఎదురయ్యే సాంకేతిక సమస్యల నివారణలో ఆయనకు ఉన్న సాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే ఆయనను నీటి పారుదల సలహాదారునిగా నియమించింది.

రాష్ట్ర నీటిపారుదల శాఖను ఆధునిక పరిజ్ఞానం వైపు నడిపించడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఇప్పటికే డిజైన్ విభాగం పునర్వ్యవస్థీకరణ చేపట్టడంతో పాటు వివిధ విభాగాలలో నిపుణుల నియామకాలను చేపట్టి నీటిపారుదల శాఖను బలోపేతం చేస్తున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పనులను వేగవంతం చేస్తున్న నీటి పారుదల శాఖకు హర్‌పాల్‌సింగ్ నియామకం ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి, అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం భద్రతకు ఆయన అనుభవం ఎంతో ఉపయోగమని, తద్వారా నీటిపారుదల శాఖ శాస్త్రీయ ధృక్పథం అలవర్చుకునేందుకు హార్‌పాల్ సింగ్ నియామకం తోడ్పడుతుందని నీటి పారుదల శాఖ మంత్రి మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.


# రోడ్ల డ్యామేజ్ వివరాలపై నివేదిక రూపొందించండి
### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని రోడ్ల డ్యామేజ్ వివరాలపై నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆర్ అండ్ బి శాఖపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎంఎల్‌ఎ వెడ్మ బొజ్జు, ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ఇఎన్‌సి జయభారతి, సిఇ.రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఇ.ధర్మారెడ్డి పలువురు ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్ బ్రీచెస్ సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేట్ రోడ్స్, నేషనల్ హైవే రోడ్స్, పలు కల్వర్టులు, మైనర్ బ్రిడ్జిల స్థితిగతుల లైఫ్ టైమ్ నమోదు చేయాలని సూచించారు. పూర్తి శిథిలావస్థకు చేరిన వాటి స్థానంలో కొత్తగా నిర్మించేందుకు ప్రపోజల్స్ తయారు చేయాలన్నారు. సుమారు 1000 కోట్ల వరకు ఆర్‌అండ్‌బి శాఖ రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అతి కొద్ది రోజుల్లోనే హ్యామ్ విధానం ద్వారా మెరుగైన, నాణ్యమైన రోడ్లు వేసుకోబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తిచేసుకొని, ఈ సీజన్ వర్షాలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం పూర్తి ప్రణాళికాబద్ధంగా వెళ్తుందని చెప్పారు. కేంద్రం నుండి క్లియరెన్స్ రావాల్సిన నేషనల్ హైవే ప్రాజెక్ట్స్‌పై మంత్రి ఆరా తీశారు. వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తాను ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కేంద్ర పరిధిలోని ప్రాజెక్ట్స్‌పై మాట్లాడానని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున విజ్ఞప్తులు కూడా ఇచ్చామని వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి గుర్తుచేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

## ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల ఫీజు నిర్ధారణ
# నిబంధనల సవరణకు ప్రభుత్వం అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాణ్యమైన విద్యను అందించే ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల ఫీజులను పెంచుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనికి సంబంధించిన ఫీజు నిర్ధారణ నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయా కళాశాలల అకౌంట్స్‌ను, విద్యా ప్రమాణాలను పరిగణలోకి తీసుకొని ఫీజులు నిర్ధారించనున్నారు. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణ ఉత్తర్వులు జారీచేశారు. ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నిషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనలవైపు ప్రోత్సహిస్తున్నారా? లేదా అనే అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కళాశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయా?, ఆ కళాశాలలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఎలా ఉన్నాయి?, అనే అంశాలపైనా కూడా దృష్టిసారించనుంది. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లను, ప్రభుత్వ నిబంధనలను ఏమేరకు అమలు చేస్తున్నారనే అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజులను నిర్ధారించనున్నట్టు ఉత్తర్వుల్లో ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. ఫీజులు పెంచాలని కొన్ని కళాశాలలు హైకోర్టును ఆశ్రయించగా, కళాశాలల ఫీజుల నిర్ధారణ కోసం సమర్పించిన ప్రతిపాదనలపై ఆరు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని టిఎఎఫ్ఆర్‌సికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, మెంబర్ సెక్రటరీగా ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్‌తో పాటు మరో ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఇతర రాష్ట్రాల్లో ఫీజులను, అక్కడి విధానాలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసులు చేసింది. దీని ఆధారంగా ఫీజు నిబంధనల సవరణకు ప్రభుత్వం ఆమోదించింది.

# ఇద్దరు నక్సల్స్ లొంగుబాటు
### పోలీసుల ముందు లొంగిపోయిన రాష్ట్ర కమిటీ సభ్యులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ భార్య, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకరాల సునీత, తెలంగాణ రాష్ట్ర కమిటీ మరో సభ్యుడు చెన్నూరి హరీశ్ లొంగిపోయినట్లు రాచకొండ పోలీసులు స్పష్టం చేశారు. 40 ఏళ్ల విప్లవ ఉద్యమ అనుభవం కలిగిన కాకర్ల సునీత అలియాస్ భద్రి, అలియాస్ లక్ష్మి, అలియాస్ గురుస్మృతి.. హరీశ్ అలియాస్ రామన్నతో పాటు గురువారం జనజీవన స్రవంతిలో కలిసినట్లు రాచకండ పోలీసులు కమిషనర్ సుధీర్‌బాబు మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకున్న వీరు మావోయిజం మార్గాన్ని వీడి తమ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుని పోలీసుల ముందు లొంగిపోయినట్లు సుధీర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంకు చెందిన కాకరాల సునీత(62) 1985లో రాజమండ్రిలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో క్యాంపస్‌లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ పట్ల ఆకర్షితురాలైంది. ఆమె తండ్రి కాకరాల సత్యనారాయణ విప్లవ రచయితల సంఘం ముఖ్య నాయకుడు అని పోలీసులు పేర్కొన్నారు. వరవరరావు, గద్దర్ వండి విప్లవకారులు తరచూ వారి ఇంటికి వచ్చేవారని వారి ప్రభావం కూడా పార్టీ పట్ల ఆకర్షణ కలిగించిందని తెలిపారు. 1986 జనవరిలో సిపిఐ(ఎంఎల్) వార్ వైపు పూర్తిగా ఆకర్షితురాలై అజ్ఞాతంలోకి వెళ్లిపోయిందని తెలిపారు. 2014లో ఆమె కుతుల్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొందని, ఈ ఏడాది జూన్‌లో తన భర్త టిఎల్ఎన్ చలంతో కలిసి అన్నపురం నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొందని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆమె భర్త టిఎల్ఎన్ మరణించినట్లు వివరించారు. 2006 నుంచి ఇప్పటి వరకు రీజినల్ పొలిటికల్ స్కూల్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా పనిచేసి అనేక మందిని మావో భావజాలం వైపు నడిపించగలిగిందని తెలిపారు.

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లికి చెందిన చెన్నూరి హరీశ్ 2006లో ఏటూరునాగారంలో బిసి వెల్ఫేర్ హాస్టల్‌లో 10వ తరగతి చదువుతున్న సమయంలో మావోయిస్టు పార్టీ సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరై ఆ భావజాలంవైపు ఆకర్షితులయ్యారని తెలిపారు. ఆ తర్వాత వివిధ మావోయిస్టు పార్టీలో వివిధ బృందాలతో కలిసి పనిచేసిన ఆయన.. 2022 డిసెంబర్‌లో జరిగిన నేషన్ పార్క్ ప్రాంతం టెకమెట్టా వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో హరీశ్ పాల్గొన్నారు. 2024లో ఆయన ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి లభించినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణకు చెందిన అండర్ గ్రౌండ్ మావోయిస్టులందరూ అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని ఈ సందర్భంగా పోలీసులు పిలుపునిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస ప్రయోజనాలు అందించబడతాయని తెలిపారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428

ఆర్.సి.నం.డి1/358/2024 ఈ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన-2వ పిలుపు తేది: 18.08.2025

ఈ దేవస్థానము నందు ది.01.09.2025 నుండి ది.31.08.2026 వరకు ఒక సం॥ర కాలమునకు (1) అవసరమైన పూలు మరియు (2) పూజాద్రవ్యములు సరఫరా చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా విడివిడిగా టెండర్లు కోరబడుచున్నవి. **ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 22.08.2025 ఉదయం గం.11.00ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేది:** 28.08.2025 ఉదయం గం.11.00ల వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేది:** 28.08.2025 ఉదయం గం.11.30లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 28.08.2025 మధ్యాహ్నం గం.12.00లకు, ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.

సం/- ఎల్. రమాదేవి
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 6812-PP/CL/ADVT/1/2025-26, Date: 21-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గాజులరామారం సర్కిల్-26**
GHMC

NIT No & Date: 12/DB/EE/GJRM/CIRCLE-26/GHMC/2025-26 తేది: 21.08.2025

**పని పేరు:** బిటి ప్యాచెస్ వేయడం, **అంచనా విలువ:** రూ.10.00 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 22.08.2025న మ.02.00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు చివరి తేదీ & సమయం:** 25.08.2025 మ.02.30గం.ల వరకు, **ఇఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-26, జిహెచ్‌ఎంసి. సెల్: 9849906776. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, జిహెచ్‌ఎంసి.**

DIPR R.O. No. : 6830-PP/CL/ADVT/1/2025-26, Date: 21-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## పోలీసు మహిళా సదస్సులో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసు అకాడమీలో రెండో రోజు జరిగిన పోలీసు మహిళా సదస్సులో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు సాగే పోలీసు మహిళా సదస్సులో గురువారం ముఖ్య అతిథిగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ హాజరయ్యారు. మహిళల సమస్యలపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం రాణి రుద్రమ సమావేశ మందిరంలో తెలంగాణ జానపద కళలైన పేరిణి లాస్యం, ఒగ్గుడోలు, గుస్సాడిలు మొదలైన అద్భుతమైన కళలను రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న మహిళా పోలీసు అధికారులు కూడా పాటలు పాడి ఆహుతులను అలరించారు.

‘మూసీ’ సుందరీకరణ పేరుతో

## ప్రజా సొమ్మును దోచుకునేందుకు సిద్ధమైన కాంగ్రెస్ : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకునేందుకు సిద్ధమవుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ఒక వైపు కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని అబద్ధాలు చెబుతూ, మరోవైపు అదే కాళేశ్వరంలో అంతర్భాగమైన కొండపోచమ్మ సాగర్ నుండి గోదావరి నీటిని తీసుకుంటామని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ 16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డిపిఆర్‌ను రూపొందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను రూ. 1,50,000 కోట్లకు పెంచి, దోపిడీకి పాల్పడుతోందని కెటిఆర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మహేష్ భగవత్‌కు అరుదైన గౌరవం

జాతీయ మహిళా కమిషన్ సలహా కమిటీ సభ్యులుగా ఎంపిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ మహిళా కమిషన్ సలహా కమిటి 2025 సభ్యులుగా తెలంగాణ పోలీసు శాఖ నుంచి శాంతి భద్రతల అదనపు డిజిపిగా విధులు నిర్వహిస్తున్న మహేష్ భగవత్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మహిళా కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. మహిళల అక్రమ రవాణాపై మహేష్ భగవత్ చాలా కేసులను అధ్యాయనం చేసి కరుడుగట్టిన నేరస్తులను గతంలో అరెస్టు చేశారు. పిల్లలు, మహిళల అక్రమ రవాణా చేసే ముఠాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆయనకు జాతీయ మహిళా కమిషన్ సలహా కమిటిలో సభ్యుడిగా తీసుకుని అరుదైన గౌరవం ఇచ్చింది. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయా కిశోర్ రహాట్కర్ ఆధ్వర్యంలో నడిచే ఈ కమిటీలో మొత్తం 21 మందిని నియమించారు. ఎక్స్అఫీషియల్ మెంబర్లుగా ముగ్గురు, సభ్యులుగా 17 మందిని నియమించారు. మహిళలకు సంబంధించిన అన్ని విషయాలను సమన్వయం చేయడం జాతీయ మహిళా కమిషన్ బాధ్యత. కమిషన్ తన విధులను నిర్వర్తించడంలో సహాయం చేయడానికి, జాతీయ మహిళా కమిషన్ చట్టం, 1990లోని సెక్షన్ 8 (1) ప్రకారం, కమిషన్‌కు ఎప్పటికప్పుడు సలహా ఇవ్వడానికి వివిధ రంగాలకు చెందిన నిపుణులతో కూడిన సలహా కమిటీని ఏర్పాటు చేయాలి. ఇందులో భాగంగానే జాతీయ మహిళా కమిషన్‌కు 4వ సలహా కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.

## నాపై కొందరు కుట్ర..

లేఖ లీక్ కుట్రదారులే వేధిస్తున్నారు

రాజకీయ కోణంలోనే తనను టిబిజికెఎస్ నుంచి తొలగించారు : ఎమ్మెల్సీ కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తాను పోరాడుతుంటే కొందరు తనపైన కుట్రలకు పాల్పడుతున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇలాంటి కుట్రలతో తనకు వ్యక్తిగతంగా వచ్చే నష్టం ఏమీ లేకపోయినప్పటికీ, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తున్న తనను తొలగించి, కార్మికుల ఐక్యతను దెబ్బ తీయడమే కొందరి లక్ష్యంగా కనిపిస్తున్నదన్నారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా,రాజకీయ కారణాల కోణంలోనే టిబిజికెఎస్ గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు సింగరేణి బొగ్గు గని కార్మికులకు కవిత గురువారం బహిరంగ లేఖ రాశారు. లేఖ లీక్ చేసిన కుట్రదారులే తనను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తాను అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో కార్మిక చట్టాలకు విరుద్ధంగా టిబిజికెఎస్ సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి కొత్త గౌరవ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్టుగా ప్రకటించారన్నారు. 2015 ఆగస్టు 17న కొత్తగూడెంలో నిర్వహించిన టిబిజికెస్ జనరల్ బాడీ సమావేశంలో 11 ఏరియాల నుంచి హాజరైన వెయ్యి మందికి పైగా సభ్యుల సమక్షంలో తనను గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారని, అలాగే టిబిజికెఎస్‌లో జరిగే అన్ని నిర్ణయాలనూ గౌరవ అధ్యక్షురాలి హోదాలో తానే తీసుకునేలా తీర్మానం చేసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. బిఆర్ఎస్‌లో జరుగుతున్న వ్యవహారాలను తాను ప్రశ్నించడమే తప్పు అన్నట్టుగా తనపైన కక్షగట్టారని, ఆ తర్వాత జరుగుతోన్న పరిణామాలు, ఘటనలు అన్ని ‘మీ మననం’లో ఉన్నాయనే అనుకుంటున్నట్టు కవిత ఆ లేఖలో పేర్కొన్నారు. టిబిజికెఎస్ గౌరవ అధ్యక్షురాలి పదవిలో లేకపోయినప్పటికీ ప్రతి కార్మిక కుటుంబంలో సభ్యురాలిగా తాను ఎళ్లవేళలా కార్మికుల వెన్నంటే ఉంటానని, కార్మికలుకు అండగా ఉంటానని కవిత భరోసనిచ్చారు.

## దేశంలో 45 కోట్లమంది ఆన్‌లైన్ గేమింగ్ బాధితులు

రాజ్యసభలో మంత్రి వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ:** ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును గురువారం రాజ్యసభ కూడా ఆమోదించింది. దీంతో బిల్లు ఉభయసభల ఆమోదం పొందినట్లయింది. సమాజానికి పెద్ద సమస్యగా మారిన ఆన్‌లైన్ నగదు ఆధారిత ఆటలను నిషేధించడమే తమ ప్రధాన ఉద్దేశమని ఎలక్ట్రానిక్స్,ఐటి శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ బిల్లును ప్రవేశపెడుతూ రాజ్యసభకు చెప్పారు. ప్రత్యేకించి మధ్యతరగతి యువకులు ఆన్‌లైన్‌లో ధనాన్ని పోగొట్టుకుంటున్నారని, మానసిక,శారీరక ఆరోగ్యం కోల్పోతున్నారని అన్నారు. ‘‘ఇదొక దురలవాటుగా మారింది, దీనివల్ల పొదుపుచేసుకున్న ధనాన్ని కుటుంబాలు కోల్పోతున్నాయి,ఇప్పటి వరకూ 45 కోట్లమంది ఆ ఆన్‌లైన్ గేమింగ్ బారినపడ్డారు, దీనివల్ల రూ.20,000 కోట్లు కంటే ఎక్కువ మొత్తాన్ని మధ్యతరగతి కుటుంబాలు పోగొట్టుకున్నాయని అంచనావేశాం’’ అని మంత్రి చెప్పారు. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదం పొందింది.

యూరియా స్టాక్ ఎప్పుడు వస్తుందో తెలిసేలా

# ముందస్తు ప్రణాళికలు



అధికారులతో తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు యూరియా స్టాక్ ఎప్పుడు వస్తుందో తెలిసేలా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. యూరియా లభ్యతపై జిల్లా వ్యవసాయ అధికారులతో గురువారం మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యూరియా స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలి అని అన్నారు. జిల్లాలకు వచ్చే యూరియా ముందుగానే తెలియపరచడం జరుగుతుంది కాబట్టి ఆ రేక్ నుంచి వివిధ జిలాల్లకు వెంటనే యూరియాను తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్ పోర్టింగ్ లో సమస్యలు ఉన్నట్టయితే కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. మండలాల వారిగా యూరియా స్టాక్ మరియు అవసరాలు తెలుసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే ప్రైవేట్ డీలర్ల వద్ద నున్న యూరియా నిలువలను కూడా రైతులకు అమ్మే విధంగా చూడాలని మరియు క్యూ లైన్ లేకుండా చూడాలని సూచించారు. మండలాలలో ప్రతి స్టాక్ పాయింట్ వద్ద యూరియా నిలువలను మానిటర్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు యూరియా ను తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎవరైన ప్రైవేట్ డీలర్లు ఎక్కువ ధరకు అమ్మినట్టయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిస్టాక్ పాయింట్ ను మండల వ్యవసాయ అధికారులతో, ఏఈఓలతో నిత్యం పర్యవేక్షించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ డైరెక్టర్ డాక్టర్ బి.గోపితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ప్రధాని మోదీకి మంత్రి తుమ్మల లేఖ**

దేశ జనాభాకు సరిపడా ఆహార ధాన్యాలు పంటలు ఉత్పాదకతలో ఆధునిక సాగు పద్ధతులు రైతాంగం అమలు చేయాలంటే వ్యవసాయ యాంత్రీకరణ దిశగా రైతులను ప్రోత్సహించాలని..అందుకు వ్యవసాయ యంత్రాలు పరికరాలు పై 12 శాతం జిఎస్‌టి విధించడం వల్ల రైతాంగంకు ఆర్థిక భారంగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. సన్నకారు రైతులు వ్యవసాయ పరికరాలు కొనే స్థోమత లేక సాగు యాజమాన్య పద్ధతులు పాటించ లేక దిగుబడులు తక్కువగా ఉండటం సాగు పెట్టుబడులు భారంగా మారాయని ప్రధానికి లేఖలో వివరించారు. ఆధునిక సాగు యాజమాన్య పద్ధతులు పాటించేలా కూలీల కొరత పెట్టుబడులు భారం లేకుండా సన్నకారు రైతులకు మేలు జరిగేలా 12 శాతం జిఎస్‌టి మినహాయించడం చేయాలని తుమ్మల తన లేఖలో కోరారు. ప్రధానితో పాటు ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కూడా తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారు. తెలంగాణ రైతాంగంకు మాత్రమే కాకుండా యావత్ దేశ వ్యాప్తంగా రైతాంగంకు మేలు చేసేలా 12 శాతం జిఎస్‌టి మినహాయించడం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల గారు విజ్ఞప్తి చేశారు.

## సినీ కార్మికుల వేతనాలు 22.5శాతానికి పెంపు

ఇరు వర్గాల మధ్య కుదిరిన ఒప్పందం

ఆందోళన విరమించిన సినీ కార్మికులు

కార్మిక శాఖతో ఫెడరేషన్, ఛాంబర్ చర్చలు

నేటి నుంచి షూటింగ్ షురూ

**హైదరాబాద్ :** సినీ కార్మికులు వేతనాల పెంపు కోసం పద్దెనిమిది రోజులుగా చేపట్టిన ఆందోళన గురువారం రాత్రి జరిగిన చర్చ లతో ముగిసింది. పద్దెనిమిది రోజులుగా నిర్మాతలకు.మ, ఫెడరేషన్ కు మధ్య నడిచిన వివాదం ప్రభుత్వం చొరవతో సద్దుమనిగింది. కార్మిక శాఖా అధికారుల సమక్షంలో ఫెడరేషన్ , నిర్మాతల మధ్య జరిగిన చర్చలు ఫిలిం చాయి. మూడు సంవత్సరాలకు గాను 30శాతం వేతనాలు పెంచాల్సిందేనని పట్టు బట్టిన ఫెడరేషన్ ఒక అడుగు దిగారు. ఈ సందర్భంగా సిని కార్మికుల ఆందోళన విరమిస్తున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ ప్రకటించారు. శుక్రవారం నుంచి షూటింగ్ స్టార్ట్ అవుతాయని స్పష్టం చేశారు. 30 శాతం వేతనాలు కొంత తగ్గడం బాధకరమే అయినా సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం అంగీకారించామని చెప్పారు. సుదీర్ఘంగా చర్చలు జరిగాయని లేబర్ కమిషన్ గంగాధర్ చెప్పారు. మూడేళ్ల కు 22.5 శాతం వేతనాలు చెల్లించేందుకు ఇరు వర్గాల మధ్య అంగీకారం కుదిరిందని చెప్పారు. మూడేళ్ల కు 30 శాతం అడిగారని అన్నారు. అయితే 2 వేల రూపాయల కంటే తక్కువ వేతనాలు ఉన్న వారికి తొలి ఏడాది 15 శాతం పెంపుదల ఉంటుందని, రెండో ఏడాది 2.5 శాతం , మూడో ఏడాది 5శాతం పెంపుదల ఉంటుందని చెప్పారు. 2వేల నుంచి 5వేల రూపాయలు వేతనం ఉన్న వారికి తొలి ఏడాది 2.5 శాతం, రెండు, మూడో ఏడాది 5శాతం చొప్పున పెరుగుతాయని , ఈ నిబంధనలకు ఇరు వర్గాలు అంగీకారం తెలిపారని కమీషనర్ గంగాధర్ పేర్కొన్నారు. ఇండస్ట్రీ లోని ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్య కార్యదర్శి సమక్షంలో ఒక కమిటీ నియమించామని అన్నారు. ఫెడరేషన్ నాయకులు, ఛాంబర్ నుంచి ప్రతినిధులు, కార్మిక శాఖా అధికారులు కమిటి లో ఉంటారని అన్నారు. ఈ చర్చల్లో ఎఫ్ డి సి ఛైర్మన్ దిల్ రాజు కూడా ఉన్నారు. అయితే సమస్య పరిష్కారం కోసం చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఫెడరేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య పరిస్థితిపై ధన్‌ఖడ్ స్వీయ ప్రకటన చేయాలి

సిపిఐ పార్లమెంటరీపార్టీ నేత సందోష్ కుమార్ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** నెలరోజుల క్రితం ఉపరాష్ట్రపతి పదవికి ఆకస్మికంగా రాజీనామా చేసిన జగదీప్ ధన్‌కర్ తన ఆరోగ్య పరిస్థితిపై స్వీయ ప్రకటన చేయాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ ఎంపి సందోష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ధన్‌కర్‌కు రాసిన లేఖ ప్రతిని గురువారం పత్రికలకు విడుదల చేశారు. ముందుగా నిర్దేశించిన కార్యక్రమాలను కూడా ఉపరాష్ట్రపతి రద్దుచేసుకున్నారని, పదవికి రాజీనామా చేసినప్పటి నుండీ ఈనాటి వరకూ ఏ కార్యక్రమంలో పాల్గొనకపోవడం, పత్రికాగోష్ఠిలో మాట్లాడకపోవడం, ఒక ప్రకటన కూడా చేయకపోవడం, ప్రజాజీవితం నుండి పూర్తిగా కనుమరుగు కావడం ఆందోళన కలిగిస్తోందని సందోష్ కుమార్ పేర్కొన్నారు. ‘‘ఆరోగ్య కారణం పేరుతో నెలరోజులక్రితం ఉపరాష్ట్రపతి పదవికి, రాజ్యసభ ఛైర్మన్ పదవికి ధన్‌కర్ రాజీనామా చేశారు.ఈ రాజీనామా పార్లమెంటుకు, యావత్ దేశానికీ దిగ్భ్రాంతి కలిగించింది. సభాపతిస్థానంలో ఉన్నప్పుడు ఆ పదవీకాలంలో వైరుధ్యాలు ఉండటం అత్యంత సహజమైన విషయం. ఆయన పదవికి, ఆయన స్థానానికీ ఎల్లప్పుడూ గౌరవం ఇస్తాం. కానీ రాజీనామా చేసినప్పటి నుండీ గౌరవనీయులైన ధన్‌కర్ పూర్తిగా ప్రజాజీవితం నుండి కనుమరుగయ్యారు. ఎక్కడా పత్రికా గోష్ఠిలో మాట్లాడలేదు. ఎక్కడా బహిరంగంగా కనిపించలేదు. చివరకు ముందుగా నిర్దేశించిన కార్యక్రమాలను కూడా ఆయన రద్దుచేసుకున్నారు. ఆరోగ్య కారణాలు చెప్పిన తర్వాత ఈ విధమైన మౌనం పాటించడం, ప్రజాజీవనం నుండి ఉపసంహరించుకోవడం తోటి పార్లమెంటేరియన్లకు, ఆయన క్షేమాన్ని కోరుకునే దేశ పౌరులకు అర్థంచేసుకోగలస్థాయిలో చాలా లోతైన ఆందోళన కలిగిస్తోంది, అందువల్ల ఆయన సత్వరం ప్రతిస్పందించి పార్లమెంటుకు, ప్రజలకు తిరిగి భరోసా ఇవ్వాలి, ఒకవైపు ఆయన స్థానంలో ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే ప్రక్రియ కూడా ఇప్పటికే ప్రారంభమైంది, ధన్‌కర్ స్వీయ స్పందన మాత్రమే ఆయన అసాధారణ రాజీనామా చుట్టూ కొనసాగుతున్న సమాధానంలేని ప్రశ్నలు, వదంతులు ఉత్కంఠలన్నింటినీ తొలగిపోయేందుకు దోహదపడతాయి. అప్పుడే ఈ విషయంలో ఒక స్పష్టత వస్తుంది. ఆయన నిర్వహించిన రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిపట్ల ఉన్న అపారమైన గౌరవప్రపత్తులతో, ప్రజాజీవితంలో జవాబుదారీతనాన్ని, దాపరికంలేని ప్రయోజనాలను ఆశించి ఎంతో చిత్తశుద్ధితో ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు సిపిఐ పార్లమెంటరీ పార్టీ బలంగా నొక్కి చెబుతున్నది’’ అని లేఖ సారాంశాన్ని సందోష్‌కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల ‘క్రమశిక్షణ’ చర్యలకు కాలపరిమితి..

మూడు నుంచి ఆరు నెలల్లోనే విచారణ పూర్తి

నూతన మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపైన క్రమశిక్షణ చర్యలు తీసుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట కాలపరిమితిని విధించింది. క్రమశిక్షణ చర్యలు తీసుకునే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందని గుర్తించిన ప్రభుత్వం, ఇక నుంచి సాధారణ కేసులను మూడు నెలల్లో, క్లిష్టమైన కేసులకు సంబంధించి ఐదు నుంచి ఆరు నెలల్లో విచారణను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఒక వేళ విచారణ ప్రక్రియ ఒక సంవత్సరానికి మించితే ఆ దస్త్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రుల వద్దకు పంపించి ప్రత్యేక షెడ్యూల్‌ను తీసుకోవాలని ఆదేశించింది. ఉద్యోగులకు సంబంధించి ఇది వరకు ఉన్న ఆదేశాలు, నిబంధనలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ ప్రక్రియను సమయానుకూలంగా పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. ఉద్యోగులపైన క్రమశిక్షణ చర్యలు తీసుకునే క్రమంలో డాక్యూమెంట్స్ సమర్పన, విచారణ ప్రక్రియ, నివేదిక సమర్పణ, ఫైనల్ ఆర్డర్స్ ఇవ్వడం లాంటి ప్రతి విచారణ ప్రక్రియను ఆయ దశను బట్టి వారం నుంచి రెండు వారాల వరకు గడువును విధించారు. నూతన మార్గదర్శకాలు విధిగా పాటించాలని అన్ని శాఖాధిపతులను, ఆయా జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. తప్పిదాలు, అక్రమాలు జరిగిన వెంటనే ప్రాథమిక దర్యాప్తు త్వరగా పూర్తి చేసి, తప్పు నిర్ధారణ అయితే వెంటనే చార్జును విధించాలని మార్గద్శకాల్లో స్పష్టం చేశారు. అయితే సదరు ఉద్యోగి రిటైర్ అయ్యే వరకు దర్యాప్తు ప్రక్రియను ఆలస్యం చేయరాదని కూడా సూచించారు. నిర్లక్ష్యం, ప్రవర్తనా ఉల్లంఘన వంటి సాధారణ పదజాలంలో కాకుండా స్పష్టమైన ఆధారాలతో, సులభమైన భాషలో చార్జీలు ఉండాలని, ఆయా శాఖ తరఫున కేసు వాదించే ప్రజెంటింగ్ ఆఫీసర్ సీనియర్ అధికారి అయి ఉండాలని, విచారణాధికారికి రికార్డులు ఆలస్యం లేకుండా పంపించాలని, ఆయా శాఖ కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా విచారణాధికారులు నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా విచారణ అధికారులపైనే ఉందని, ఒక వేళ విచారణ అధికారి నిర్లక్ష్యం వహిస్తే సదరు అధికారులపైన కూడా చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయని కొత్త మార్గదర్శకాల్లో రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిచింది.

## విద్యార్థులు సామాజిక స్పృహ పెంపొందించుకోవాలి

జెఎన్‌టియు హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ ప్రొఫసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/గండిపేట:** నూతనంగా చేరిన విద్యార్థులు స్వీఅభ్యాసం, సాఫ్ట్ స్కిల్స్, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యాలను సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ ప్రొఫసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి అన్నారు.మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆహ్వానించడానికి ఓరియంటేషన్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ ప్రొఫసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వర్చువల్‌గా సందేశాన్ని అందించారు. ఈ విద్యా సంస్థను దక్షిణ భారతదేశంలోనే అత్యుత్తమమైన సాంకేతిక విద్యా సంస్థల్లో ఒకటిగా మార్చడానికి యాజమాన్యం, పరిపాలన సిబ్బంది చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఎన్ బిఎ, నాక్ వంటి ఏజెన్సీల నుండి అత్యున్నత గుర్తింపు పొందినందుకు కళాశాలను అభినందించారు.ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన గ్లోబల్ హెడ్: డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మల్లాది చంద్రమోహన్, విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న తాజా పరిణామాలను గమనిస్తూ,పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో ఉండాలని సూచించారు. వారు ఎంచుకున్న ఇంజనీరింగ్ స్ట్రీమ్ నుండి మారవద్దని, బదులుగా తమ లక్ష్యాలను సాధించడానికి కృత్రిమ మేధస్సు మెషిన్ లెర్నింగ్‌ల మద్దతు తీసుకోవాలని సలహా ఇచ్చారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన డిబి ఎస్ టెక్ ఇండియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శాంతా మోనా భరద్వాజ్ మాట్లాడుతూ.... విద్యార్థులకు కొత్త టెక్నాలజీలను నేర్చుకోవాలనే తపన ఉండాలని, భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్తును అందించే దిశగా తమ మార్గాన్ని సుగమం చేసుకోవాలని ప్రేరేపించారు.ఈ సందర్భంగా ఎంజిఐటి ప్రిన్సిపాల్ ప్రొఫసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రారంభం నుండి సాధించిన మైలురాళ్లను వివరించారు. కళాశాల తీసుకునే ప్రతి ప్రయత్నంలోనూ నిస్సందేహంగా మద్దతు అందిస్తున్న యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కళాశాల టీమ్ వర్క్‌కు ప్రసిద్ధి చెందిందని, విద్యార్థుల సంపూర్ణ వికాసానికి, వారిని ఉపాధికి సిద్ధంగా ఉన్న గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దడానికి కళాశాల సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఎంజిఐటి వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫసర్ కె.సుధాకర్ రెడ్డి స్వాగతోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక స్వాగతం పలికారు.ఎంజిఐటి కుటుంబంలో సభ్యులైనందుకు అభినందించారు. ఈ సంస్థ నుండి పట్టభద్రులైనవారు ఇంజనీర్లు,శాస్త్రవేత్తలు, సాఫ్ట్‌వేర్ నిపుణులు మరియు పరిశోధకులుగా జాతీయ,అంతర్జాతీయ సంస్థల్లో తమదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. ఈ కళాశాల నుండి పట్టభద్రులైన కొందరు అత్యంత విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా మారారని కూడా ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమ డైరెక్టర్, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫసర్ డి.వెంకట్ రెడ్డి, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి, ర్యాగింగ్ రహిత క్యాంపస్‌ను నిర్ధారించడానికి కళాశాల అమలు చేస్తున్న చర్యల గురించి మాట్లాడారు. అకడమిక్ మరియు పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రొఫసర్ కె.అంకమ్మ రావు,విద్యార్థులు అనుసరించాల్సిన అకడమిక్ నిబంధనలను వివరించారు.ఈ కార్యక్రమం సకన్వీనర్ డాక్టర్ హరిలీల ధన్యవాదాలు తెలిపారు.

## సెప్టెంబర్‌లోనే బిసిసిఐ ఎన్నికలు

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) ఎన్నికలు సెప్టెంబర్‌లోనే జరుగుతాయని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ తన స్పోర్ట్స్ పాలసీలో స్పష్టం చేసింది. అయితే, ఎన్నికలు కొత్త క్రీడా బిల్లును అనుసరించి జరుగుతాయా లేక లోధా కమిటీ ఇచ్చిన సిఫార్సు మేరకు జరుగుతాయా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. అయితే, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తిలేదని క్రీడా మంత్రిత్వ శాఖ తేల్చిచెప్పింది. బిసిసిఐతోపాటు దేశంలోని అన్ని క్రీడా సమాఖ్యల ఎన్నికలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని పేర్కొంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వ నూతన క్రీడా విధానం, అందులో తీసుకున్న నిర్ణయాల అమలులో జాప్యం జరిగితే, లోధా కమిటీ ఇచ్చిన సిఫార్సులు అమలవుతాయని వివరించింది. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే, 70 సంవత్సరాలకు పైబడిన వారు ఎవరూ బిసిసిఐ కార్యవర్గానికి పోటీ చేయడానికి అనర్హులు. అంతేగాక, వరుసగా రెండు పర్యాయాలు, మొత్తం మీద మూడుసార్ల కంటే బిసిసిఐ పాలక మండలిలో ఉండడానికి వీల్లేదు. ప్రస్తుత బిసిసిఐ అధ్యక్షుడు రోజర్ బన్నీ వయసు 70 సంవత్సరాలు దాటిన కారణంగా, అతను వెంటనే పదవి నుంచి తప్పుకోవాలి. కానీ, బోర్డు ఇప్పటి వరకూ అతనిని తప్పించలేదు. మధ్యంతర లేదా తాత్కాలిక అధ్యక్షుడిని నియమించలేదు. సెప్టెంబర్‌లో ఎన్నికలు జరగనున్న తరుణంలో, ప్రస్తుతానికి ఆ అంశాన్ని వాయిదా వేసినట్టు కనిపిస్తున్నది. ఇలావుంటే, భారత బాక్సింగ్ సమాఖ్య (బిఎఫ్ఐ) ఎన్నికలపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. కేంద్ర మాజీ క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను పోటీకి అనుమతించకుండా అడ్డుకుంటూ బిఎఫ్ఐ చేసిన నిబంధనల సవరణపై ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో కేసు నడుస్తున్నది. ఈ విషయంపై కోర్టు తన తదుపరి హియరింగ్‌ను సెప్టెంబర్ 23వ తేదీకి వాయిదా వేసింది. ఎన్నికలను నిర్వహించడానికి వీలుగా ఒక పరిశీలకుడిని పంపాల్సిందిగా బిఎఫ్ఐ చేసిన విజ్ఞప్తిపై భారత ఒలింపిక్ సంఘం స్పందించలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో, కోర్టు ఆదేశాల కోసం వేచి చూస్తున్నట్టు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ప్రకటించింది.



## ఓట్ల చోరీతో ఫలితాలు తారుమారు


అందుకే మోదీ ప్రధాని అయ్యారు

ఈసారి అలా జరగనివ్వం: రాహుల్ గాంధీ

**ముంగేర్ :** గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బిజెపి తారుమారు చేసిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ‘ఓట్ల చోరీ’ని రాజ్యాంగంపై చేసిన దాడిగా అభివర్ణించారు. ఇకపై ఎన్నికల సంఘం(ఇసి)తో బిజెపి కుమ్మక్కై ఓట్ల అవకతవకలకు పాల్పడేందుకు ఎట్టిపరిస్థితుల్లో అనుమతించమని రాహుల్ తేల్చిచెప్పారు. ‘ఓటర్ అధికార్ యాత్ర’లో భాగంగా బిహార్‌లోని ముంగేర్‌లో నిర్వహించిన సభలో రాహుల్ గాంధీ బిజెపి, ఇసిలపై ఈ విధంగా విమర్శల వర్షం కురిపించారు. ‘ఎన్నికల సంఘంతో కలిసి ఓటరు జాబితా ‘ప్రత్యేక సమగ్ర సవరణ’ పేరిట బిజెపి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోంది. అయితే బిజెపి, ఇసిలు కలిసి బిహార్ ప్రజల ఓటు హక్కును లాక్కునేందుకు ‘ఇండియా’ కూటమి అనుమతించదు. గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలను బిజెపి తారుమారు చేసింది. ఇప్పుడు కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నిస్తోంది‘ అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**ఓట్ల చోరీతో అధికారంలోకి!**

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం చోరీ చేసిన ఓట్ల ద్వారానే ఏర్పాటు అయినట్లు అంతకుముందు రాహుల్ ఆరోపించారు. అలాంటి ప్రభుత్వానికి ప్రజాసేవ చేసే ఉద్దేశం ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించారు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా యువతతో సమావేశమైన వీడియోను రాహుల్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. అందులో దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు తమ ఓటు హక్కు అనే శక్తిని వినియోగించాలని పిలుపునిచ్చారు. సరైన ఓటరు జాబితాలే స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు పునాది అని ఆయన పేర్కొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సరిహద్దు కయ్యానికి దిగిన నేపాల్

**న్యూఢిల్లీ :** భారత్‌–చైనా మధ్య వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని రెండు దేశాల విదేశాంగ మంత్రులూ గడిచిన మంగళవారం నిర్ణయం తీసుకున్న తరుణంలో పొరుగుదేశం నేపాల్ కయ్యానికి దిగింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పర్వత కనుమ మార్గం ద్వారా భారత్‌–చైనా మధ్య వాణిజ్య రాకపోకల పునరుద్ధరణకు వాంగ్ యీ (చైనా విదేశాంగమంత్రి), ఎస్.జైశంకర్ (భారత విదేశాంగమంత్రి) ఒక అంగీకారానికి వచ్చారు. కానీ లిపులేఖ్ ప్రాంతం తమదేనని, తమ భూభాగంలోంచి ఎలా వ్యాపార కార్యకలాపాలు చేస్తారని నేపాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నేపాల్ ప్రభుత్వ వాదనను భారత ప్రభుత్వం గురువారం తీవ్రంగా ఖండించింది. నేపాల్ వ్యక్తంచేస్తున్న అభ్యంతరం ఎంతమాత్రం సమర్థనీయం కాదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధిప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. కల్పాని, లింపియాధుర, లిపులేఖ్ ప్రాంతాలను నేపాల్‌లో అంతర్భాగంగా చూపిస్తూ 2020లో నేపాల్ ప్రభుత్వం ఒక రాజకీయపటాన్ని విడుదల చేసి కయ్యానికి దిగింది. ఆనాడు నేపాల్ వాదనను భారత్ కొట్టిపారేసింది. భారత్‌–చైనా మధ్య లిపులేఖ్ ద్వారా 1954లోనే వాణిజ్యం ప్రారంభమైంది, అనేక దశాబ్దాలపాటు ఈ వాణిజ్య కార్యకలాపాలు ఈమార్గం ద్వారా కొనసాగాయి''అని రణధీర్ చెప్పారు.

# పార్లమెంట్ నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. నెల రోజుల పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో బిహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాపై ఉభయ సభలలో దాదాపు ప్రతిరోజూ అంతరాయం ఏర్పడింది. ప్రతిపక్షాలు రోజూ నిరసన తెలియజేయగా, ప్రభుత్వం మాత్రం తమకు కావాల్సిన బిల్లులను ఆమోదింపజేసుకుంటూ ఎజెండాను కొనసాగించింది. తీవ్రమైన నేరారోపణలపై అరెస్టయిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించాలని కోరుతూ బిల్లులను బుధవారం హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. ఇది లోక్‌సభలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. ప్రతిపక్ష సభ్యులు బిల్లుల కాపీలను చింపి విసిరికొట్టారు. అమిత్ షా బిల్లులను ప్రవేశపెట్టడానికి వెళ్ళినప్పుడు అధికార, ప్రతిపక్ష కూటమి సభ్యులు ముఖాముఖిగా వాగ్వాదానికి దిగారు. అయితే ముసాయిదా చట్టాలను పార్లమెంట్ ఉమ్మడి కమిటీకి నివేదించారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రతిపక్షసభ్యులు నిత్యం అడ్డుకున్నారు. ఎస్ఐఆర్ అంశంపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కాగా, గురువారం తన ముగింపు వ్యాఖ్యలలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ్యుల ప్రవర్తన పట్ల విచారం వ్యక్తం చేశారు.

### లోక్‌సభలో 12, రాజ్యసభలో 15 బిల్లులకు ఆమోదం

నెల రోజుల పాటు జరిగిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ 12 బిల్లులను, రాజ్యసభ 15 బిల్లులను ఆమోదించింది. నిత్యం సభా కార్యకలాపాలకు అంతరాయం, వాయిదా, వాకౌట్‌లు జరిగాయి. జూలై 21న ఉభయ సభల్లోనూ ఆపరేషన్ సిందూర్‌పై చర్చలను మినహాయిస్తే నిత్యం అతి కొద్ది సమయం మాత్రం సభా కార్యకలాపాలు కొనసాగాయి. ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు, బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎక్సర్‌సైజ్‌పై చర్చకు విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో ఉభయ సభల్లోనూ పదేపదే అంతరాయం ఏర్పడింది. వాయిదాల కారణంగా సెషన్ ప్రారంభమైనప్పటి నుండి పెద్దగా చర్చ జరగలేదు. కాగా, లోక్‌సభ ఆమోదించిన బిల్లులను పరిశీలిస్తే... గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2025, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, 2025, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లు, 2025, మణిపూర్ కేటాయింపు(నం.2) బిల్లు, 2025, జాతీయ క్రీడాపాలన బిల్లు, 2025, మరియు జాతీయ డోపింగ్ నిరోధక(సవరణ) బిల్లు, 2025 ఉన్నారు. లోక్‌సభ ఆమోదించిన ఇతర బిల్లులు ఆదాయపు పన్ను బిల్లు, 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు, 2025, భారతీయ ఓడరేవుల బిల్లు, 2025, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, 2025, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు, 2025, ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ మరియు నియంత్రణ బిల్లు, 2025 ఉన్నాయి. రాజ్యసభ ఆమోదించిన బిల్లులు లేక సభ తిరిగి పంపిన బిల్లుల్లో లాడింగ్ బిల్లు 2025, సముద్రం ద్వారా వస్తువులను రవాణా చేసే బిల్లు2025, తీరప్రాంత షిప్పింగ్ బిల్లు 2025, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ)బిల్లు2025, మణిపూర్ కేటాయింపు (నం.2) బిల్లు 2025, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, 2025, గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు 2025 ఉన్నాయి. ఇక రాజ్యసభ ఆమోదించిన ఇతర బిల్లులు జాతీయ క్రీడాపాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు 2025, ఆదాయపు పన్ను బిల్లు 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు 2025, భారతీయ ఓడరేవుల బిల్లు 2025, గనులు, ఖనిజాలు(అభివృద్ధి,నియంత్రణ) సవరణ బిల్లు 2025, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2025, ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ప్రమోషన్, నియంత్రణ 2025. ఈసారి పార్లమెంటులో చాలా గందరగోళం నెలకొంది. రాజ్యసభలో వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఎటువంటి అంతరాయం లేకుండా ఆమోదించబడిన దిబిల్స్ ఆఫ్ లాడింగ్‌బిల్లు 2025 మినహా, మిగిలిన బిల్లులు కొంతచర్చ తర్వాత లేదా ప్రతిపక్ష పార్టీలు వాకౌట్ చేసిన తర్వాత మాత్రమే ఆమోదించబడ్డాయని సభా నిర్వాహకులు తెలిపారు.

## జెపిసికి మూడు బిల్లుల ప్రతిపాదనకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ :** గురువారం రాజ్యసభలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజుల పాటు తీవ్రమైన నేరారోపణలపై జైల్లో ఉంటే తొలగించడం వంటి మూడు బిల్లులను పార్లమెంటరీ సంయుక్త కమిటీకి నివేదించాలనే తీర్మానం ఆమోదం పొందింది. సభలో గందరగోళం మధ్య హోంమంత్రి అమిత్ షా 'బిల్లులను సంయుక్త కమిటీకి నివేదించాలనే ప్రతిపాదన'ను ప్రతిపాదించారు. భారత రాజ్యాంగ సవరణ, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం, 1963; జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019కి సంబంధించిన మూడు బిల్లులు. బిల్లులను పరిశీలించడానికి సంయుక్త కమిటీలో పని చేయడానికి 10 మంది సభ్యులను నామినేట్ చేయడానికి సంబంధించిన ప్రతిపాదనను రాజ్యసభ గందరగోళం మధ్య ఆమోదించింది. కాగా, అమిత్‌షా బుధవారం లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. లోక్‌సభ నుండి 21 మంది సభ్యులు, రాజ్యసభ నుండి 10 మంది సభ్యులతో కూడిన పార్లమెంటు సంయుక్త కమిటీకి బిల్లులను సూచించాలనే తీర్మానాన్ని దిగువ సభ ఆమోదించింది. నవంబర్ మూడవ వారంలో సమావేశమయ్యే అవకాశం ఉన్న శీతాకాల సమావేశాల్లో ఈ కమిటీ తన నివేదికను సభకు సమర్పించాల్సి ఉంది.

### కేరళ సిపిఐ ఎమ్మెల్యే
## వర్ఘూర్ సోమన్ ఆకస్మిక మృతి



**తిరువనంతపురం :** కేరళ రాష్ట్రం పీర్‌మేడ్ అసెంబ్లీ నియోజకవర్గం సిపిఐ ఎమ్మెల్యే వర్ఘూర్‌సోమన్(72) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైనప్పుడు ఆయన హఠాత్తుగా కుప్పకూలిపోయారు. ఎమ్మెల్యే సోమన్‌ను హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తొలిసారి శాసనసభ్యుడైన వర్ఘూర్ సోమన్ 2021 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సిరియక్ థామస్‌ను ఓడించారు. ఎఐటియుసి కేరళ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా పనిచేశారు. పూర్వ సిపిఐ రాష్ట్రకార్యదర్శి కానం రాజేంద్రన్‌కు సోమన్ అత్యంత సన్నిహితుడిగా పేరొందారు. కార్మికసంఘ నాయకుడిగా సోమన్ కేరళ రాష్ట్ర రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించారు. కొట్టాయంలోని వర్ఘూర్‌లో 1952 సెప్టెంబర్ 14న కుంజుపప్పన్, పార్వతి దంపతులకు జన్మించిన వర్ఘూర్ సోమన్ ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) ద్వారా రాజకీయాలలోకి ప్రవేశించారు. పీర్‌మేడ్ అసెంబ్లీ నియోజకవర్గం ఇడుక్కి జిల్లాలో ఉంది. ఆయన 2005నుండి 2010వరకు ఇడుక్కి జిల్లా పంచాయత్ వెల్ఫేర్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా, 2016 నుండి 2021వరకు స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు భార్య బిందుసోమన్, పిల్లలు సాబిన్ సోమన్, సోబిత్‌సోమన్ ఉన్నారు.

### సోమన్ మృతి కార్మికోద్యమానికి తీరని లోటు : సిపిఐ సంతాపం

పీర్‌మేడ్ సిపిఐ శాసనసభ్యుడు వర్ఘూర్ సోమన్ కార్మికోద్యమానికి, పీడిత తాడిత అట్టడుగువర్గాల ప్రజలకు తీరని లోటు అని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంతాపం తెలిపింది. ఆయన మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి కూడా పూడ్చలేని లోటు అని విచారం వ్యక్తంచేసింది. ప్రస్తుతం కేరళ రాష్ట్ర ఎఐటియుసి వైస్ ప్రసిడెంట్‌గా, జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేస్తున్న వర్ఘూర్ సోమన్ ఆసియాలోనే అతిపెద్ద తోటల కార్మికుల సంస్థగా పేరొందిన 'పీర్‌మేడ్ ప్లాంటేషన్ వర్కర్స్ యూనియన్' ప్రధానకార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్నారు.ఇడుక్కిలోని ఎత్తైన ప్రాంతాలలోని తోట కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల పోరాటాలకు నాయకత్వం వహించడంలో వర్ఘూర్ సోమన్ కీలక పాత్ర పోషించారని సిపిఐ శ్లాఘించింది. 2021లో పీర్‌మేడ్ ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగిడిన ఆయన ప్రజల సమస్యలపై గళమెత్తారని, న్యాయం, సమానత్వం, అణగారిని వర్గాల హక్కుల సాధనలో ఆయనకు అచంచలమైన నిబద్ధత గుర్తించబడిందని సిపిఐ ఆయన సేవలను గుర్తుచేసింది. ఆయన మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి, ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి, కేరళలోని ప్రగతిశీల శక్తులకు తీరని లోటు అని పేర్కొంది. ఆయన కుటుంబానికి, కార్మికులకు, పీర్‌మేడ్ ప్రజలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేసింది

## త్వరలోనే సొంత రాకెట్‌లో అంతరిక్ష యాత్ర

### వ్యోమగామి శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ :** అంతరిక్షం గురించి క్షేత్రస్థాయిలో నేర్చుకునే దానికన్నా కంటే పొందిన అనుభూతి భిన్నమైనది అని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఉన్నారు. అంతరిక్ష యాత్ర అనేది యావత్ దేశ లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలోనే భూమిపై నుంచి సొంత రాకెట్‌లో ఎవరో ఒకరు అంతరిక్ష యాత్ర చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో అంతరిక్ష యాత్ర అనుభవాలను పంచుకున్నారు. 'యాక్సియం–4 మిషన్‌లో భాగంగా గతేడాదిలో నేర్చుకున్న పాఠాలు, భారత్ గగన్‌యాన్ మిషన్‌కు ఎంతో ఉపయోగపడతాయి. ఎంత శిక్షణ తీసుకున్నా, రాకెట్‌లో కూర్చొనప్పుడు కలిగే అనుభూతి పూర్తిభిన్నంగా ఉంటుంది. నిజానికి మొదటి కొన్ని సెకన్ల పాటు రాకెట్ వెనక పరిగేత్తుతున్నట్టే అనిపించింది. దానిని అందుకోవడానికి నాకు కొంత సమయం పట్టింది. అప్పటి నుంచి భూమి మీదకు తిరిగి వచ్చిన వరకు అనుభవం నమ్మశక్యం కానిది. దానిని మాటల్లో చెప్పడం కూడా కష్టంగా ఉంది. 1984లో వ్యోమగామి రాకేశ్ శర్మ అన్నట్టే ఇండియా ఈ రోజు కూడా సారే జహాసే అచ్చా(ప్రపంచలోకెల్లా గొప్పది). ఈ మిషన్‌ను విజయవంతగా కావడానికి కృషి చేసిన ప్రభుత్వానికి, ఇస్రోకు, ప్రతిఒక్కరికీ కృతజ్ఞులు. ఈ మిషన్‌ను దేశ ప్రజలందరికీ చేరేలా చేసినందుకు ధన్యవాదాలు. ప్రతిపౌరుడు ఈ మి షన్‌ను తనదిగా భావించాడు. ఇది నిజంగా దేశం మొత్తం మిషన్‌గా అనిపించింది' అని శుక్లా పేర్కొన్నారు. ఇదేవిలేకరుల సమావేంలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ మాట్లాడారు. 'స్పేస్ విభాగం దాదాపు 70ఏళ్లుగా ఉంది. ఇస్రో 1969లో ఏర్పడింది. కానీ ఈ స్థాయి పురోగతి గత కొన్ని సంవత్సరాల్లో ఎందుకు జరగాల్సి వచ్చింది. గత 56 దశాబ్దాల్లో ఎందుకు జరగలేదు. ప్రపంచ వ్యూహాలను మేంఅనుసరించడం ప్రారంభించాం. ఇప్పుడు మనప్రమాణాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి' అని జితేంద్రసింగ్ అన్నారు. కొన్ని నెలల్లో దీపావళి వస్తుంది. ఆసమయంలోనే రా ముడు అయోధ్యకు చేరుకున్నారు. ఇక్కడ నేను లక్ష్మణుడిలా ఉండాలనుకుంటున్నా. నేను శుక్లా కంటే పెద్దవాడిని. అయినప్పటికీ రాముడికి లక్ష్మణ్‌లా ఉండడానికే ఇష్టపడతా. అయితే, రామలక్ష్మణులకు వానరసేన సహాయం చేసినట్టే, మాకు ఇస్రోబృందం అండ గా ఉంది. లేకపోతే ఇది సాధ్యం అయ్యేది కాదు' ప్రశాంత్ అన్నారు.

## భర్తపై ఆధారపడనని భార్య చెప్పొద్దు : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** పెళ్లి అంటే ఒక్కటిగా కలిసి జీవించడం అని, ఒకరిమీద ఒకరు ఆధారపడకుండా.. వ్యక్తిగతంగా జీవించడం కాదు అని సుప్రీంకోర్టు పేర్కొంది. వేర్వేరుగా జీవిస్తున్న భార్యాభర్తల కేసులో గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పెళ్లి చేసుకున్న జంట.. భాగస్వామి మీద ఆధారపడకుండా, వ్యక్తిగతంగా ఉంటానని చెప్పడం సరికాదు అని కోర్టు తెలిపింది. ఒకవేళ ఎవరైనా వ్యక్తిగతంగా జీవించాలనుకుంటే, అప్పుడు వాళ్లు వైవాహిక బంధంలోకి వెళ్లకూడదని సుప్రీం ధర్మాసనం తెలిపింది. జస్టిస్ బివి నాగరత్న, ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. వివాహ బంధం కొనసాగుతున్న సమయంలోనే.. వ్యక్తిగతంగా జీవిస్తామని.. భార్య కానీ, భర్త కానీ చెప్పడం కుదరదు అని కోర్టు చెప్పింది. ఈ విషయంలో కోర్టు చాలా స్పష్టంగా ఉందని, పెళ్లి అంటే కలిసి జీవించడం అని ధర్మాసనం అభిప్రాయపడింది. పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు, రెండు ఆత్మలు ఏకం కావడం అని, మీరెలా వ్యక్తిగతంగా ఉండగలరని కోర్టు ప్రశ్నించింది. పెళ్లి చేసుకున్న జంట.. వ్యక్తిగతంగా జీవిస్తానని చెప్పడం అసాధ్యమని కోర్టు పేర్కొన్నది. ఒకవేళ ఆ జంట ఒక్కటైతే, మేం సంతోషంగా ఉంటామని, ఎందుకంటే వాళ్ల పిల్లలు ఇంకా చిన్నవయసులోనే ఉన్నారని కోర్టు చెప్పింది. గూడు చెదిరిన ఇంట్లో ఎలా ఆ పిల్లలు ఉంటారని, దీంట్లో వాళ్ల తప్పు ఏంటని కోర్టు ప్రశ్నించింది. ఇద్దరూ తమ మధ్య ఉన్న విభేధాలను పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. ప్రతి భార్యాభర్తల మధ్య ఏదో ఒక రకమైన వివాదం ఉంటుందని కోర్టు అభిప్రాయపడింది. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ దాఖలు చేసిన పిటీషన్‌పై గురువారం సుప్రీంలో విచారణ జరిగింది. భర్త సింగపూర్‌లో ఉంటున్నాడు. ఆ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సింగపూర్ వెళ్లేందుకు భార్య ఇష్టపడడం లేదు. సింగపూర్‌లో తన భర్త ప్రవర్తన సరిగా లేదని ఆమె కోర్టుకు చెప్పింది. ఆసమయంలో కోర్టు ఆమెను కొన్ని ప్రశ్నలు వేసింది. పిల్లల పేరిట కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలని భర్తకు కోర్టు సూచన చేయగా, అయితే తాను ఎవరిపై ఆధారపడడానికి ఇష్టంగా లేనట్లు భార్య చెప్పింది. ఆ సమయంలో జస్టిస్ నాగరత్న స్పందిస్తూ మీరలా మాట్లాడకూడదని, ఒకసారి పెళ్లి అయితే, మీరు భావోద్వేగంగా, మరే రీతిలో అయినా భర్తపై ఆధారపడుతారని, ఆర్థికంగా కాకపోవచ్చు అన్నారు. తాను ఎవరి మీద ఆధారపడను అని చెప్పవద్దు అని, అలాంటప్పుడు ఎందుకు పెళ్లి చేసుకున్నారని జస్టిస్ నాగరత్న అడిగారు. తాను పాతకాలం మనిషినే కావొచ్చు, కానీ భర్తపై ఆధారపడను అని ఏభార్య కూడా చెప్పవద్దు అన్నారు. మీరంతా చదువుకున్నవాళ్లు, సమస్యను మీరే పరిష్కరించుకోవాలని జస్టిస్ తెలిపారు.

## ఢిల్లీ సిఎంకు జెడ్ క్యాటగిరీ భద్రత



**న్యూఢిల్లీ :** ఢిల్లీ సిఎం రేఖాగుప్తాపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఢిల్లీ సిఎం భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది. ఈ నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఢిల్లీ సిఎం భద్రతను పెంచింది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సిఆర్‌పిఎఫ్)తో జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. దీంతో గురువారం ఉదయం సిఆర్‌పిఎఫ్ సిబ్బంది సిఎం నివాసానికి చేరుకుంది. సిఎంకు 24 గంటలూ రక్షణ కల్పించేందుకు ముఖ్యమంత్రి నివాసంతో పాటూ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున మోహరించారు. సిఆర్‌పిఎఫ్‌తోపాటూ ఢిల్లీ పోలీసులు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ సిఎంకు నిరంతరం రక్షణ కల్పించనున్నారు. బుధవారం ఉదయం అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయి'(ప్రజావాణి) కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతుండగా ఓ వ్యక్తి ఆమె దగ్గరికి వచ్చి.. కొన్ని పేపర్లు అందజేశాడు. హఠాత్తుగా ఆమె చేయి పట్టుకుని తనవైపు లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో సిఎం తలకు స్వల్ప గాయమైంది. అక్కడ ఉన్నవారు అతడిని బంధించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదుచేశారు. నిందితుడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్‌భాయ్ సకారియా(42)గా గుర్తించారు. అతడు జంతు ప్రేమికుడిగా తెలుస్తున్నది.

## ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్య నాశనమే ఎక్కువ

### కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ :** బిహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల కమిషన్ స్వయంగా నిర్వహించిన 2024 సర్వేను కాంగ్రెస్ గురువారం ఉదహరించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఓటర్ల జాబితాను శుభ్రపరచడం గురించి కాదని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడం గురించి అని ఆరోపించింది. బిహార్ ఎన్నికల జాబితాను శుభ్రపరచడానికి ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను ప్రారంభించినప్పటికీ, ఓటరు అంతర్దృష్టులపై దాని స్వంత కెఎపి (జ్ఞానం, వైఖరి, అభ్యాసాలు) సర్వే బిహార్‌లో ఓటరు జాబితా పరిపూర్ణ కచ్చితత్వాన్ని గుర్తించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో మీడియా నివేదికను పంచుకున్నారు. '2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత బిహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల కమిషన్ స్వంతంగా నిర్వహించిన 2024 కెఎపి (నాలెడ్జ్, యాటిట్యూడ్ అండ్ ప్రాక్టీసెస్) సర్వేలో ఓటర్ల జాబితా ఇప్పటికే 'పరిపూర్ణ కచ్చితత్వం' వద్ద ఉందని పేర్కొంది. కాగితపు పని, అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది అర్హత కలిగిన పౌరులు ఇప్పటికీ ఓటరుగా నమోదు కాలేదని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. చాలా మంది ప్రతివాదులు తమ ఓటరు కార్డులను భద్రపరచడంలో సంక్లిష్టతలను ఉదహరించినందున ఇసిఐ దృష్టి మినహాయింపుపై కాకుండా చేర్చడంపై ఉండాలని జైరామ్ రమేష్ అన్నారు. జనవరి 2025 నాటికి బిహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇసిఐ విశ్వసించలేదుదని, అప్పటి నుండి ఏమి మారిందని అని ఆయన అన్నారు. బిహార్‌లో రిగ్గింగ్ ఎన్నికల హామీ ద్వారా తన పదవిని దక్కించుకోవడానికి, శిథిలావస్థలో ఉన్న ఎన్‌డిఎ సంకీర్ణాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తి ఇది కాదా అని రమేష్ ప్రశ్నించారు.

## లాటరల్ ఎంట్రీ నియామకాల్లో రిజర్వేషన్లు వర్తించవు

### రాజ్యసభకు కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ :** లాటరల్ ఎంట్రీ మోడ్ ద్వారా జరిగే నియామకాల్లో రిజర్వేషన్లు వర్తించవని ప్రభుత్వం గురువారం రాజ్యసభకు తెలిపింది. ప్రభుత్వ విభాగాలలో ప్రైవేట్ రంగానికి చెందిన వారితో సహా నిపుణుల నియామకాన్ని లాటరల్ ఎంట్రీ అంటారు. '2018 నుండి మూడు విడతల్లో (2018, 2021, 2023) లాటరల్ ఎంట్రీ ద్వారా వివిధ ప్రభుత్వ విభాగాలలో కాంట్రాక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన జాయింట్ సెక్రటరీ/డైరెక్టర్/డిప్యూటేషన్ ప్రాతిపదికన ఇప్పటివరకు 63 నియామకాలు జరిగాయని కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఈ నియామకాలు డొమైన్ ప్రాంతంలో వారి ప్రత్యేక జ్ఞానం, నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్దిష్ట నియామకాల కోసం జరిగాయన్నారు. ఈ నియామకాలలో ప్రతి ఒక్కటి ఒకే పోస్ట్ కేడర్‌కు వ్యతిరేకంగా చేయబడినందున, సుప్రీంకోర్టు 'పిజిఐఎంఆర్, చండీగఢ్ వర్సెస్ ఫ్యాకల్టీ అసోసియేషన్, ఇతరులు' అనే కేసులో తీర్పును దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ వర్తించదు. తదనుగుణంగా నియమించబడిన అధికారుల కేటగిరీ వారీగా డేటాను నిర్వహించలేదు' అని మంత్రి అన్నారు. ప్రస్తుతం వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో 43 మంది అధికారులు పనిచేస్తున్నారని సింగ్ అన్నారు.

### కేంద్రం తీసుకొస్తున్న చట్టాలు..
## రాజ్యాంగానికి చెదపురుగుల్లాంటివి

### పిఎం, ముఖ్యమంత్రులు, మంత్రుల తొలగింపు బిల్లులపై రాజ్యసభ ఎంపి కపిల్‌సిబల్ ధ్వజం



**న్యూఢిల్లీ :** కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతోన్న బిల్లుల తీరుపై రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తీవ్ర అభియోగాలపై వరుసగా 30 రోజులపాటు అరెస్ట్ చేయబడి జైల్లో ఉంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించాలని ప్రతిపాదించే బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టడాన్ని గురువారం కపిల్ సిబల్ తీవ్రంగా విమర్శించారు. అలాంటి చట్టాలు రాజ్యాంగానికి 'చెద పురుగుల్లా పనిచేసే చట్టాలు' అని ఆయన నొక్కిచెప్పారు. ప్రతిపక్ష మంత్రులను, ముఖ్యమంత్రులను లక్ష్యంగా చేసుకోవడమే ఈ బిల్లు యొక్క ముఖ్యోద్దేశంగా కనిపిస్తున్నదని సిబల్ ఆరోపించారు. ఈ చర్యల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని అనేక ప్రాథమిక సవరణలను 'నాశనం' చేస్తోందని మండిపడ్డారు. అయితే రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమని, ప్రభుత్వానికి అది లేనందున ప్రభుత్వం బిల్లులను ఆమోదించలేమని కపిల్ సిబల్ తెలిపారు. ఇండిపెండెంట్ రాజ్యసభ ఎంపి అయిన కపిల్ సిబల్ గురువారం ఇక్కడి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ '2014 నుంచి రాజ్యాంగం మనకు ఇచ్చిన మానవ హక్కులను లాక్కునే అనేక చట్టాలను మనం చూశాం. అలాంటి చట్టాలు రాజ్యాంగ నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి' అని కపిల్ సిబల్ పేర్కొన్నారు. బుధవారం హోంమంత్రి అమిత్‌షా లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. తీవ్ర అభియోగాలపై వరుసగా 30 రోజుల పాటు అరెస్ట్ చేయబడి జైల్లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించాలన్న ప్రతిపాదనతో ప్రవేశపెట్టిన బిల్లు కూడా అందులో ఒకటి. అయితే ప్రతిపక్ష ఎంపిలు దీనిని తీవ్రంగా ఆక్షేపిస్తూ పెద్దపెట్టున దీనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమిత్‌షా సీటు వద్దకు ప్రదర్శనగా దూసుకెళ్లారు. చట్టం ముసాయిదా ప్రతులను చింపివేసి నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా ప్రతిపాదన, బిల్లులను సభ 21మంది సభ్యులు ప్రాతినిధ్యం వహించే జాయింట్ పార్లమెంట్ కమిటీ, 10 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ కమిటీకి స్క్రూటినీకి పంపించారు. తరువాత ఆ మూడు బిల్లుల్లో కేంద్రపాలిత ప్రభుత్వం (సవరణ) బిల్లు 2025, రాజ్యాంగం ( 130వ సవరణ) బిల్లు 2025, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2025 ఉన్నాయి. కపిల్ సిబల్ మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, హేమంత్ సొరేన్‌ను ఉదాహరణలుగా చెబుతూ ఈ బిల్లులను చూస్తే ప్రతిపక్ష మంత్రులు, ముఖ్యమంత్రులను లక్ష్యంగా చేసుకున్న ఉద్దేశం స్పష్టం అవుతోందని కపిల్ సిబల్ అన్నారు.

### నటి వేధింపుల ఆరోపణలు..
## కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా



**తిరువనంతపురం :** మలయాళ నటి రిని జార్జ్ చేసిన వేధింపుల ఆరోపణలు కేరళ రాజకీయాల్లో ప్రకపంనలు సృష్టించాయి. ఓ యువ రాజకీయ నేత మూడేళ్లుగా తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు నటి ఆరోపించారు. ఆమెను వేధించింది కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కూటతిల్ అని ఆరోపిస్తూ బిజెపి ఆందోళనలు చేసింది. దీంతో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా చేశారు. ప్రముఖ రాజకీయపార్టీ చెందిన ఓ యువ నాయకుడు మూడేళ్లుగా తనకు అసభ్యకర సందేశాలు పంపిస్తూ వేధిస్తున్నట్టు రిని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఫైవ్‌స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేసి రావాలని వేధించినట్టు ఆరోపించారు. అయితే అతడి పేరు, పార్టీ పేరు మాత్రం నటి వెల్లడించలేదు. మూడేళ్ల క్రితం సామాజిక మాధ్యమాల ద్వారా అతడితో పరిచయం ఏర్పడినట్లు నటి తెలిపారు. అప్పటి నుంచి తనను వేధిస్తున్నట్టు ఆమె ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. భద్రతా కారణాల దృష్ట్యా, న్యాయ వ్యవస్థపై నమ్మకం లేకపోవడం వల్లే అతడిపై ఫిర్యాదు చేయలేదని రినీ జార్జ్ వెల్లడించారు. తననే కాదు మరికొందరు మహిళలను కూడా అతడు వేధించినట్లు నటి ఆరోపించారు.

**'ఏ తప్పు చేయకపోయినా రాజీనామా చేస్తున్నా'...**

ఈ పరిణామాల నేపథ్యంలో కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా చేశారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడానని, వారెవరూ తనను రాజీనామా చేయాలని డిమాండ్ చేయలేదని రాహుల్ చెప్పారు. నటి జార్జ్ తన స్నేహితురాలని ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి తాను కాదన్నారు. తాను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదని రాహుల్ వివరణ ఇచ్చారు. ఏ తప్పు చేయకపోయినా తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవాలేనని నిరూపించేందుకు రాజీనామా చేసినట్లు చెప్పారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 22 ఆగస్టు

# నిరంకుశాధికార బిల్లులు

రాజ్యాంగాన్ని రద్దు చేయకుండానే దాన్ని లోపలినుంచి నాశనం చేయటం సాధ్యమేనన్న దాని రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అభిప్రాయాన్ని నిజంచేసే దిశలో ఆర్ఎస్ఎస్–బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మరో చర్యకు ఉపక్రమించింది. నైతికంగా ఎంతో ఉన్నత ప్రమాణాలను పరిరక్షించే సంకల్పంగా హోంమంత్రి అమిత్ షా 130వ రాజ్యాంగ సవరణ బిల్లును, తత్సంబంధ మరో రెండు బిల్లులను బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. హిందూ రాష్ట్ర (దేశం) స్థాపన ధ్యేయంగా సంపూర్ణాధికారాన్ని కోరుకుంటున్న ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రభుత్వం ఇప్పటికే 'ఒక దేశం – ఒకే ఎన్నికలు' బిల్లు తెచ్చింది. ఇప్పుడది పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది. ఎన్నికల కమిషనర్ల చట్టాన్ని సవరించి వారి నియామకాన్ని తమ చెప్పుచేతల్లోకి తీసుకుని ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు పాల్పడుతూ తప్పుడు పద్ధతుల్లో అధికారాన్ని సొంతం చేసుకుంటున్నది. ఇండియా కూటమి దీనిపై ప్రస్తుతం బిహార్‌లో ఆందోళన సాగిస్తోంది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల ప్రకారం జడ్జీల నియామకాలు చేయకుండా తొక్కిపట్టి, వడపోతలు, తిరస్కరణలతో తన ఆధిపత్యం నెరపుతోంది. మీడియాను ఇప్పటికే తమ చెప్పుచేతుల్లోకి తీసుకుంది. నూతన విద్యావిధానం ద్వారా చరిత్రను వక్రీకరిస్తూ హిందూత్వ విద్యకు ప్రాధాన్యత ఇస్తోంది. మైనారిటీలను అణచివేస్తోంది. అక్రమ కేసులతో ప్రతిపక్ష నాయకులను, అసమ్మతి గళమెత్తిన మేధావులను ఏళ్లతరబడి జైళ్లలో బంధించి బెయిలు రాకుండా వేధిస్తున్నది. పౌరహక్కులను కాలరాసి మావోయిస్టులపై నరమేధం సాగిస్తోంది.

తాజా బిల్లులను దేశంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీల పట్ల బిజెపి శత్రుపూరిత, అణచివేత వైఖరి నేపథ్యంలో గమనంలోకి తీసుకోవాలి. ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో పార్టీలను చీల్చుతూ, ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ అధికారం దక్కించుకుంటున్నది. ప్రతిపక్ష ప్రభుత్వాలపై గవర్నర్‌లను ప్రయోగించి పరిపాలనకు ఆటంకాలు కల్పిస్తూ, నిధుల విడుదల తొక్కిపడుతూ సమాఖ్య భావనకు తూట్లు పొడుస్తున్నది. ప్రతిపక్ష పార్టీల నాయకులపై, మంత్రులు, ముఖ్యమంత్రులపై సిబిఐ, ఇడి, ఐటిలను ప్రయోగించి, సోదాలు, అరెస్టులు చేసి వారిపై అవినీతి ముద్ర వేస్తోంది. తామొక్కరిమే నిజాయితీపరులైనట్లు, ప్రతిపక్షాలపై నిత్యం నిందారోపణలు చేసే బిజెపి కేంద్రప్రభుత్వం ఇప్పుడు "ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, మంత్రులను ఐదు సంవత్సరాలకు మించి శిక్షార్హమైన క్రిమినల్ నేరారోపణలతో ఏదైనా ప్రభుత్వ ఏజన్సీ అరెస్టు చేసి లేదా జైల్లో నిర్బంధించి (డిటైన్‌చేసి) 30 రోజులకుపైగా ఉంచినట్లయితే, అటువంటివారు 31వ రోజు ఆటోమాటిక్‌గా అధికార పదవులను కోల్పోయే అధికారాలతో" రాజ్యాంగ 130వ సవరణను అమిత్ షా ప్రవేశపెట్టారు. పరిపాలనను "పరిశుద్ధం చేసేందుకు ఉద్దేశించినట్లు చెప్పబడుతున్న ఈ బిల్లు" పూర్తిగా అప్రజాస్వామికమైంది, రాజ్యాంగ వ్యతిరేకమైంది. ఇలా అంటే అవినీతిని సమర్థిస్తున్నట్లు కాదు.

మందబుద్ధికి సైతం కొన్ని అనుమానాలు రావటం సహజం. ఉదాహరణకు, ప్రధానమంత్రిపై బోఫర్స్, రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం లాంటి వాటిపై అవినీతి ఆరోపణలు దేశ, విదేశ మీడియాలో వచ్చాయనుకుందాం, ప్రతిపక్షాలు గొంతుకలిపాయనుకుందాం. అప్పుడు ప్రధానిని అరెస్టు చేయగల ఏజన్సీ ఉందా? లేక ప్రధానిని బర్తరఫ్ చేసే అధికారం 'మంత్రిమండలి సలహా'పై నడుచుకోవలసిన రాష్ట్రపతికి రాజ్యాంగం ఇచ్చిందా, లేదే! కేంద్రంలో ప్రభుత్వం లేకుండా ఉండటానికే వీలు లేదు కదా? ఒక ప్రధానమంత్రి ప్రభుత్వం మైనారిటీలో పడినా/పార్లమెంటులో ఓడి రాజీనామా చేసినా ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడేవరకు అతనే ఆపద్ధర్మ ప్రధాని తప్ప రాష్ట్రపతికి పాలనాధికారం లేదే! 1996లో ఎబి.వాజ్‌పేయి 13 రోజుల ప్రభుత్వం కూలిపోగా తదుపరి ఎన్నికల వరకు ఆయనే ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగటం గుర్తు చేసుకోదగింది. ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రపతికి ప్రధానిని బర్తరఫ్ చేసే అధికారం ఇస్తుందా? ప్రధాని సలహాపై రాష్ట్రపతి మంత్రులను నియమించవచ్చు, తొలగించవచ్చు.

రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించటానికి – గతంలో ఆ అధికారం అతిగా దుర్వినియోగం అయిన దృష్ట్యా రాజ్యాంగ సవరణ ద్వారా అట్టి చర్యకు కట్టుబాట్లు విధించినప్పటికీ, ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసి కొంతకాలం రాష్ట్రపతిపాలన అనగా గవర్నర్ పాలన విధించే అవకాశం ఉంది. పార్లమెంటు ఆమోదంతో కొనసాగించనూవచ్చు. దీన్ని కశ్మీర్‌లో చూశాం. మణిపూర్‌లో చూస్తున్నాం. అయితే అది ఎప్పుడు? అతడు శాసనసభా పార్టీ విశ్వాసం కోల్పోయినప్పుడు', మైనారిటీలో ఉండి కూడా రాజీనామా చేయకుండా రాజకీయాలు చేస్తున్నప్పుడు, శాంతి–భద్రతలు పూర్తిగా భగ్నమైనప్పుడు.

మరో ముఖ్యమైన సమస్యను పరిశీలించుదాం. ప్రతిపాదిత బిల్లు ప్రకారం అటువంటి అరెస్టులు జరిగాయనే ఊహించుకుందాం. అయ్యావారు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు కేంద్ర హోంమంత్రి పురమాయిస్తే సిబిఐ, ఇడిలు ఎవరిపైనైనా క్రిమినల్ కేసు బనాయించి బొక్కలో వేయటం సులభం. న్యాయవ్యవస్థ 30రోజుల నియమంలోపల బెయిలు ఇస్తుందన్న హామీ లేదు. అందుకు ప్రాసిక్యూషన్ ఏజన్సీ అడ్డుపడుతుంది. బెయిలు దొరకదు. అప్పుడు ఆ నిందితుడు పదవి కోల్పోతాడు. ఆర్నెల్లకో, సంవత్సరానికో బెయిలుపై విడుదలయ్యే వరకు రాజకీయ జీవితం కోల్పోతాడు. కోల్పోయిన పదవి అతని కోసం సిద్ధంగా ఉండదు. ఐదేళ్లకో, పదేళ్లకో అతడు నిర్దోషి అని కోర్టు నిర్ధారించినా ప్రయోజనం ఉండదు కదా! అందువల్ల దుర్వినియోగానికి పూర్తి అవకాశం ఉంది.

రాజకీయ అవినీతి కేసుల్లో సిబిఐ, ఇడి, ఐటి ప్రాసిక్యూషన్ ఏజెన్సీలు. అవి సచ్ఛీలురతో కూడి ఉంటాయని రాజ్యాంగ నిర్మాతలు ఊహించారు. కానీ ఆచరణలో అవి పాలకుల చేతిలో కీలుబొమ్మలు కాలేదా? సిబిఐ 'పంజరంలో చిలుక' అని సుప్రీం కోర్టే అభిశంసించలేదా? ఇడి మోసకారి (క్రూక్)గా వ్యవహరించరాదని ఈ మధ్యనే సుప్రీం కోర్టు ధర్మాసనం చురక అంటించింది. ఇడి కేసులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. సంవత్సరానికి 2శాతానికి మించి పరిష్కారం కావటంలేదు. అటువంటి కేసులో పదవిలో ఉన్న రాజకీయనాయకుడు చిక్కుకుంటే ఆ జీవితం అంతటితో సరి! చట్టం తరతమ భేదంలేకుండా అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుంది. కాని అధికారం చెలాయిస్తున్న బిజెపి ప్రత్యర్థులను దెబ్బతీయటానికే ఇప్పుడు ఆకస్మికంగా ఈ బిల్లులు తెచ్చిందనే అనుమానాలు త్రోసిపుచ్చదగినవి కావు. రాహుల్‌గాంధీ అన్నట్లుగా ఇది చక్రవర్తే అన్ని నిర్ణయాలు చేసే మధ్యయుగాల న్యాయంలోకి దేశాన్ని తీసుకెళుతుంది.

అయితే అవినీతిపరులు ఏలికలుగా కొనసాగవలసిందేనా? పరిష్కారం లేదా అనే ప్రశ్న ఎదురవుతుంది. బిజెపివారు జైలులోనుంచే ఆరునెలలు పరిపాలన చేసిన ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఉదంతాన్ని ప్రస్తావిస్తున్నారు. లిక్కర్ కుంభకోణంలో అరెస్టు చేయబడిన వెంటనే రాజీనామా చేసి ఉంటే అతని నిజాయితీని ఓటర్లు అర్థం చేసుకునేవారు. అలా చేయలేదుకాబట్టే, మూడుసార్లు నెత్తికెత్తుకున్న ఓటర్లు నాల్గవసారి ఆయన్ను, ఆయన పార్టీని నేలకేసికొట్టారు. ఇక్కడే మరో ఉదంతం. బొగ్గు కుంభకోణం నేరారోపణతో సిబిఐ అరెస్టు చేసిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వెంటనే పదవికి రాజీనామా చేసి, బెయిలుపై విడుదలైనాక తిరిగి ముఖ్యమంత్రి పదవి చేబట్టారు. ఆ తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఇండియా కూటమికి ఓటర్లు తిరిగి అధికారం అప్పగించారు. దీన్నుంచి నేర్చుకోవలసింది ఒక్కటే – మనం ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులన్న భావనను నమ్మాలి, పరిరక్షించాలి. పాలకుల తప్పొప్పులపై ఓటర్లే తీర్పు చెబుతారు. నిరంకుశాధికారాన్ని కూడా ప్రజలు సహించరు. ఎమర్జెన్సీ విధించినందుకు ఇందిరాగాంధీని ఓడించటమే గుణపాఠం. అందువల్ల బిజెపికి ప్రజాస్వామ్యంపై, ఫెడరల్ స్ఫూర్తిపై నమ్మకం ఉంటే పునరాలోచించాలి. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపిన ఆ బిల్లులను ఉపసంహరించుకోవాలి.

# తెలంగాణ 'గేమ్ ఛేంజర్' కులగణన!!


ఎస్.కె. జకీర్

'కులం ఒక సామాజిక వాస్తవం' అని సుప్రసిద్ధ పార్లమెంటేరియన్ ఎస్.జైపాల్ రెడ్డి చెబుతుండేవారు 'నేను రెడ్డి అయినందువల్ల చాలా లాభాలు పొందాను. నేను కులానికి దూరం కావాలనుకున్నా కులం నన్ను వదిలిపెట్టలేదు' అని ఆయన మరణించడానికి కి ఏడాది ముందు ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూలో చెప్పారు. జైపాల్‌రెడ్డి ప్రతిపాదించిన ఆలోచనా విధానాన్ని కాంగ్రెస్ పార్టీ అందుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతోంది. 1990 అక్టోబర్ 1న రాజ్యసభలో జైపాల్ రెడ్డి చేసిన ప్రసంగం చారిత్రాత్మకమైనది. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడాన్ని సమర్థిస్తూ ఆ ప్రసంగంలో బలంగా వాదించారు. కాంగ్రెస్ పార్టీ 'సామాజిక న్యాయ' పంథాను వీడినందువల్లనే బిజెపి ఎదుగుతోందని జైపాల్ రెడ్డి తన చివరి రోజుల్లో విశ్లేషించేవారని ఢిల్లీలో నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు ఒకరు గుర్తు చేశారు.


"ఒబిసిలు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడంలోనూ, వారికోసం చేపట్టాల్సిన చర్యలను గ్రహించడంలోనూ కాంగ్రెస్ విఫలమైనట్లు నాకు అనిపిస్తోంది. ఒబిసిలకు సానుకూలంగా ప్రతిస్పందించకపోవడం వల్లనే బిజెపికి అవకాశం కల్పించామని భావిస్తున్నా". ఇటీవల పార్టీ ఎంపిల నుద్దేశించి మాట్లాడుతూ రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణలో జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఇచ్చిన ప్రజంటేషన్‌ను పార్టీ హైకమాండ్ ప్రశంసించింది. రాహుల్ గాంధీ సహా ఆ పార్టీ అగ్రనేతల దగ్గర సిఎం రేవంత్ డిస్టింక్షన్ మార్కులు కొట్టేసినట్టు ఎఐసిసి వర్గాలంటున్నవి.

జైపాల్‌రెడ్డి స్ఫూర్తిని ఆయనకు అత్యంత సమీప బంధువైన రేవంత్‌రెడ్డి కార్యరూపంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రాహుల్ ఆయన కు పూర్తి ప్రోత్సాహం ఇస్తున్నారు. తెలంగాణ నమూనా దేశానికి ఆదర్శమని రాహుల్ గాంధీ ప్రకటించడం ఒక కీలక పరిణామం. సొంత కులం వారు ఆగ్రహిస్తారని తెలిసినా రేవంత్‌రెడ్డి తమ అంచనాలను అధిగమించి కులగణనను శాస్త్రీయంగా, అర్థవంతంగా జరిపించారని రాహుల్ ప్రశంసించడం తెలిసిందే.

"దళితులు, వెనుకబడిన వర్గాలు, అత్యంత వెనుకబడిన వర్గాల విశ్వాసాన్ని కాంగ్రెస్ చూరగొని ఉంటే బిజెపి ఎప్పుడూ అధికారంలోకి వచ్చి ఉండేది కాదు." ఢిల్లీలో ఎనిమిది నెలల కిందట దళిత మేధావుల సదస్సులో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ వ్యాఖ్యానించారు. వెనుకబడిన, అట్టడుగున ఉన్నవారి ఆందోళనలను సమగ్రంగా అర్థం చేసుకొని నిర్మాణాత్మక పరిష్కారాలను సాధించి ఉంటే వారు తమకు దూరమయ్యేవారు కాదని ఆలస్యంగానయినా రాహుల్ గాంధీ గుర్తించారు. భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ కులాన్ని ఎజండాగా చేపట్టలేదు. కానీ మండల్ కమిషన్ నివేదికను విపి సింగ్ వెలుగులోకి తీసుకురాగానే అద్వానీ నాయకత్వంలో బిజెపి రథయాత్ర చేపట్టి దాని ప్రభావాన్ని తుడిచి పెట్టేందుకు ప్రయత్నించింది. మోదీ నాయకత్వంలో 'హిందూత్వ'వాదాన్ని బిజెపి ఎజండాపైకి తీసుకువచ్చింది.

కాంగ్రెస్ తప్పిదాల వల్ల ఆ పార్టీ యువత, పేదలు, మహిళలు, రైతులు, వెనుకబడిన తరగతులు, దళితుల ఓటు బ్యాంకును బిజెపి దాదాపు తన వైపునకు తిప్పుకోగలిగింది. కులాన్ని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సంక్షేమ పథకాలు ప్రకటిస్తే సరిపోతుందన్న భావన కాంగ్రెస్ పార్టీలో చాలా కాలంగా ఉన్నది. ఆ పంథాను బిజెపి కూడా అనుసరించింది. బిజెపి కేవలం అగ్రవర్ణాల పార్టీగా ఉండేది. కాలక్రమంలో ఓబీసీల్లో అతి వెనుకబడిన వర్గాలను తన వైపునకు తిప్పుకొని సంఘటితం చేయగలిగింది. 2009 నుంచి 2019 మధ్య దేశ వ్యాప్తంగా బిజెపికి ఒబిసి ఓట్లు 20 నుంచి 44 శాతం మేరకు పెరిగాయన్న లెక్కలున్నవి. కాంగ్రెస్ సహా రాష్ట్ర స్థాయి పార్టీలను కూడా బిజెపి దెబ్బతీయగలిగింది. 2024 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఎన్డీఏ 4 శాతం ఒబిసి ల మద్దతును కోల్పోయింది. ఇండియా కూటమి 11 శాతం ఎగువ స్థాయి ఒబిసిలు,7 శాతం మరింత వెనుకబడిన ఒబిసిల మద్దతును సాధించగలిగింది.

జాతీయస్థాయిలో, వివిధ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ ఒబిసి ఓట్లతో లోక్‌సభ ఎన్నికల్లో పుంజుకున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో 'సామాజిక న్యాయాన్ని' ఎజెండాగా చేపట్టడం కన్నా కాంగ్రెస్‌కు మరో గత్యంతరం లేదు. రాజకీయ అధికారంలో, సంపదలోనూ వెనుకబడిన వర్గాలకు జనాభా ప్రాతిపదికన 'వాటా' ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఎవరి జనాభా ఎంత ఎక్కువ ఉంటుందో అంత భాగస్వామ్యం కల్పించాలనే నినాదంతో ప్రజల్లోకి వెళుతోంది. తెలంగాణలో వలె దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో కులగణన నిర్వహించి ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులను కూడా ఆరాతీస్తే ఈ దేశంలో ప్రజలు స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా ఏ స్థాయిలో ఉన్నారో కచ్చితంగా తేలేందుకు అవకాశాలు ఉన్నాయి. తద్వారా విధానాల రూపకల్పన కూడా శాస్త్రీయంగా చేసేందుకు తోడ్పడుతుంది.




'కులగణన'తో రేవంత్ రెడ్డి గ్రాఫ్ పెరిగింది. పాలనాపరంగానూ నిధుల కొరత ఉన్నా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఎకరానికి రూ.12వేలు రైతు భరోసా, ప్రతి కుటుంబం తినేలా సన్న బియ్యం పంపిణీ, అన్నదాతలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ, సన్న వడ్లు క్వింటాకు రూ.500 బోనస్, 77 వేల ఉద్యోగ నియామకాలు, హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఆడ బిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో తెలంగాణలో ప్రతి ఒక్క ఇంటికి సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేస్తున్నారు. కేవలం ఏడాదిన్నరలోనే తెలంగాణ పాలనారంగంపై చెరగని ముద్రవేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న మూడేళ్లలో ఇదే రీతిలో పాలన కొనసాగిస్తే తమ పార్టీకి నామరూపాలు ఉండవని కెసిఆర్, ఆయన కుటుంబం ఒణికిపోతోంది. అందుకే పాలనాపరమైన విమర్శలు మాని అసభ్య పదజాలంతో ముఖ్యమంత్రిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేస్తున్నారు.

అధికారం పోవడమే కెసిఆర్, కెటిఆర్‌లకు పీడకల అయితే, ఇంటిపోరు ఇద్దరినీ మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తండ్రి తనను ముఖ్యమంత్రిని చేస్తాడని కెటిఆర్ ఆశించారు. యువరాజు మహారాజుగా పట్టాభిషిక్తుడు అవుతాడంటూ కెటిఆర్ మద్దతుదారులు ప్రచారం నడిపించారు. కానీ కెటిఆర్ శక్తి, సామర్థ్యాలపై నమ్మకం లేని కెసిఆర్ ఆయనను దూరం పెట్టారు. 2023 ఎన్నికల తర్వాతైనా తనకు పట్టం కడతారని భావిస్తే ప్రజా తీర్పు కెటిఆర్ ఆశలపై నీళ్లు చల్లింది.గొర్రెల కుంభకోణం, మద్యం కుంభకోణం, కాళేశ్వరం కమీషన్ల బాగోతం, ఫోన్ ట్యాపింగ్‌లతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్‌ను తిరస్కరించారు. ప్రతిపక్షంలోకి వెళ్లిన తర్వాత కూడా ప్రజలు తమను ఎందుకు తిరస్కరించారో ఆత్మవిమర్శ చేసుకోకుండా, ప్రజలే తప్పు చేశారని నిందించడానికి పూనుకున్నారు.

2009లో తనతో పాటు ఎమ్మెల్యే అయిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని కెటిఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు. కెసిఆర్‌కు ప్రత్యామ్నాయ నాయకునిగా రేవంత్‌రెడ్డిని ప్రజలు ఆమోదించడం అనూహ్య ఘటన. అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడం, అధికారం పోయిన తర్వాత పార్టీ అధ్యక్ష బాధ్యతలు దక్కకపోవడం, చివరకు బిఆర్ఎస్ఎల్పీ నాయకత్వాన్ని సైతం కెసిఆర్ తన దగ్గరే ఉంచుకోవడం, ఓ వైపు చెల్లెలి తిరుగుబాటు ఇవన్నీ కెటిఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు హరీశ్‌రావు పార్టీని హస్తగతం చేసుకుంటారేమోనన్న బెంగ వెంటాడుతోంది. ఈ ఒత్తిడినంతా ముఖ్యమంత్రిపై తిట్లరూపంలో కెటిఆర్ వెళ్లగక్కుతున్నట్టు పరిశీలకులంటున్నారు.

కాగా తమ ప్రభుత్వం బిసిలకు కల్పించాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్లకు గతంలో కెసిఆర్ చేసిన చట్టమే శాపంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పకడ్బందీగా చట్టం చేశారని సిఎం ఒక సమావేశంలో మండిపడ్డారు. మరోపక్క మతం ముసుగులో బిజెపి నాయకులు బిసిల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. "మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చట్టంలోనే లేవు. అబద్దాలతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారు. దూదేకుల, నూర్ బాషా, బార్బర్, దోబీవృత్తి చేసే ముస్లింలకు 56 ఏళ్లుగా బిసి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్ లో బిసిలలో ఉన్న ముస్లింలను రిజర్వేషన్ల నుంచి తొలగించగలరా? గతంలో తెలంగాణ ఇస్తామని ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకున్నది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు. ఆయన సూచనల మేరకే కులగణన సర్వే చేశాం. దీన్ని తప్పుపడితే మరో వందేళ్ల వరకు బిసిలకు న్యాయం జరగదు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లులు రూపొందించి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపి నెలలు గడుస్తున్నా వాటిని ఆమోదించలేదు. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో కెసిఆర్ చేసిన చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్‌ను రూపొందించి, గవర్నర్ ఆమోదం కోసం పంపగా, అది కూడా రాష్ట్రపతి వద్దే పెండింగ్‌లో ఉంది" అని ముఖ్యమంత్రి ప్రస్తావించారు.

కాంగ్రెస్ పార్టీలోకి రేవంత్ రెడ్డి రాకముందు ఒక లెక్క, రేవంత్ వచ్చిన తర్వాత ఒక లెక్క. నిత్యం గొడవలు, పార్టీ ఫిరాయింపులతో అచేతనావస్థలో ఉన్న పార్టీని తనదైన శైలిలో ఉత్తేజం నింపి,అన్నీ తానే అయి కాంగ్రెస్ పార్టీని ఆయన అధికారంలోకి తీసుకువచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పనైపోయిందన్న వారికి, తన వ్యూహాలతో సమాధానం చెప్పారు. తనకంటూ ఒక మాస్ ఫాలోయింగ్‌ను ఏర్పాటు చేసుకొని విమర్శలు, స్వపక్షం నుంచే వ్యతిరేకత, కేసులు వంటి ఒడిదొడుకులను ఎదుర్కొని నిలబడినట్లు ముఖ్యమంత్రి పనితీరు గురించి కొందరు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు పదేళ్ల పాటు జరిగిన పరాభవాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో రేవంత్‌రెడ్డి తుడిచి పెట్టినట్టు ఎఐసిసి వర్గాల్లో ఒక టాక్ ఉంది. మొత్తమ్మీద 'సామాజిక న్యాయ' సాధన లక్ష్యాన్ని ప్రకటించిన రాహుల్ గాంధీ మెచ్చుకునే రీతిలో నిర్వహించిన 'కులగణన' తెలంగాణ రాజకీయాల్లో 'గేమ్ ఛేంజర్' గా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# మానవ హక్కులు హరిస్తున్న మత విద్వేషాలు

మతం, కులం, విశ్వాసాలను పాటించడానికి రాజ్యాంగం హక్కులను కల్పించింది. కులమతాలు మన వ్యక్తిగత అంశాలు. కులమతాలు మానవాళి ఐక్యతకు, ప్రపంచ శాంతికి అడ్డుపడరాదు. మాట్లాడడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, విశ్వాసాలు పాటించడం, ఆచారాలను గౌరవించడం, పరమత సహనం కలిగి ఉండడం పౌర సమాజ కనీస కర్తవ్యం. ఏటా ఆగస్టు 22న మతం లేదా విశ్వాసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం పాటించాలని ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించ డం హర్షదాయకం. మతం ఆధారంగా ఒక వర్గానికి చెందిన గృహాలను ధ్వంసం చేయడం, హింసాత్మక ఘటనలకు పూనుకోవడం, ఆస్తులు/వ్యాపారాలు/విద్యాలయాలు/సాంస్కృతిక కేంద్రాలు/ప్రార్థనా స్థలాలపై పలు రకాలుగా హింసాత్మక చర్యలకు పూనుకోవడం లాంటి సంఘటనలను తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలి, ఖండించాలి.

మైనారిటీల హక్కుల పరిరక్షణ, పరమత సహనం, మతం లేదా విశ్వాసాలను స్వేచ్ఛ గా వినియోగించుకునే హక్కులను కల్పించడం మానవాళి కనీస కర్తవ్యం. భావ ప్రకటన, మత విశ్వాసాలు పాటించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, శాంతి యుతంగా సమావేశాలు నిర్వహించుకోవడం లాంటి అంశాలకు రాజ్యాంగం పూర్తి స్వేచ్ఛ కల్పించాలి.. ఒకరి మత విశ్వాసం మరొకరికి అడ్డు పడరాదు. ఇతరుల మత విశ్వాసాలను గౌరవించడం అలవాటు కావాలి. ఈ విధమైన పలు రకాల హక్కులు ప్రధానమైనవి, పరస్పరం బలీయమైనవి, ఒకదానితో మరొకటి సంబంధం కలిగి ఉన్నది. ఇలాంటి హక్కులకు భంగం కలిగితే శాంతియుత వాతావరణం వేడెక్కి వివాదాస్పద హింసాత్మక ఘటనలకు దారి తీస్తాయి. ఇటీవల 22 ఏప్రిల్ 2025 రోజున పహల్గాం దుర్ఘటనలో హిందూ మతస్తులపై పాకిస్థాన్ ముస్లిమ్ ఉగ్రవాదులు భయంకరమైన దాడిచేసి 26 మంది ప్రాణాలు బలిగొనడం చూసాం. ఈ దుర్ఘటన మతపరమైన హక్కులకు భంగం కలిగించడమే కాకుండా ఒక మతానికి చెందిన వారిని ఏరి కోరి కాల్చి వేయడం దురదృష్టకరం. మతం మానవత్వానికి అడ్డు కారాదు. విశ్వాసాలు మరొకరికి విశ్వాసాలకు భంగం కలిగించరాదు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోరి మత విశ్వాసాలను వ్యక్తిగతంగా మాత్రమే పాటిస్తూ, మరొకరికి అడ్డు కాకుండా చూసుకోవాలి. పరమత సహనమే మంత్రంగా మన జీవితాలు సమైక్యతతో కొనసాగాలి. జాతి, కులం, మతం, విశ్వాసం, ఆచారం లాంటివి గౌరవించబడాలి. మన విశ్వాసాలు మరొకరి హక్కులకు భంగం కలిగించరాదని గమనించాలి. అన్నీ మరిచి మానవత్వమే సాధనంగా ప్రపంచ సమైక్యతకు పునాదులు వేయాలి, హింస లేని ప్రపంచ నిర్మాణం జరగాలి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

# సర్కార్ బడుల్లో రీడింగ్ క్యాంపెయిన్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ బడు ల్లో నిర్వహిస్తున్న 'రీడింగ్ క్యాంపెయిన్' విద్యార్థులలో పఠనా శక్తిని పెంపొందిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ, విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) సంయుక్త ఆధ్వర్యం లో విద్యార్థులలో పఠనా శక్తిని పెంచడానికి ఆగష్టు 20 నుండి జాతీయ అక్షరాస్యత దినోత్సవమైన సెప్టెంబర్ 5 వరకు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాల్ల తెలుగు ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. సెల్‌ఫోన్‌లు వచ్చిన తర్వాత పుస్తక పఠనం తగ్గిపోయిందని అనేకమంది విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదనను, ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. 'బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్' వచ్చింది. విద్యార్థులు సెల్ ఫోన్‌లకు పూర్తిగా బానిసలుగా మారుతున్నారు. గతంలో వచ్చిన మహమ్మారి కరోనా వైరస్ వల్ల ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ప్రయివేటు పాఠశాలలు, విద్యాసంస్థలు మూతపడటం, ఆన్‌లైన్‌లో విద్యాబోధన కొనసాగించడం జరిగింది. కరోనా తర్వాత పాఠశాలలు, విద్యాసంస్థలు ప్రాంభమైనా సెల్‌ఫోన్ వాడ టం మాత్రం మర్చిపోవడం లేదు.



తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈ ఆర్టీ) ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, గురుకుల, ఆదర్శ పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, విద్యార్థులలో పఠనా శక్తిని పెంచడానికి, అభ్యసన ఫలితాలు సాధించడానికి, విషయ పరిజ్ఞానం పెంపొందించడానికి శిక్షణ ఇవ్వడం జరిగింది. విద్యార్థులందరికీ చదవడం రావాలి. చదివింది అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్నది వ్యక్తీకరించడం వలన విద్యార్థులలో ఉపాధ్యాయులు ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుంది.

**పాఠశాల గ్రంథాలయాలు:** పాఠశాల గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర కథలు, నవలలు, నాటకాలు, దేశభక్తి గేయా లు, పాటలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, నిఘంటువులు, పద్యాల పుస్తకాలు ఉండడం వల్ల అవి చదివే విద్యార్థులకు విస్తృతమైన పఠనం చేయడానికి అవకాశం ఉంది. విద్యార్థులకు కావాల్సిన పోటీ పరీక్షలకు కావలసిన మెటీరియల్స్, పుస్తకాలు అందుబాటులో ఉండడం వల్ల పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బి.సి, ఇడబ్ల్యుఎస్, మైనారిటీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. విద్యార్థులకు పాఠశాల స్థాయిలో గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివే అలవాటు కావడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించడానికి, పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, విద్యార్థులలో పఠనాశక్తిని పెంపొందించడానికి చేస్తున్న కృషిపట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయు సంతోషాన్నివ్యక్తం చేస్తున్నారు.

డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, 9290826988

# జవాబుదారీతనానికి, పారదర్శకతకు పాతరేసిన ఎన్నికల కమిషన్

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి సంరక్షకుడిగా ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడిన భారత ఎన్నికల కమిషన్, ఇప్పుడు తప్పుడు కారణాల, నిర్ణయాల వల్ల తీవ్ర అపనమ్మకానికి గురవుతోంది. బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' ఆరోపణలను పరిష్కరించడానికి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఎన్నికల కమిషన్ సందేహాలు నివృత్తి కంటే ఎక్కువ సందేహాలను లేవనెత్తి సమస్యను మరింత జటిలం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాహుల్ గాంధీ ఆరోపణలను 'నిరాధారమైనది' అని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ, అఫిడవిట్ లేదా జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల నిర్వహణ, కమిషన్ నిష్పాక్షికత గురించి అనేక ప్రాథమిక ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేదు.

ఎన్నో ప్రశ్నలకు దాటవేసే ధోరణి కొనసాగింది, నీళ్లు నమలడం తప్ప చేయగలిగింది ఏమి లేదని సమాధానాలు దాటవేశారు. ఓటర్లకు భరోసా ఇవ్వడానికి బదులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రతిస్పందనలు లేకపోవడం చట్టబద్ధమైన ఆందోళనలతో పాల్గొనడానికి ఇష్టపడ ని సంస్థ ఇమేజ్‌ను చిత్రించాయి. వరద ప్రభావిత బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎందుకు అమలు పరుస్తున్నారు? ఎన్నికల సంవత్సరంలో అటువంటి సవరణకు వ్యతిరేకంగా కమిషన్ స్వంత మార్గదర్శకాల ఉల్లంఘన, ఎన్నికల జాబితా ఫార్మాట్లలో ఆకస్మిక మార్పులు, ప్రతిపక్ష నాయకులు గతంలో సమర్పించిన అఫిడవిట్‌లపై చర్య తీసుకోకపోవడం వంటి ప్రశ్నలు అన్నీ పక్కదారి పట్టాయి. ఓటరు ఐడి నకిలీ, బయోమెట్రిక్ భద్రతా ప్రమాణా లు లేకపోవడం మెషిన్‌రీ డబుల్ రోల్స్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలపై జర్నలిస్టులు కమిషన్‌ను ఒత్తిడి చేశారు. ఎన్నికల విశ్వసనీయతకు కేంద్రంగా ఉన్న పదకొండు ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు రాలేదు. కమిషన్ పక్షపాత పద్ధతిలో వ్యవహరిస్తుందనే ప్రతిపక్ష ఆరోపణను తేలికగా తోసిపుచ్చలేము. ఎన్నికల కమిషన్ అధికారం రాజ్యాంగబద్ధమైనది మాత్రమే కాదు, నైతికమైనది కూడా అని గుర్తుంచుకోవడం ముఖ్యం. దాని విశ్వసనీయత రాజకీయ పోరాటాలకు అతీతంగా ఉండి, ప్రభుత్వాలు లేదా పార్టీలకు కాదు, ఓటరుకు సేవ చేయగల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఎన్నికల సమగ్రతకు కేంద్రంగా ఉన్న ప్రశ్నలను తప్పించుకోవడం ద్వారా, భారత ప్రజాస్వామ్యన్ని అపహాస్యం చేసినట్లు. పారదర్శకతను కోరుతున్న సమయంలో కమిషన్ ఆ విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంది. బీహార్ వివాదం ఒక వియుక్త సంఘటన కాదు. ఓటర్ల జాబితాలను నిర్వహించడం, విధాన పరమైన న్యాయాన్ని నిర్ధారించడం విశ్వసనీయ ఆరోపణలకు ప్రతిస్పందించడంలో కమిషన్ ప్రవర్తన ఒక రాష్ట్ర ఎన్నికల ఫలితాన్ని మాత్రమే కాకుండా, ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధతను కూడా నిర్ణయిస్తుంది. 2004లో, రాబోయే ఎన్నికల కారణంగా ఎన్నికల కమిషన్ అరుణాచల్ ప్రదేశ్, మహారాష్ట్రలలో ఇలాంటి సవరణ చర్యలను వాయిదా వేసింది. ప్రజాస్వామ్యం హామీల ద్వారా మాత్రమే నిలవదు; ఇది నిష్పాక్షపాత్యత, జవాబుదారీతనంపై వృద్ధి చెందుతుంది.

కీలక అంశాలపై కమిషన్ మౌనం వహించడం తటస్థత కాదని అది తన బాధ్యతను వదులుకోవడమేనని గుర్తుంచుకోవడం మంచిది. విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, అది వాస్తవాలను రికార్డులో ఉంచాలి, దాని ప్రక్రియలను పూర్తిగా వివరంగా వివరించాలి రాజకీయ నాయకులు, పౌర ప్రజా సంఘాల నుంచి అది ఆశించే పరిశీలనకు లోబడి ఉండాలి.

ఎన్నికల కమిషన్ ఖ్యాతి కంటే ప్రమాదం అంచున ఉందని ప్రజలు భావిస్తే కష్టం. ఎన్నికలను భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా చేసే నమ్మకం సమతుల్యత మధ్య వేలాడుతోంది. బీహార్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో, కమిషన్ ఒక ప్రెస్ మీటింగ్ పెట్టి తమ వైఫల్యాలను బహిర్గత పరుచుకుంది.

విమర్శకులతో చర్చకు బహిరంగంగా పాల్గొనాలి, రాజకీయ పార్టీలు కోరినట్లే తనను తాను పరిశీలించుకోవాలి. ఏదైనా తక్కువైతే, 'స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలు' అనే పదబంధం ఒక వాస్తవికతగా కాకుండా ఒక ఆచార మంత్రంగా మారే ప్రమాదం ఉంది. సూర్యకాంతి ఉత్తమ క్రిమిసంహారక మందు. ప్రజాస్వామ్యంలో,ఎన్నికల కమిషన్ నీడ వెనుక దాక్కున్న అందరూ ఓడిపోతారు.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

## కాలనీ అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** అందరి సహకారంతో కాలనీని అభివృద్ధి చేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పసుపులేటి ప్రతాప్, వెంకట్‌రెడ్డిలు అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు కుందన్‌పల్లి కెఎస్ఆర్ టౌన్‌షిప్ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ ఎన్నికల అధికారి ఎంఎస్ చారి ప్రకటించారు. కోశాధికారి సుబుంకర్ పవన్‌తో సహా 21మంది కమిటీ సభ్యులను ఆయన ప్రకటించారు. నూతనంగా కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## అంబులెన్స్‌ను తనిఖీ చేసిన వైద్యాధికారి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రతి ఒక్క అంబులెన్స్‌లో వైద్య పరికరాలను అందుబాటులో తప్పనిసరిగా ఉంచుకోవాలని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కౌశిక్ సిబ్బందికి సూచించారు. 108 అంబులెన్స్‌లో ఉన్న ఆక్సిజన్, సక్షన్ యంత్రాలను వాటి పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా యాక్సిడెంట్ జరిగినచో ఆ యొక్క పేషెంట్‌ను హాస్పటల్‌కి తరలించేటప్పుడు అతనికి బిపి, పల్స్ ను చెక్‌చేసి తగు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఇందులో అంబులెన్స్ సిబ్బంది పైలెట్ బద్రు నాయక్, ఇఎంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.





## డిజిటల్ సేవలు ప్రారంభం

### తూంకుంట కమిషనర్ జ్యోతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్ ప్రజలు ఇంటి పన్నులు, వాణిజ్య పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో డిజిటల్ ప్రత్యేక సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో గృహ, వాణిజ్య యజమానులు తమ పన్నులను చెల్లించుటకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవా కేంద్రాలను(డిజిటల్ సేవలు) వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెనేజర్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని మేడ్చల్ జిల్లా ఆర్‌టిఎ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపల్‌కు చెందిన పొరనంది సువర్ణకు రూ.55 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బీమిడి జైపాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త హరికృష్ణ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి మురళీగౌడ్, కోశాధికారి చింతల నర్సింహారెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కామిడి మధుసూదన్‌రెడ్డికి ఘన నివాళులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ కామిడి మధుసూదన్‌రెడ్డి దశదినకర్మ సందర్భంగా మేడ్చల్ ఎంఎల్ఎ చామకూర మల్లారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం అల్వాల్‌లోని కామిడి మధుసూదన్‌రెడ్డి నివాసంలో జరిగిన దశదిన కర్మకు హాజరైన మల్లారెడ్డి మదుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సర్పంచ్‌గా ఆయన గ్రామానికి అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాం రవి, మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, మాజీ కోఆప్షన్ సభ్యుడు నర్సింలు, నాయకులు లక్ష్మారెడ్డి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## యువకులు స్వశక్తితో ఎదగాలి

### డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** యువకులు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకుని ఆర్థికంగా స్థిరపడాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మూడుచింతలపల్లిలో నూతన రెస్టారెంట్‌ను నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ లలో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్, నాయకులు రాజేంద్రప్రసాద్‌గౌడ్, వేణుగోపాల్‌రావు, బాబు, వీరేషం, దాసరి చిన్న కృష్ణారెడ్డి, వైద్యనాద్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు హక్కుల సాధనకు కృషి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తానని మూడుచింతలపల్లి మున్సిపాలిటి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కె.సుధాకర్‌నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక బోర్డు చైర్మన్ జలదిన్ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా కార్మిక బోర్డు చైర్మన్ జలదిన్ ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటిలోని ప్రతి కార్మికుడికి సభ్యత్వంతో పాటు గవర్నమెంట్ ఇన్సూరెన్స్ కార్డు తప్పని సరిగా చేయించాలని సూచించారు.



### గణేష్ ఉత్సవాలు, మిలాన్-ఉద్-నబీ నేపథ్యంలో

# శాంతి కమిటీలతో పోలీసుల వరుస సమావేశాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేష్ ఉత్సవాలు మరోపక్క మిలాన్ ఉద్ నబీ ఉత్సవాలు ఒకేసారి రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు ఆయా జోన్‌లలో శాంతి కమిటీలతో వరుస సమావేశాలు నిర్వహించారు. గురువారం నార్త్ జోన్ డిసిపి ఎస్.రష్మి పెరుమాళ్, సౌత్‌ఈస్ట్ జోన్ డిసిపి చైతన్యకుమార్ నేతృత్వంలో వేరువేరుగా గురువారం శాంతి కమిటీ సభ్యులు, గణేష్ మండప నిర్వాహకులు, మత పెద్దలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరువర్గాల పండుగలు ఒకేసారి రావడంతో భద్రతపై పోలీసులు మరింత దృష్టి సారించారు. ఈ క్రమంలోనే పోలీసులు కొన్ని సూచనలు జారీ చేశారు. గణేష్ విగ్రహాల ముందస్తు అనుమతులు, నిమజ్జన ఊరేగింపుల సమయంలో ముందు జాగ్రత్త చర్యలపై నిర్వాహకులకు సూచించారు. మెరుగైన భద్రత కోసం సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని డిసిపిలు






సూచించారు. మండే పదార్థాలు, విద్యుత్ వైరింగ్‌తో సంబంధం ఉన్న ప్రమాదాల దృష్ట్యా, నిర్వాహకులకు వీటి అవసరం గురించి తెలియజేశారు. 'సులభంగా అందుబాటులో ఉండే అగ్నిమాపక పరికరాలు, నీటి బారెల్స్ పెట్టుకోవాలని సూచించారు. పండల్ నిర్మాణం, అలంకరణల కోసం అగ్ని నిరోధక పదార్థాలను ఉపయోగించడం మంచిదన్నారు. సురక్షితమైన విద్యుత్ వైరింగ్‌ను నిర్ధారించడం, ఓవర్‌లోడ్ చేయబడిన సర్క్యూట్‌లను నివారించాలన్నారు. ప్రతి పండల్ వద్ద కనీసం ముగ్గురు స్వచ్ఛంద సేవకులు ఉండాలని, సంఘటనలను నమోదు చేయడానికి ఒక వ్యవస్థను నిర్వహించాలని నిర్వాహకులకు గుర్తు చేశారు. రద్దీని నివారించడానికి సరైన క్యూ వ్యవస్థలు, బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. రాత్రి 10 గంట ల నుండి ఉదయం 6 గంటల మధ్య శబ్ద స్థాయి పరిమితులకు కట్టుబడి ఉండటం, లౌడ్ స్పీకర్ల పరిమితం చేయాలన్నారు. విగ్రహ నిమజ్జనం సమయంలో భద్రతా చర్యలు, నియమించబడిన మార్గాలు, వాహన భద్రత, తుపాకీలు, కర్రలు, బాణసంచా నిషేధాన్ని ఖచ్చితంగా పాటించాలన్నా రు. అలాగే సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పుకార్లను నమ్మవద్దని, ఎవైనా పుకార్లు వస్తే పోలీసులకు తెలియ జేయాలన్నారు. నిర్వాహకుల సమస్యలను కూడా అధికారులు తెలుసుకుని పరిష్కరించారు. శాంతి యుతంగా వేడుకలు నిర్వహిస్తామని పోలీసు అధికారులకు వారు హామి ఇచ్చారు. ఈ సమావేశంలో ఆయా జోన్‌ల అదనపు డిసిపిలు, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, శాంతి సంఘం సభ్యులు, వినాయక మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## దశల వారీ సమస్యల పరిష్కారం

### కలెక్టర్ మనుచౌదరి





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దమ్మాయిగూడలోని అహ్మద్‌గూడ 2బిహెచ్‌కె కాలనీల్లోని సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరిస్తానని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. సమస్యల పరిష్కారించాలన్న డిమాండ్‌తో 2బిహెచ్‌కె నివాసితులు గత నాలుగు రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న నేపథ్యంలో గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్, జిల్లా హౌజింగ్ బోర్డు అధికారి రమణమూర్తిలతో కల్సి కలెక్టర్ స్వయంగా డబుల్ బెడ్ రూం నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. అనంత రం నివాసితులతో ఆయన మాట్లాడుతూ 41 బ్లాక్‌లలో ఉన్న డబుల్ బెడ్ రూం గృహాల్లో పలు సమస్యలు ఉన్న విషయాన్ని నిర్ధారించి విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాన్ని తొలగే లా చూస్తానని, ట్రాన్స్‌ఫార్మలకు కంచెలతో భద్రత ఏర్పాటు, మొబైల్ ఫోన్లకు సరైన సిగ్నల్స్ అందేలా సెల్ టవర్ నిర్మాణానికి స్థలాన్నిపరిశీలిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. డబుల్ బెడ్ రూం లతో లీకేజి సమస్య తీరేలా పైప్‌లైన్ల మరమ్మతు లు చేయించటం, ఇళ్లల్లో గోడలు బీటలు వారి నీరు కారటం విషయంలో పూర్తి స్థాయిలో పరిష్కరించటం, లిఫ్ట్ మరమ్మత్తులు. సెల్లార్లలో నీరు రావటంలాంటి సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానన్నారు. పిల్లలు ఆడుకొనేందుకు ఆటలకు సంబంధించి పరికరాలతో కూడిన పార్కు, ప్రహరీ గోడ ఏర్పాటు చేస్తానని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. 9వ అంతస్తు పైన నీరు కారకుండా షిప్పింగ్ పనులు వెంటనే చేయిస్తాన ని, ఈ ప్రాంతవాసులకు అందుబాటులో ఉండే లా బస్తీ దవఖానా, అంగన్‌వాడి సెంటర్ ఏర్పా టు చేసే విషయం పరిశీలిస్తానన్నారు. వీధి దీపా ల ఏర్పాటుతో పాటు ప్రధాన ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తానన్నారు. దీంతో పరిశుభ్రతలో భాగంగా మున్సిపాలిటి పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజు చెత్తను ఇళ్ల నుండి సేకరించే లా చూస్తానన్నారు. డ్రైనేజీ నీరు పైకి రాకుండా చూడాలన్న స్థానికుల వినితికి స్పందించిన కలెక్టర్ త్వరలోనే ఏర్పాటు చేస్తానన్నారు. అన్ని మతాలకు అనుగుణంగా ప్రార్థనా మందిరాలను నిర్మించి ఇస్తామన్నారు. నివాసితులంతా కాలనీ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకొని భవిష్యత్తు లో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు.

## మంటపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి



**ప్రజాపక్షం/నాగారం:** గణేష్ మంటపాలకు మున్సిపల్, పోలీస్ శాఖల ముందస్తు అనుమతి తప్పనిసరని నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ కమిషనర్లు ఎస్ భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని స్టార్ ఫంక్షన్ హాలులో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ మండపాలు, నిమజ్జన ఏర్పాట్ల సమన్వయ సమావేశం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఓ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించారు. విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నియంత్రణ పరికరాలు, జనరేటర్లు, సౌండ్ సిస్టమ్స్‌పై కచ్చితమైన నిబంధనలుంటాయన్నారు. నిమజ్జనంకోసం ట్రాఫిక్ శాఖ ప్రత్యేక రూట్ మ్యాప్, డ్రోన్ కెమెరాల నిఘా, పోలీస్ పికెట్లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని సూచన

### హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** సికింద్రాబాద్ నుండి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి స్థల సేకరణకు సంబంధించి స్థలాలు కోల్పోయిన వారికి ఆర్ అండ్ పాలసీ కింద నష్ట పరిహారం చెల్లించాలని హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యంత్రాగానికి సూచించారు. గురువారం మేడ్చల్, హైదరాబాద్, మెట్రోపాలిటన్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూసేకరణ అంశాలను చర్చించారు. ఆల్వాల్‌లోని సత్యా అపార్ట్‌మెంట్ వారికి కలిగే నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించాలని, శామీర్‌పేటలోని భూసేకరణలో భాగంగా సాయిబాబా ఆలయాన్ని మరో చోటికి మార్చవలసి వస్తున్నందును ఈ విషయాన్ని గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులకు నచ్చచెప్పి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్థలాలను గుర్తించి వివరా ల ను తెలియచేయాలన్నారు. భూసేకరణ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిప్యూటి కలెక్టర్ మాలతి, ఆల్వాల్, శామీర్‌పేట మండల తహసీల్దార్లు, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్‌లో జోరుగా అక్రమ మట్టి దందా

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్‌లో అక్రమ మట్టి దందా మూడు పూవులు ఆరు కాయలు అన్న చందంగా నడుస్తోంది. ప్రభుత్వ భూమిలో నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి టిప్పర్‌ల ద్వారా మట్టిని తరలిస్తు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల కళ్లుగప్పి దళారులు మట్టిని తరలిస్తున్నార ని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలించడంతో రోడ్లు పాడై పోతున్నాయని పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. అక్రమంగా యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా మట్టి మాఫియా దళారులను పట్టుకోవడంలో రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బుధవారం రాత్రి లక్ష్మాపూర్‌లోని చెరువు సమీపంలో అక్రమంగా మట్టిని తరలించారని విచారణ జరిపి టిప్పర్‌ల, జెసిబి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## అస్తవ్యస్తంగా కొడంగల్ సుందరీకరణ పనులు

### రూ.కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం



**ప్రజాపక్షం/కొడంగల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోంత నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలను వెచ్చించి సుందరీకరణ చేయాలనే దృడసంకల్పంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్య ధోరణి వైఫల్యం తో పనులలో తీవ్ర జాప్యం జరుగడమే కాకుండా నాణ్యత లోపాలతో పనులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. మన్నెగూడ నుంచి రావులపల్లి వరకు ఉన్నటువంటి అంతర్జాతీయ రహదారి పూర్తిగా గుంతలుపడి వర్షలు నీరు, మురుగునీరు చేరి అధ్వాన్న పరిస్థితులు దాపురించడం జరిగింది. కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాను వెడల్పుచేసి పట్టణ ప్రజలతో పాటు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుందరీకరణ చేసేందుకు గాను కొడంగల్ ముఖచిత్రం మార్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళిలను చేసి ఎచ్ఎండిఎ అధికారులకు పనులను అప్పగిస్తే ఆ అధికారులు అట్టి పనులను తుంగలో తొక్కి ఎలాంటి పనులు చేయకుండా డ్రైనేజీలో వేళ్లే మురుగునీటిని సైతం రోడ్ల పైకి వదలడంతో రోడ్డుపై వేళ్లే ప్రయాణికులు, పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. చౌరస్తాను వేడల్పుకోసం జిల్లా కలెక్టర్‌లు, రాష్ట్ర స్థాయి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు పలు శాఖల అధికారులు నిత్యం అధికారులతో రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేసి హడావుడి చేస్తు కాలం వెళ్లదీస్తున్నారే తప్ప గత రెండు సంవత్సరాలుగా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని పట్టణ ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. చౌరస్తాకు ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, డివైడర్ విద్యుత్ పనులను పూర్తి చేయాల్సి ఉంది. నిర్మాణ పనులను దక్కించుకున్న ఎచ్ఎండిఎ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ధోరణి కారణంగా పనులు ముందుకు సాగడం లేదు.అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించి పట్టణ కేంద్రంలో చేపట్టిన సుందరీకరణ ఇట్టి మాటగా మిగిలిపోతుంది. పట్టణంలోని కోస్గి రోడ్‌లోని భారత్ పెట్రోల్ బంక్ నుంచి తాండూర్ రోడ్‌లోని డంబర్ ఫ్యాక్టరీ వరకు దాదాపు 4 కిలో మీటర్లకు 45కోట్ల నిధులతో పనులకు శ్రీకారం చుట్టినప్పటికి నేటి వరకు పనులను ప్రారంభించలేకపోయారు. అదేవిధంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలో దాదాపు 100 కోట్లతో పలురకాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులను ప్రారంభించినప్పటికి అతి గతి లేకుండా పోయాయి. కొడంగల్‌లో వర్షం కురిస్తే రహదారులు చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నెలకొన్న సమస్యలను తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ముదిరాజులు రాజకీయంగా ఎదగాలి

**ప్రజాపక్షం/మర్పల్లి :** మర్పల్లి మండల పరిధిలో ఉన్న రాంపూర్ గ్రామంలో ముదిరాజ్ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం మండల అధ్యక్షులు పులుమద్ది వేంకటేశం ఆధ్వర్యంలో నూతన కమిటి చేయడం జరిగింది. మండల నూతన అధ్యక్షులుగా అలుగోలే రమేష్ ను ఉపధ్యక్షులుగా గోనెల అక్ష్మ య్య, గోనెల సంగన్న, బోయిన ప్రభు, గోనెల లక్ష్మ య్య, బంటు గోపాల్, దుర్గనోళ్ళ జర్నయ్య, తుమ్మలపల్లి నవీన్, జనరల్ సెక్రటరీగా చిరంజీవి, నగేష్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డపు నర్సిములు, దుర్గనోళ్ళ అంజయ్య, వేంకటేశం, కృష్ణ, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## పైలట్ ప్రాజెక్టుగా వికారాబాద్ ఎంపిక

**ప్రజాపక్షం / వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలో పరిపాలన సరిహద్దు డేటా బేస్‌లో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా వికారాబాద్ జిల్లా ను పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి,వికారాబాద్ జిల్లాలో గల అన్ని గ్రామ సరిహద్దులను సర్వే చేయుట కొరకు నిర్ణయించారు. ఇట్టి కార్యక్రమం జిల్లాలోని వికారాబాద్ మండలం 21.08.2025నుండి ప్రారంభించడం జరిగిందని వికారాబాద్ జిల్లా సర్వే,ల్యాడ్ రికార్డు అధికారి ఎ.రాంరెడ్డి తెలిపారు.

### వికారాబాద్ జిల్లాలో

# ఎంపిటిసి, జెడ్‌పిటిసి,ఎంపిపి స్థానాలు ఖరారు

* 2 019తో పోలీస్తే ఆరు పెరిగిన ఎంపిటిసి స్థానాలు
* 18నుంచి 20కి చేరిన జెడ్‌పిటిసిలు,ఎంపిపిలు, మొత్తం ఓటర్లు 6,99,894మంది
* పోలింగ్ స్టేషన్లు 1,288, పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహలు చేస్తోంది. వికారాబాద్ జిల్లాలో త్వరలో స్థానిక ఎన్నికల రాబోతున్నాయనే సంకేతాలు వెలుబడుతున్నాయి. తాజాగా ప్రభుత్వం మండలంవారీగా ఎంపిటిసి, జెడ్‌పిటిసి, స్థానికులను ఖరారు చేయడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఓటరు జాబితా పోలింగ్ స్టేషన్ల వివరాలను కూడా ప్రకటించింది. స్థానిక సంస్థల్లో ముందుగా గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం జిపి ఎన్నికలకు బదులుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తయిన నేపథ్యంలో పార్టీ గుర్తుతో నిర్వహించే ఎన్నికలకే వెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం, మండలాల వారీగా ఎంపిటిసి స్థానాలు, ఓటర్లు సంఖ్య, బంట్వారం 6, బషీరాబాద్ 12, బొంరాస్‌పేట్‌లో 2019లో 15 , 2025లో 11, చౌడపూర్ 9, ధారుర్ 12, దోమ 14, దౌల్తాబాద్ 15 నుండి 14కి తగ్గింది.దుద్యాల్ 8, కొడంగల్ 11, కోట్‌పల్లి 7, కుల్కచర్ల 16నుండి 12కి తగ్గించారు. మర్పల్లి 15 , మోమిన్‌పేట్ 12, నవాబ్‌పేట్ 12, పరిగి 13 నుండి 11కి తగ్గింది. పెద్దముల్ 13 , పూడుర్ 13, తాండూర్ 15, వికారాబాద్ 7, యాలాల్ 13 ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం వికారాబాద్ జిల్లాలో ఎన్నికోసం ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాలు ఉండాలనే దానిపై అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా దాన్ని ఆమోదించింది. కొత్తగా ఏర్పాటైన మండలాలు పక్క మండలాల నుంచి కలిసిన గ్రామాలు, మండలాల నుంచి మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలను పరిగణనలోకి తీసుకుని మండలాల వారీగా ఎంపిటిసిల సంఖ్యను నిర్ణయించారు. ఒక్కో ఎంపటిసి ఇలా ఉండలానే నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటైన మండలాల్లో సైతం ఎంతమంది ఎంపిటిసిల పరిధిలో సగటు 3,083మంది ఓటర్లు రాగా ఒక్కో జెడ్‌పిటిఇస పరిధిలో 34,997 మంది ఓటర్లు రానున్నారు.

**పెరిగిన స్థానాలు :**
2019లో జరిగిన మండల,జిల్లా పరిషత్ ఎన్నికలతో పోలీస్తే ప్రస్తుతం వీటి సంఖ్య పెరిగింది. అప్పట్లో 18 మండల పరిషత్‌ల పరిధిలోని 221 ఎంపిటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. కొత్తగా చౌడాపూర్ , దుద్యాల్ మండలాలు ఏర్పాటైన నేపథ్యంలో వీటి పరిధిలో ఆరు కొత్త ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో వీటిసంఖ్య 227కు చేరింది. అత్యల్పంగా బంట్వారం మండలంలోని 6 ఎంపిటిసి స్థానాలు ఉండగా,మర్పల్లి,తాండూర్ మండలాలో 15 చొప్పున ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో 3,44,969మంది పురుష ఓటర్లు ఉండగా ,3,54,912 మంది మహిళా ఓటర్లు 19మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. 20మండలాల పరిధిలో 1,288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కోబూత్ పరిధిలో 400నుంచి 750 మంది ఓటర్లు వరకు ఉన్నాయి.

**ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు :**
వికారాబాద్ జిల్లాలో మొత్తం 221 ఎంపీటీసీ ,జెడ్పీటీసి 18 స్థానాలు ఉన్నాయి. గత ఎడాది జులైలో ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ఒక్కోరోజు తేడాతో జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం పూర్తయ్యింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలన సాగుతోంది. గతంలో ప్రభుత్వం జేపీ ఎన్నికలకు సిద్ధం కావాలని అదేశించారు. ఓటరు జాబితా ,బీసీ కమిషన్ నివేదికతో సన్నద్ధంగా ఉండాలని సూచించింది. రాష్ట ఎన్నికల సంఘం సైతం వార్డుల వారీగా పోలింగ్ సేషన్ల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేసింది. అయితే ప్రభుత్వం దీన్ని పక్కన పెట్టి పరిషత్ ఎన్నికల దృష్టి సారించింది. అతి త్వరలో వరుస ఎన్నికల రావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భవిస్తున్నారు.

## షాబాద్ చెరువు అలుగుకు ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/షాబాద్ :** షాబాద్ చెరువు అలుగులు పోయడంతో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మధుసూధన్ రెడ్డి, షాబాద్ మండల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుత వర్షాలు విరివిగా కురుస్తున్నందున మండలంలో చెరువులు అలుగులు పోస్తుండంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని ఫైల్‌వాన్ చెరువు నిండి అలుగులు పారుడంతో మండల ప్రజలకు సంతోషం కల్గిందని వివరించారు. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైస్‌చైర్మెన్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, దండు రాహుల్, జనార్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పాఠశాలల మరమ్మతులకు చర్యలు తీసుకోండి : సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/కొందుర్గు :** పాఠశాలల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం కొందుర్గు మండల పరిధిలోని ఆగిరాల గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల పూర్తిగా దెబ్బ తిందని, స్లాబ్ పెచ్చులు ఊడి విద్యార్థులపై పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువులు నేర్పించేందుకు ఉపాధ్యాయులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు పేద ప్రజలకు చెందిన వారి పిల్లలు ఉంటారని, వారికి నాణ్యమైన విద్యను నేర్పించాలని సూచించారు. పేద విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించనున్నామని ఆయన హెచ్చరించారు.

## ఫార్మాసిటీ గ్రామాల్లో కొనసాగుతున్న అధికారుల సర్వే



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామంలోని ఫార్మా భూముల్లో సర్వే కొనసాగుతుంది. గత 20 రోజులుగా పోలీస్‌సిబ్బంది బందోబస్తుతో రెవెన్యూ టిఎస్‌ఐఐసి అధికారులు సంయుక్తంగా సర్వే కొనసాగిస్తున్నారు. ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతుల వారీగా సర్వే నిర్వహిస్తున్నారు. 500 ఎకరాలు, 1000 ఎకరాలుగా విభజించి బ్లాకులుగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ సర్వేద్వారా అర్హులు ఎవరు అనర్హులు ఎవరనే విషయం కూడా తెలుస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఫార్మాసిటీలో అక్రమంగా నష్టపరిహారం పొందిన వారు భయాందోళనకు గురి అవుతున్నారు. ఎక్కడా రైతులు సర్వే అడ్డుకోకుండా ఇబ్రహింపట్నం ఎసిపి కెపివి రాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కాలనీల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** భారీ వర్షాలకు కారణంగా వనస్థలిపురం డివిజన్లోని ఎఫ్‌సిఐ కాలనీ ప్రధాన రోడ్డులో వర్షాపు నీరు నిల్వ ఉండడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కారం చేస్తామని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం కాలనీ సంక్షేమ వాసులు ఎమ్మెల్యేకు కలిసి సమస్యను వివరించారు. అనంతరం ఎమ్మెల్యేమాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తామని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చింత రవికుమార్ గుప్తా, కాలనీ అధ్యక్షులు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాజు యాదవ్, సత్యనారాయణ, కృష్ణ రావు, రాజేశ్వర్ రావు, వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

## పేదవర్గాల సంక్షేమానికి కృషి

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదవర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎల్‌బి నగర్ చెందిన ఎల్. బుచ్చమ్మ , కర్మన్‌ఘాట్‌కు చెందిన శీతల్ గజిబంకర్, ఎల్‌బి నగర్‌కు చెందిన అయితగోని లోకేష్‌లకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్‌తో అనారోగ్యానికి గురైన నిరుపేదలు ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, కొత్తపేట డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ యాదవ్, మహిళా నాయకురాలు స్వర్ణ మాధవి, గోపాల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మెదడులో స్టంట్ వేసి వైద్యరంగంలో ఓనస్ ఆసుపత్రి వైద్యుల మరో ఘనత



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** మెదడులో రక్తస్రావంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఆధునికి సాంకేతిక వైద్యవిధానాలతో అరుదైన వైద్యం అందించినట్లు ఓనస్ రోబోటిక్ హస్పిటల్ ఎండి డాక్టర్ ఎం.బాలరాజ్‌నాయుడు తెలిపారు. గురువారం చంపాపేటలోని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీవ్ర తలనొప్పితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్వేన్ గ్రామానికి చెందిన బి.నారయ్య అడ్వాన్స్ న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ సూర్యతేజరెడ్డి, ఇంటర్‌వేన్షనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ మనోజ్ వాసిరెడ్డి, ఓనస్ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్, మెడికల్ డైరెక్టర్ పి.రవికిరణ్ నేతృత్వంలోని న్యూరో ఇంటర్‌వేన్షనల్ బృందం అత్యాధునిక ఎండోవాస్కులర్ వైద్యాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ మెదడులో రక్తం చిట్లిపోవడంతో రక్తస్రావంకు దారి తీసిందన్నారు. ఓపెన్ బ్రెయిన్ సర్జరీకి బదులుగా, తొడలోని ఫెమోరిల్ ఆర్జరీ ద్వారా యాక్సెస్, ఫ్లో డైవర్టర్ స్టెంట్ ఒక ఫైన్ మెష్ ట్యూబ్ అనూరిజం అమర్చినట్లు తెలిపారు. ఈ పరికరంతో ఉబ్బరం నుండి రక్త ప్రవామాన్ని మళ్ళించి మెదడుకు సాధారణ రక్త సరఫరాను కొనసాగిస్తూ ధమని గోడ సమాజంగా నయం కావడానికి వీలు కల్పించిందన్నారు. ఈ ప్రక్రియ చాలా విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి బృందం పాల్గొన్నారు.

## శంషాబాద్ వాసికి గౌరవప్రదమైన అవకాశం



**ప్రజాపక్షం/శంషాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి ఎడ్యుకేషనల్ అకాడమీకి బోర్డు సభ్యుడిగా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కాపుగడ్డకు చెందిన కుచిరెడ్డి శంకర్ రెడ్డి ఎన్నికయ్యారు. బోర్డులో ఐదు మంది సభ్యులను ఎంపిక చేస్తూ అకాడమీ తుది జాబితా విడుదల చేసింది. ఇందులో శంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఎన్నిక పత్రాన్ని అకాడమీ సభ్యులు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. శంకర్‌రెడ్డి ఎంపికపై సబితా ఇంద్రారెడ్డి అభినందించారు.

# సమర్థవంతంగా ట్రాఫిక్ నియంత్రణ






ట్రాఫిక్ చర్యలపై దృష్టి సారించిన సివి ఆనంద్

రంగంలోకి ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లు, మార్షల్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత పటిష్టం చేయడానికి పోలీసు కమిషనర్ సివి ఆనంద్ గురువారం 50 ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లతో పాటు వంద మంది ట్రాఫిక్ మార్షల్‌లను రంగంలోకి దింపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్ సింగ్‌మాన్,ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ డి.జోయెల్ డేవిస్‌తో పాటు హెచ్‌సిఎస్‌సి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ..హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నిర్వహణను బలోపేతం చేయడానికి హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ కీలక చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా 50 కొత్త ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లు, 100 మంది ట్రాఫిక్ మార్షల్‌లను ప్రారంభించామని తెలిపారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, వాహనాలు సులభంగా, వేగంగా వెళ్లేలా చేయడానికి ఈ 50 పెట్రోలింగ్ బైక్‌లు, 100 మంది మార్షల్‌లు సహాయపడతారన్నారు. ప్రతి పెట్రోలింగ్ బైక్‌కు (బజాజ్ అవెంజర్ 220 క్రూయిజ్) ట్రాఫిక్ నిర్వహణకు సహాయపడే అధునాతన ఉపకరణాలు అమర్చబడ్డాయి. వీటిలో ప్రజల ప్రకటనల కోసం కాలర్ మైక్రోఫోన్‌తో కూడిన పి.ఎ. సిస్టమ్, బాహ్య మైక్రోఫోన్‌తో యుహెచ్‌ఎఫ్ హ్యాండ్‌హెల్డ్ సెట్, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఎల్‌ఈడి బ్యాటన్, ఉల్లంఘనలను రికార్డ్ చేయడానికి మరియు చలాన్‌లను జారీ చేయడానికి డ్యాష్‌బోర్డ్ కెమెరా, రియల్ టైమ్ పర్యవేక్షణ మరియు అమరిక కోసం జీపీఎస్ ట్రాకింగ్, అత్యవసర పరిస్థితుల కోసం ప్రథమ చికిత్స కిట్, నోపార్కింగ్ అమలు కోసం వీల్ క్లాంప్ క్యారియర్, ట్రాఫిక్ పరికరాల పెట్టె (రిఫ్లెక్టివ్ జాకెట్, రెయిన్ గేర్ మొదలైనవి), టాబ్లెట్ పరికరం మరియు సాక్ష్యం సేకరణ కోసం బాడీవేర్న్ కెమెరా ఉన్నాయి. ఈ పరికరాలు ట్రాఫిక్ నియంత్రణకు మరింత సమర్థవంతంగా ఉపయోగపడతాయి. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్లను నియమించామని తెలిపారు. ఇది వారికి ఉపాధి కల్పనలో ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం. భవిష్యత్తులో జీహెచ్‌ఎంసీతో సహా ఇతర శాఖల్లో కూడా వారికి అవకాశాలు కల్పించనున్నారు. ట్రాఫిక్ మార్షల్‌లు సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐ ఎ స్‌ఐలు పర్యవేక్షణలో పనిచేస్తారు. వారు తమ విధులు బాధ్యతగా, నిజాయితీగా నిర్వహించి, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కమిషనర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న 100 మంది మార్షల్‌ల సంఖ్యను భవిష్యత్తులో 500 మందికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము అని కమిషనల్ తెలిపారు. ఈ కొత్త చర్యల ద్వారా నగరంలో వాహనాల సగటు వేగం గంటకు 18 కి.మీల నుంచి 23 కి.మీల వరకు పెరుగుతుందని అంచనా. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం మూడు క్రేన్‌లను కూడా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమాలు హైదరాబాద్ ట్రాఫిక్‌ను మెరుగుపరచడంలో, నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కమిషనర్ తెలిపారు. దీంతో పాటు, 100 మంది శిక్షణ పొందిన ట్రాఫిక్ మార్షల్‌లు కీలక కూడళ్లు, రద్దీ ప్రదేశాలలో ట్రాఫిక్ పోలీసులకు మద్దతు ఇవ్వడానికి నియమించబడ్డారన్నారు. వీరికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 15 రోజులు కఠినంగా శిక్షణ ఇచ్చారు. వీరు ట్రాఫిక్ శాఖతో కలిసి పనిచేసి ట్రాఫిక్ ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడానికి కృషి చేస్తారు.

## పిల్లల హక్కులకు భంగం కలిగితే ఊరుకోం

సంకల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రోజీ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** 18 ఏళ్ల లోపు పిల్లల హక్కులకు భంగం కలిగితే సహించబోమని, వారికి న్యాయం జరిగేలా పోరాడుతామని సంకల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రోజీ తెలిపారు. ఇందుకోసం అన్ని జిల్లాల్లో బాల రక్షక్ ఫోరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి రోజీ మాట్లాడారు. పిల్లలు పాఠశాలల్లో , హాస్టళ్లలో, తల్లిదండ్రుల వద్ద ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా తమను సంప్రదించవచ్చని తెలిపారు. కొంతమంది దుర్మార్గుల కారణంగా చిన్నారులు హత్యాచారానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కూకట్‌పల్లిలో చిన్నారిని హత్య చేసిన వారిని రాష్ట్ర ప్రభుత్వం పట్టుకొని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం చిన్నారి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి భాస్కర్, ప్రతినిధులు శ్యామల, లక్ష్మి , భాగ్య, వెంకటరమణచారి , దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజులు పనులు పూర్తి చేసిన ఉపాధి కూలీలకు నేడు సన్మానం

**ప్రజాపక్షం/షాబాద్ :** ఎంజిఎన్‌ఆర్‌ఎస్‌ఇజిఎస్ పథకం ద్వారా 100 రోజులు పనులు పూర్తి చేసిన ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం తరపున సన్మానం చేస్తున్నాట్లు మండల అభివృద్ధి అధికారిణి అపర్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పచాయతీలో గ్రామ ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సన్మానం చేసి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. మండల పరిధిలోని ఆస్పలిగూడ, ఎల్గొండగూడ గ్రామాల్లో సిసి రోడ్డు పనులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకుస్థాపన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అవినీతిపై నిరంతరం పోరాడుతాం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** జిహెచ్‌ఎంసి, ఇతరశాఖల్లో జరిగే అవినీతిపై నిరంతరం పోరాడుతామని దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ముప్పిడి నవీన్ కుమార్ తెలిపారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్లలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న చైన్‌మన్‌లు అక్రమ నిర్మాణాల విషయంలో అవినీతికి పాల్పడుతూ రూ.కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. ఈ సర్కిళ్లలో పనిచేసే వారిలో ఆరుగురిని పాతబస్తీకి, మరో ఇద్దరిని కూకట్‌పల్లికి బదిలీ చేయడం హర్షణీయమన్నారు. కొత్త సిబ్బంది నిజాయితీ గా పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశంలో చిలుకూరి సుశీల్‌రాజు, టి.శివకుమార్, మధుసూదన్‌రావు, బి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీలో

## 32 అంశాలు, 7 ఐటమ్‌లకు కమిటీ ఆమోదం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టోలిచౌకి ఫ్లైఓవర్ కింద నిర్మించిన 18 కొత్త వెండింగ్ షాపులను మూడు సంవత్సరాల పాటు 'టెండర్ కమ్ ఓపెన్' బహిరంగ వేలం ద్వారా ఇవ్వాలని జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటి తీర్మానించింది. జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ ఈ సమావేశంలో జిహెచ్‌ఎంపి కమిషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత,సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, బాత జబీన్, మహాలక్ష్మి రమన్ గౌడ సి.ఎన్.రెడ్డి, మహమ్మద్ బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ బూరుగడ్డ పుష్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సమావేశంలో 32 అంశాలు, 7 ఐటమ్ లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఇందులో 25 సంవత్సరాల కంటే ఎక్కువ గడువు ముగిసిన ఖాళీ షాపులకు బహిరంగ వేలం నిర్వహించడానికి మరియు గడువు ముగిసిన షాప్ లీజులను పెంచాలని, అలాగే అద్దెలను కూడా పెంచాలని నిర్ణయించారు. అలాగే రామంతపూర్ లో కృష్ణ జన్మాష్టమి శోభయాత్రలో కరెంట్ షాక్ తో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశారు.

# ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వొద్దు

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రానున్న ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వొద్దని, ధాన్యాన్ని సేకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ ఛాంబలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో 33వేల హెక్టార్ల ధాన్యం సేకరణ అంచనా వేసినందున, ఎక్కడ కూడా సమస్య తలెత్తకుండా ముందస్తుగా గుర్తించి పరిష్కరించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు 33 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరును మరొకసారి పరిశీలించాలని, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన పరికరాలను, గన్నీ బ్యాగులను, టార్పిలిన్స్ అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆయన సూచించారు. సమావేశం పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, జిల్లా మేనేజర్ గోపి కృష్ణ, డిఆర్‌డిఒ ఆర్డీఓ శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి ఉష, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుధాకర్, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎంఇఒ

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకుందని శంకర్‌పల్లి మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మహాలింగాపురం, గాజులగూడ, మాసానిగుడ, జనవాడ జనవాడ ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. తరగతిగదులు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, ప్లే గ్రౌండ్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు.



## పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కేశంపేట మండలం నిర్థవెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిపి నరేందర్, బాల్‌రాజ్ గౌడ్, యాదయ్య, రాంరెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, రాంచందర్, భూపాల్‌రెడ్డి, నాగిళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కుర్మిద్ద, మంగలిగడ్డతండా, మర్లకుంట తండా, తాడిపర్తి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తున్నానన్నారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. కుర్మిద్ద గ్రామంలోని సర్వేనంబర్ 92లో అనర్హులు నష్టపరిహారం తీసుకున్నారన్నారు. అసలైన రైతులకు అన్యాయం జరిగిందని రైతులు ఎంఎల్‌ఎ దృష్టికి తేగా ఆర్డిఒకు ఫోన్ చేసి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇ శ్రీనివాస్, ఎంపిడిఒ రాధరాణి, ఎంపిఒ శ్రీలత, మండల డిప్యూటీ తహసీల్దారు కిర్తిసాగర్, విద్యుత్ ఎడి సీతారాం, మార్కేటు కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపిపిలు శ్రీనివాస్‌రెడ్డి, దెంది రాంరెడ్డి, కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మా, బందె రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌నాయక్, దూస రమేశ్, డైరెక్టర్ మండలి జంగయ్య, మూడేడ్ల వెంకట్‌రెడ్డి, జోసఫ్, మోటే శ్రీశైలం, వరికుప్పల సుధాకర్, సంపత్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా నుండి ప్రాతినిథ్యం వహించిన దివ్య, శిరీష, ధనావత్ యశ్వంత్ పతకాలు సాధించారు. పథకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కోచ్ వినోద్ కుమార్‌ను ప్రత్యేకంగా అభి నందించారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ దేవరం నాయక్, పల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వినియోగ సేవలతోనే గుర్తింపు



**హయత్‌నగర్:** వినియోగదారులకు మెరుగైన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం నియోజకవర్గంలో వారాహి ఎంటర్ ప్రైజెస్ లిటిల్ స్టూడియోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఫోటో షూట్ కోసం వచ్చే వినియోగదారులకు నామమాత్రపు రుసుముతో సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, పలు విభాగాల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, మహిళలు,పార్టీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# క్రీడ

## పాక్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు రద్దు

కేంద్ర ప్రభుత్వ కొత్త స్పోర్ట్స్ పాలసీ స్పష్టీకరణ




**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు పూర్తిగా రద్దయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన క్రీడా విధానం (స్పోర్ట్స్ పాలసీ)ని అనుసరించి పాకిస్తాన్‌తో క్రికెట్‌సహా ఏ ఇతర క్రీడాల్లోనూ ద్వైపాక్షిక మ్యా చ్‌లు లేదా సిరీస్‌లలో భారత్ పాల్గొనదు. గతంలో మాదిరి తటస్థ వేదికలపై మ్యాచ్‌లు లేదా సిరీస్‌లను కూడా ఆడేది లేదని తాజా స్పోర్ట్స్ పాలసీలో కేంద్రం పేర్కొంది. అయితే, బహుళ జట్లు పోటీపడే ఈవెంట్స్‌లో మాత్రం, పాకిస్తాన్‌తో ఒకవేళ మ్యాచ్‌లు ఆడాల్సి వస్తే అందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ప్రతినిధిని ఉటంకిస్తూ పిటిఐ తెలిపిన వివరాల ప్రకారం, పహల్గావ్ ఉగ్ర దాడి తర్వాత, పాకిస్తాన్‌కు వెళ్లడం లేదా ఆ దేశంలో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు కొనసాగించడం క్షేమదాయకం కాదని భారత్ భావిస్తున్నది. ఒకవేళ బహుళ జట్లు లేదా దేశాలు పాల్గొనే క్రీడా పోటీలు పాక్‌లో జరిగితే, భారత జట్టు లేదా బృందం పాల్గొంటుందా అన్న ప్రశ్నకు నేరుగా సమాధానం రాలేదు. అప్పటి పరిస్థితులను అనుసరించి, తగిన నిర్ణయం తీసుకుంటారు. పహల్గావ్ దాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితులు ఇప్పుడు లేవు కాబట్టి, ద్వైపాక్షిక క్రీడా సంబంధాలను పునఃపరిశీలించే అవకాశం ఉంటుందా అన్న ప్రశ్నకు కూడా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి స్పష్టమైన స్పందన లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, అలాంటి అవకాశం ఉండకపోవచ్చని పేర్కొంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో వచ్చే నెల జరిగే ఆసియా కప్‌లో ఎనిమిది జట్లు పాల్గొననున్నాయి. వీటిలో భారత్, పాకిస్తాన్ కూడా ఉన్నాయి. అది ద్వైపాక్షిక సిరీస్ కాదు కాబట్టి, ఆ టోర్నీలో పాక్‌తో భారత జట్టు మ్యాచ్‌లు ఆడేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. ఇలావుంటే, పాక్‌తో క్రీడా సంబంధాలపై తీసుకున్న నిర్ణయాలే మిగతా అన్ని రంగాలు లేదా విభాగాలకు కూడా వర్తించే అవకాశాలు ఉన్నాయి. 2030లో కామన్వెల్త్ గేమ్స్, 2036లో ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు పోటీపడుతున్న భారత్, అంతర్జాతీయ క్రీడా నిబంధనలను తప్పక అనుసరించాల్సి ఉంటుంది. ఒక దేశం లేదా ఒక ప్రాంతంతో ఘర్షణ పూర్వక వైఖరిని అనుసరిస్తే, ఇలాంటి మేజర్ ఈవెంట్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశాలు దెబ్బతింటాయి. అయినప్పటికీ, పాక్‌తో రాజీ ధోరణిని అనుసరించే అవకాశమే లేదని భారత్ స్పష్టం చేస్తున్నది.

## స్పోర్ట్స్ ఫోకస్

కేవలం పురుషులకు మాత్రమే పరిమితం అనుకునే రగ్బీ క్రీడలో ఇప్పుడు మహిళలు కూడా రాణిస్తున్నారు. మహిళల విభాగంలోనూ అంతర్జాతీయ టోర్నీలు జరుగుతున్నాయి. మహిళల ప్రపంచ కప్ చాంపియన్‌షిప్‌ను ప్రతి నాలుగేళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ ఏడాది 10వ వరల్డ్ కప్ జరుగుతుంది. శుక్రవారం (ఆగస్టు 22) నుంచి బుధవారం (ఆగస్టు 27) వరకు లండన్ వేదికగా ఈ మెగా టోర్నీ జరుగుతుంది. 16 దేశాల జట్లు పాల్గొనే ఈ పోటీల కోసం ఎనిమిది మైదానాలను సిద్ధంగా ఉంచారు. కాగా, 2021లో జరిగిన మహిళల రగ్బీ ప్రపంచ కప్‌ను న్యూజిలాండ్ కైవసం చేసుకుంది. అత్యంత ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్‌లో ఈ జట్టు 34–31 తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఎమిలీ స్కారట్ అత్యధికంగా 44 పాయింట్లు సాధించింది. మొత్తం 26 మ్యాచ్‌ల్లో, సగటున 46.23 చొప్పున మొత్తం 1,202 గోల్స్ నమోదయ్యాయి. మ్యాచ్‌లను 1,40,000 మంది (సగటున మ్యాచ్‌కి 5,385 చొప్పున) ప్రత్యక్షంగా వీక్షించారు.

### మహిళల విభాగంలో..



### విజేత జట్లు




మహిళల రగ్బీ ప్రపంచ కప్ చాంపియన్‌షిప్ ఇంత వరకూ 9 పర్యాయాలు జరగ్గా, న్యూజిలాండ్ ఆరుసార్లు (1998, 2002, 2006, 2010, 2017, 2021) విజేతగా నిలిచి, ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. ఇంగ్లాండ్ రెండు ట్రోఫీలు (1994, 2014) కైవసం చేసుకోగా, అమెరికా 1991లో, ఒకసారి చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్ విషయానికి వస్తే, ఇంగ్లాండ్ ఇప్పుడు నంబర్ వన్ స్థానంలో నిలుస్తున్నది. కెనడా రెండో స్థానంలో ఉండగా, నిరుటి విజేత న్యూజిలాండ్‌ది మూడో స్థానం. ఫ్రాన్స్, ఐర్లాండ్ వరుసగా 4, 5 స్థానాల్లో ఉన్నాయి.

## అపార శక్తి సామర్థ్యాలకు ప్రతీక రగ్బీ

నితిన్ హీరోగా 2004లో వచ్చిన 'సై' సినిమా ద్వారా అప్పటి వరకూ అంతగా ప్రాచుర్యంలో లేని రగ్బీ క్రీడ తెలుగు వారికి పరిచయమైంది. అపారమైన శక్తిసామర్థ్యాలకు ప్రతీకగా రగ్బీని పేర్కొంటారు. ఫుట్‌బాల్‌లో బంతిని కాలితో కొడుతూ, చేయాల్సి ఉంటే, రగ్బీలో బంతిని చేతిలో పట్టుకొని, ప్రత్యర్థి గోల్ పోస్టువైపు పరుగులు తీసి, గోల్ సాధించాలి. ఆ బంతిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని ప్రత్యర్థి ఆటగాళ్లు, బంతిని ఎలాగైనా కాపాడుకోవాలని సొంత జట్టు ఆటగాళ్లు ఒక్కసారిగా మీదపడినప్పటికీ, చాకచక్యంగా ముందుకు వెళ్లి, గోల్ చేయడానికి శారీరక దృఢత్వం మాత్రమే కాదు.. అంతులేని ఆత్మస్థైర్యం కూడా ఉండాలి. నిజానికి రగ్బీ అనే పదం వినగానే గుర్తుకు వచ్చేది విపరీతమైన ఉత్సాహం, శారీరక బలం, వ్యూహాత్మక మేధస్సు, జట్టు ఆత్మబలం, గెలుపు కోసం చేసే పరాక్రమ పోరాటం. ఇది శారీరక స్థైర్యం, మానసిక ధైర్యం, వ్యూహాత్మక ఆలోచన, బలమైన జట్టు సమన్వయం కలగలిసిన ఒక సాహసక్రీడ. నేటి ప్రపంచ క్రీడా చరిత్రలో ఫుట్‌బాల్, క్రికెట్‌లతో సమానంగా స్థానం సంపాదించుకున్న రగ్బీ, ఒకప్పుడు బ్రిటన్‌లోని చిన్న పట్టణంలోని పాఠశాలలో పుట్టి, శతాబ్దాల తరువాత అంతర్జాతీయ వేదికపై మిలియన్ల మంది అభిమానులను ఆకర్షించింది.రగ్బీ క్రీడ 19వ శతాబ్దం ప్రారంభంలో ఇంగ్లాండ్‌లోని వార్విక్‌షైర్ ప్రదేశంలో ఉన్న రగ్బీ స్కూల్లో పుట్టింది. 1823లో, ఒక ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుండగా, విలియం వెబ్ ఎలిస్ అనే విద్యార్థి హఠాత్తుగా బంతిని చేతిలో ఎత్తుకుని, ప్రత్యర్థి గోల్ వైపు పరిగెత్తాడు. అప్పటివరకు ఫుట్‌బాల్‌లో బంతిని చేతితో పట్టుకోవడం నిబంధనలకు విరుద్ధం. కానీ ఆ సాహసం రగ్బీ పుట్టుకకు బీజం వేసింది. కొత్త ఆటకు కసరత్తులు జరిగిన తర్వాత 1845లో రగ్బీ స్కూల్ మొదటిసారి ఈ ఆటకు ప్రత్యేక నిబంధనలను రూపొందించింది. ఇంగ్లాండ్‌లో రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ (ఆర్ఎఫ్‌యు) స్థాపన 1871లో జరిగింది.ఆటకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 1871లో స్కాట్‌లాండ్ – ఇంగ్లాండ్ జట్ల మధ్య మొదటి అంతర్జాతీయ రగ్బీ మ్యాచ్ జరిగింది. రగ్బీ కేవలం పరుగులు, బల ప్రదర్శనలు, ట్యాక్లింగ్స్ మాత్రమే కాదు. ఇది వ్యూహం, వేగం, సమన్వయం, సైనిక స్థాయి వ్యూహరచన కలగలిసిన ఆట. రగ్బీ క్రీడలో రెండు ప్రధాన విభాగాలు, రగ్బీ యూనియన్, రగ్బీ లీగ్ ఉన్నాయి. రగ్బీ యూనియన్ మ్యాచ్‌లలో, ఒక్కో జట్టుకు 15 మంది ఆటగాళ్లు ఉంటారు. రగ్బీ లీగ్‌లో 13 మంది ఆటగాళ్లతోనే జట్టు ఏర్పడుతుంది. ప్రత్యర్థి జట్టు గోల్ లైన్ దాటి బంతిని నేలపై ఉంచి ట్రై (సామాన్య భాషలో గోల్) సాధించడం. ట్రైకి 5 పాయింట్లు, కన్వర్షన్ కిక్‌కి 2 పాయింట్లు, పెనాల్టీ గోల్‌కు 3 పాయింట్లు, డ్రాప్ గోల్‌కు 3 పాయింట్లు లభిస్తాయి. అత్యధిక గోల్స్ చేసిన జట్టు విజేతగా నిలుస్తుంది. రగ్బీ ఆటను చూస్తే కనిపించే హింసాత్మకత వెనుక అసాధారణమైన క్రమశిక్షణ, నియంత్రణ దాగి ఉంటుంది. ఆటగాళ్లు పరస్పరం ఢీకొనడం, టాకిల్ చేయడం జరుగుతుంది గానీ, వాటన్నింటినీ నిబంధనల పరిధిలోనే నిర్వహించాలి.



రగ్బీ ఆడిన మొట్టమొదటి మహిళా క్రీడాకారిణి ఎమిలీ వాలెంటైన్. అప్పుడు ఆమె వయసు 10 సంవత్సరాలు. ఆమె సోదరుల జట్టులో ఒక ఆటగాడు లేకపోవడంతో, సహాయం చేయడానికి ముందుకు వచ్చిన ఆమె, వింగ్‌లో ఆడింది. మ్యాచ్‌లో ఒక ట్రై స్కోర్ చేయగలిగింది.

పురుషుల విభాగంలో చాలా మంది రగ్బీ క్రీడాకారులు ప్రొఫెషనల్స్, కానీ, మహిళల విభాగంలో ఆ పరిస్థితి లేదు. చాలా మంది మహిళల రగ్బీ ప్రాక్టీస్ చేస్తూ, మ్యాచ్‌ల్లో పాల్గొంటూనే, ఫుల్

### మీకు తెలుసా?

టైమ్ ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. ఇంగ్లాండ్‌లోని అనేక క్లబ్‌లకు కాంట్రాక్టులు నెమ్మదిగా పరిచయం చేయబడుతున్నాయి, కానీ ఇప్పటికీ ప్రొఫెషనల్స్‌గా మారే స్థాయి జీతం అందించడం లేదు.
మొదటి మహిళల ప్రపంచ కప్ 1991లో వేల్స్‌లోని కార్డిఫ్‌లో జరిగింది. రిచ్‌మండ రగ్బీ క్లబ్ నుండి నలుగురు క్రీడాకారులు దీనిని సృష్టించి నిర్వహించారు. అయితే, అంతకు ముందు 'మినీ వరల్డ్ కప్' అనే పేరుతో అంతర్జాతీయ పోటీ 1990లో న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్‌లో జరిగింది.
మహిళల సిక్స్ నేషన్స్ ఫైనల్ (2024)ను బిబిసి2లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరితమైన ఆటను 600,000 మంది వీక్షించారు.
చాలా మంది మహిళా రగ్బీ క్రీడాకారిణులు అనేక రకాలుగా విమర్శలకు, హేళనకు గురవుతున్నారు. అయినప్పటికీ, ఆటపైనే దృష్టి కేంద్రీకరిస్తూ, తమదైన దారిలో ముందుకు వెళుతున్నారు. రగ్బీ ఆడే మహిళలను కొంత మంది 'ట్రాన్స్ జెండర్స్'గా పిలుస్తుంటారు. లైంగిక వేధింపుల సంఘటనలు కూడా ఉన్నాయి. అయినప్పకీ, మహిళలు ఈ క్రీడలో నైపుణ్యం సంపాదించి, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి నిర్విరామంగా కృషి చేయడం ప్రశంసనీయం.
న్యూజిలాండ్ 1891లో విదేశీ మహిళల రగ్బీ జట్లతో మ్యాచ్‌ల సిరీస్‌ను నిర్వహించడానికి ప్రయత్నించింది. అయితే, అప్పట్లో మహిళల రగ్బీ ఆడడాన్ని సహించలేకపోయిన కొంత మంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల నుండి వచ్చిన వ్యతిరేకత కారణంగా సిరీస్‌లను రద్దు చేయవలసి వచ్చింది.
ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో మొదటి మహిళా రగ్బీ జట్టు, 1962లో ఏర్పాటైంది.
ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడలలో మహిళల రగ్బీ ఒకటి.
పూర్తిగా డాక్యుమెంట్ చేసి, రికార్డయిన మొట్టమొదటి మహిళా క్లబ్ మ్యాచ్ 1968 మే 1న ఫ్రాన్స్‌లో జరిగింది.

# రీల్

## 'ఘాటి' దస్సోరా పాట విడుదల



క్వీన్ అనుష్క శెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి . విక్రమ్ ప్రభు మేల్ లీడ్ గా నటించిన ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యువీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ప రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పుడు సినిమా సెకండ్ సింగిల్ దస్సోరాను పాటను రిలీజ్ చేశారు. సాగర్ నాగవెల్లి కంపోజ్ చేసిన ఈ సాంగ్ స్టార్ట్ అవగానే ఎనర్జీ, కల్చర్, వైబ్రెన్స్తో ఫుల్గా మూడ్ బూస్ట్ చేస్తుంది. ఘాటీల జీవన శైలిని, వారి కల్చర్ని ట్యూన్ అద్భుతంగా క్యాచ్ చేసింది. ఈఎస్ మూర్తి రాసిన సాహిత్యం ఘాటీల లైఫ్, వాళ్ల స్ట్రగుల్స్, పట్టుదలని రిఫ్లెక్ట్ చేశాయి. గీతా మాధురి, సాకేత్, శృతి రంజనీ పాడిన పవర్ఫుల్ పాటకి మరింత ఫీల్ ని యాడ్ చేశాయి విజువల్స్లో అనుష్క శెట్టి, విక్రం ప్రభు, ఇంకో ఘాటీల టీమ్ గంజా సీక్రెట్గా ట్రాన్స్పోర్ట్ చేస్తూ, పోలీసుల్ని తప్పించుకుంటున్న సీన్స్ చూపించారు. ఇది సినిమా నేరేటివ్ ఎంత హైస్టేక్స్తో ఉంటుందో ప్రజెంట్ చేసింది. బిగ్ స్క్రీన్ మీద ఈ సాంగ్ ఇంకా బలంగా ఇంపాక్ట్ చేయబోతుంది.మనోజ్ రెడ్డి కటాసాని సినిమాటోగ్రఫీ, సీనియర్ ఆర్ట్ డైరెక్టర్ తోటత రణి అద్భుతమైన సెట్లు డిజైన్ చేశారు. సాయి మాధవ్ బుర్ర డైలాగ్స్ రాశారు. చాణక్య రెడ్డి తూర్పు, వెంకట్ ఎన్. స్వామి ఎడిటింగ్ చేశారు. యాక్షన్ సీక్వెన్సు రామ్ కృష్ణన్ మాస్టర్ కంపోజ్ చేశారు.సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కోసం సిద్ధమవుతోన్న ఘాటి, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో పాన్ ఇండియా రిలీజ్ కానుంది. అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు, చైతన్య రావు, రవీంద్రన్ విజయ్, జగపతి బాబు తదితరులు నటిస్తున్నారు.

## వచ్చే ఏడాదికి విశ్వంభర : హీరో చిరంజీవి




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమా గురించి స్వయంగా చిరంజీవి ఒక వీడియో రిలీజ్ చేశారు. ఎన్నో రోజులుగా ఈ సినిమా విడుదలకు నోచుకోవడం లేదు అనే ప్రచారానికి చిరంజీకి ఓ సమాధానంగా ఈ వీడియో చేశారని చెప్పవచ్చు. చిరంజీవి వీడియోలో ఈ విధంగా మాట్లాడారు. ఇలా మీ ముందుకు రావడానికి కారణం విశ్వంభర సినిమా. చాలా మందికి డౌట్ ఉంది. ఈ సినిమా ఎందుకు ఢిల్లీ అవుతోంది. ఈ ఆలస్యం, జాప్యం సముచితం అని నేను భావిస్తున్నాను. ఈ చిత్రం సెకండ్ ఆఫ్ మొత్తం వి ఎస్ ఎక్స్, గ్రాఫిక్స్ మీదా ఆధారపడి ఉంది. మీకు అత్యున్నతమైన ప్రమాణాలతో , బెస్ట్ క్వాలిటీతో అందించాలనే దర్శక నిర్మతల ప్రయత్నమే ఈ జాప్యానికి ప్రధానమైన కారణం. ఎలాంటి విమర్శకాలకు తావివ్వకుండా శ్రద్ధా శక్తులతో తీసుకున్న సముచిత సమయమిది. ఈ చిత్రం గురించి చెప్పాలంటే .. చందమామలా సాగిపోయే అద్భుతమైన కథ. చిన్న పిల్లలకు, పెద్ద వాళ్లను సైతం ఈ సినిమా అలరిస్తుంది... వినోదాన్నిస్తుంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న, మీకు నేను ఒక సమాధానంగా మూవీ క్రియేషన్స్ వాళ్ళు నా బర్త్ డే ను పురస్కరించుకుని 21వ తేదీ సాయంత్రం 6గంటల 6 నిమిషాలకు విశ్వంభర సినిమా నుంచి ఒక చిన్న గ్లిమ్స్ విడుదల చేయనున్నారు. అందరు ఎంజాయ్ చేసే సీజన్ సమ్మర్. కాబట్టి విశ్వంభర సినిమాను వచ్చే సమ్మర్ అంటే 2026 లో విడుదల చేస్తామని చిరంజీవి భరోసా ఇచ్చారు. ఇందులో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఎం ఎం కీరవాణి, భీమ్స్ సిసిరోలియో ఇద్దరు ఈ సినిమాకు సంగీత దర్శకులుగా పని చేస్తున్నారు.



## 'అర్జున్ చక్రవర్తి' ట్రైలర్ లాంచ్

విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్టట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రీలీజైన టీజర్, సాంగ్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తి కేవలం సినిమా మాత్రమే కాదు నా తొమ్మిది సంవత్సరాల కల. మా టీమ్ అంతా ఆరేళ్ల



పాటు హార్డ్ వర్క్ చేశారు. మా నిర్మాతగా ఇచ్చిన సపోర్ట్ ని మర్చిపోలేను. ఆయన నాపై పూర్తి విశ్వాసం ఉంచారు. ఒక డెబ్యు డైరెక్టర్ కి ఎంత ఫ్రీడమ్ ఇవ్వాలో అంతకంటే ఎక్కువ ఇచ్చారు. ఒక దైవంలాగా వచ్చారు. హీరో విజయ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేసాడు. చాలా రిస్కులు తీసుకున్నాడు. మైనస్ డిగ్రీల్లో షర్టు లేకుండా నటించాడు. ఈ సినిమాలో పనిచేసిన అందరూ కూడా చాలా డెడికేషన్ తో చేశారు. ఇందులో హీరో గారి క్యారెక్టర్ తో పాటు దయా క్యారెక్టర్ కూడా ఫిజికల్ గా అద్భుతంగా ఉంటుంది అని చెప్పారు. హీరో విజయరామ రాజు మాట్లాడుతూ ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాను. సిక్స్ ప్యాక్ లో షూట్ చేసినప్పుడు రెండు రోజులు పాటు ఏమీ తినలేదు. ఈ సినిమానే మమ్మల్ని ముందుకు తీసుకెళ్లింది. నా కెరియర్ లో బెస్ట్ మూవీ చేశానని ఫీల్ అవుతున్నాను. 29న ఆడియన్స్ అదే ఫీల్ అవుతారు. అజయ్ ఇందులో చాలా మంచి పాత్ర చేశారు. ఆయనే సినిమాని ఇండస్ట్రీ జనాల్లోకి తీసుకువెళ్లారు. దయ చాలా పాజిటివ్ పర్సన్. ఇందులో ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. హీరోయిన్ సిజకి తెలుగులో చాలా మంచి అవకాశాలు వస్తాయి.అని అన్నారు. హీరోయిన్ సిజ రోజ్ మాట్లాడుతూ మాకు ఇది చాలా ఎమోషనల్ మూమెంట్. ఈ సినిమా కోసం చాలా ఏళ్ళు కష్టపడ్డాం. ఈ సినిమాల్లో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఇంత అద్భుతమైన సినిమాలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా ఫస్ట్ తెలుగు మూవీ. మీరు సాంగ్స్ కి ఇచ్చిన రెస్పాన్స్ నాకు ఎంతో ఆనందం ఇచ్చింది. ఇది వెరీ బ్యూటిఫుల్ సినిమా. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది. ఆగస్టు 29 థియేటర్స్‌లో కలుద్దాం అని చెప్పారు. ఈ ఈవెంట్ లో నిర్మాత శ్రీని గుబ్బల , యాక్టర్ దయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సక్సెస్‌ఫుల్‌గా 20 ఏళ్ళు పూర్తిచేసుకున్న రెజీనా కసాండ్రా

అందం, అభినయం కలగలిసిన తార రెజీనా కసాండ్రా. శివ మనసులో శృతి చిత్రంతో హీరోయిన్గా పరిచయమైన ఈ భామ ఆ తరువాత రొటీన్ లవ్‌స్టోరీ, కొత్తజంట, పిల్ల నువ్వులేని జీవితం, సుబ్రమణ్యం ఫర్ సేల్ చిత్రంతో తెలుగులో అగ్ర కథానాయికల జాబితాలో చేరింది. కేవల తెలుగులోనే కాకుండా తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కూడా నాయికగా తన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల అజిత్తో కలిసి నటించిన తమిళ చిత్రం విదా మయూర్చితో పాటు బాలీవుడ్ చిత్రం జాట్తో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు రెజీనా కసాండ్రా. ఇప్పటి వరకు అన్ని తరహా పాత్రలను పోషించిన ఈ అందాల భామ త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులతో ముందుకు రానుంది. భారతీయ సినీ పరిశ్రమలో ప్రవేశించి 20 ఏళ్లు పూర్తిచేసుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగులో ఓ రెండు చిత్రాలతో పాటు తమిళంలో మూడు సినిమాలు, కన్నడ, హిందీ భాషల్లో రెండు చిత్రాలతో బిజీగా ఉంది.



## ఘనంగా కన్యా కుమారి ప్రీరిలీజ్ ఈవెంట్

ప్రముఖ నటి మధు శాలిని సమర్పకురాలిగా గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథ చిత్రం 'కన్యా కుమారి'. రాడికల్ పిక్చర్స్ బ్యానర్ప సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ అండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ టీజర్ చూసిన వెంటనే ఈవెంట్ కి రావాలని అనుకున్నాను. ఈ సినిమా టీజర్ చూడగానే రైటింగ్ ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. టీజర్ లో వైబ్ వుంది.కచ్చితంగా బాగుంటుందనే ఫీలింగ్ కలిగింది. టీజర్ చాలా ఆర్గానిక్ గా అనిపించింది. శ్రీ చరణ్, గీత్ పెర్ఫార్మన్స్ చాలా ఆర్గానిక్ గా ఉంది. క్యారెక్టర్స్ లో ఒదిగిపోయారు. కచ్చితంగా ఇది చాలా మంచి సినిమా అవుతుందని నమ్మకం కలిగింది.అని అన్నారు. డైరెక్టర్ శశి కుమార్ తిక్క మాట్లాడుతూ.. శాలినితో గూడచారి సినిమాకి వర్క్ చేసాం. తన కాలికి గాయమైనప్పటికీ కూడా యాక్షన్ సీక్వెన్స్ చేసింది. నిజంగా తన ఒక ఫైటర్. ఎన్ని వచ్చినా జీవితంలో ఫైట్ చేయాలనేది ఆమె దగ్గర నేర్చుకున్నాను. ట్రైలర్ నాకు చాలా నచ్చింది. శ్రీ చరణ్ చాలా అద్భుతంగా నటించాడు అని చెప్పారు. చిత్ర సమర్పకురాలు మధు శాలిని మాట్లాడుతూ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. శ్రీ చరణ్ గీత్ వాళ్ళిద్దరు కూడా అక్కడే పుట్టి పెరిగినట్టు యాక్ట్ చేశారు. బన్నీ వాసు సపోర్ట్ తో ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నాము. ఆగస్టు 27న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. సృజన్ అద్భుతమైన సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు అని ఆమె అన్నారు. హీరోయిన్ గీత్ సైని మాట్లాడుతూ ఇన్ని సవాళ్లు ఎదుర్కొని ఇంత అద్భుతమైన సినిమా తీశారు. నిజంగా ఆయన మాకు స్ఫూర్తి . తప్పకుండా ఆయన కష్టానికి ఫలితం దక్కుతుంది. తప్పకుండా అయిన ఇండియన్ సినిమాలో గ్రేటెస్ట్ డైరెక్టర్ అవుతారు. తప్పకుండా ఆగస్టు 27న ఈ సినిమా థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. డైరెక్టర్ సృజన్ మాట్లాడుతూ సినిమా నిర్మించడం కూడా ఒక గుడి కట్టడం లాంటిదే. కన్యాకుమారిని అలానే నిర్మించాను. ప్రేక్షకులు సినిమా చూసి గొప్ప ఆనందాన్ని పొందాలని మంచి ఉద్దేశంతో ఈ సినిమా చేశాను. అందుకే ఈ సినిమాకి ఆర్గానిక్ ప్రేమ కథ ని పెట్టాను. ఇందులో పాత్రలన్నీ కూడా రియల్ లైఫ్ నుంచి వచ్చినవే. ఈ సినిమా పాత్రలోనే చాలా మంచి డ్రామా ఉంది. ఈ సినిమా చూసి మీకు నచ్చితే ఆ క్రెడిట్ బన్నీ వాసుకి దక్కుతుంది. బన్నీ వాసు లేకపోతే ఈ సినిమా థియేటర్స్ లోకి రాదు. ఆగస్టు 27న సినిమా విడుదల అవుతోంది అని చెప్పారు. ఈకార్యక్రమంలో శ్రీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## గడువులోపు సిఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** ఖరీఫ్ 2024/25 సీజన్ కు సంబంధించిన సిఎంఆర్ డెలివరీలను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కిమ్యా నాయక్ ఆదేశించారు. గురువారం పాన్‌గల్ మండలంలోని మేహరూన్ , మల్లికార్జున రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేసి, ధాన్యం, నిల్వలు, ప్రాసెసిం గ్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడు తూ రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని నిర్ణీత గడువు లోగా మిల్లింగ్ చేసి బి య్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. డెలివరీలో జాప్యం జరిగితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అదనపు కలెరక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ డీఎం జగన్ మోహన్ , డీసీఎస్ఓ కాశీవిశ్వనాథ్ , తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

## వార్డులు శాస్త్రీయంగా విభజించాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రాబోయేస్థానిక సంస్థల ఎన్నికలలో కల్వకుర్తి మున్సిపాలిటిలోని వార్డులను క్రమపద్ధతిలో శాస్త్రీయంగా విభజన చేయాలని కల్వకుర్తి బిజెపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుర్రాల రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్‌డిఓ కార్యాలయంలో జరిగిన ఓటరులిస్టు అవగాహనసదస్సులో బిజెపి నాయకులు పాల్గొన్నారు. కల్వకుర్తి ఆర్‌డిఓగా బాధ్యతలుచేపట్టిన ఎంపి జనార్ధన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం కల్వకుర్తి మున్సిపాలిటిపరిధిలోని ఓటరు జాబితాలో గల పలు సమస్యలను లిఖితపూర్వకంగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వార్డులను విభజించేటప్పుడు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా విభజనచేయడం గతంలో జరిగింది, వార్డుల విభజన జరిగేటప్పుడు అన్నిపార్టీల సమ్మతి తీసుకోవాలి, బిఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని వారిపై తగు చర్యలు చేపట్టాలన్నారు., 18 ఏళ్లునిండిన ప్రతి యువతీ యువకులకు వెంటనే ఓటరునమోదు కార్యక్రమం చేపట్టాలని, ఇంటి నెంబర్ల ప్రకారంకాకుండా బౌండరీల ప్రకారం వార్డులు ఏర్పాటుచేయాలని పలు సూచనలు చేశారు. పైసూచనలను దృష్టిలో పెట్టుకొని ఓటరు లిస్టులు తయారుచేయాలని, ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే బిజెపిపార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బిజెపిపట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు మొగిలిదుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బోడనర్సింహ్మా, సీనియర్ నాయకులు సూర్యకృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, విజయ్, చందుముదిరాజ్, పట్టణప్రధాన కార్యదర్శి నాపశివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇండ్లను త్వరితగతిన నిర్మించుకోవాలి



**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరిత గతిన నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం ధన్వాడ మండల కేంద్రంలోని బీసీ కాలనీ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆమె పరిశీలించారు. ఈ కాలనీ లో మొత్తం నాలుగు ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా కలెక్టర్ మూడు ఇళ్లను చూశారు. ఒక ఇల్లు స్లాబ్ దశలో, మరో ఇల్లు బేస్‌మెంట్, ఇంకో ఇల్లు స్లాబ్ పూర్తియింది. స్లాబ్ పూర్తయిన ఇంటిని చూసిన కలెక్టర్ ఆఇంటి లబ్ధిదారురాలైన శారదను శాలువాతో సన్మానించారు. ధన్వాడ మండలానికి 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అందులో ధన్వాడ మండల కేంద్రానికి 102 ఇండ్లు మంజూరు అయ్యాయని వాటిలో స్లాబ్ పూర్తయిన మొదటి ఇల్లు మీదే అని సందర్భంగా అభినందించారు. ఇండ్లను దశల వారీగా త్వర త్వరగా నిర్మించుకుంటే డబ్బులు జమ అవుతాయని, మండలంలో మిగతా ఇండ్ల నిర్మాణాలను కూడా తొందరగా నిర్మించుకునేలా అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సింధుజ, గ్రామ సెక్రెటరీ శ్రీనివాస రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరహరి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ పర్యటన



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** జిల్లాలో వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన ప్రాంతాలను పరిశీలించిన రెవెన్యూ (విపత్తుల నిర్వహణ శాఖ ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ దివిటిపల్లి అమరాజా ఫ్యాక్టరీకి వెళ్లే టిజిఐఐసి కాంప్లెక్స్ వద్ద దెబ్బతిన్న అప్రోచ్ రోడ్డును, అనంతరం అమిస్తాపూర్ నుండి రామదాసు తండా మధ్య దెబ్బతిన్న రోడ్డును, జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలేజి వెళ్లే వర్షపు నీటితో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న రహదారి, రైల్వే అండర్ బ్రిడ్జి పునరుద్ధరణ పనులు గురించి వివరించిన కలెక్టర్ విజయేందిర బోయి , సంబంధిత రైల్వే, మున్సిపల్, టిజిఐఐసి అధికారులు. జడ్చర్ల మండలం చిట్టిబోయిన పల్లి సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి భోజనం చేసిన విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహరెడ్డి తదితరులు గురుకుల పాఠశాలలో వంటగది, స్టోర్ రూమ్ పరిశీలించారు.

## నేడు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్

'మార్వాడి గో బ్యాక్'తెలంగాణ బంద్‌కు మద్దతు

**ప్రజాపక్షం/ మక్తల్ :** ఒయుజెఎసి తెలంగాణ రాష్ట్ర బంధు పిలుపుమేరకు ఆల్ మర్చంట్ అసోసియేషన్ వర్తక వ్యాపార సంఘం వారు బందుకు మద్దతు తెలుపుతూ నేడు వ్యాపార సంస్థలు బందుకు ఒక ప్రకటనలో పిలుపునివ్వడం జరిగింది. మార్వాడి వ్యాపారస్తులు గో బ్యాక్ నినాదంతో అందరూ వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంధు చేయాలని, మన ముందు తరాలకు వీరి నుంచి నష్టం రాకుండా మన ప్రాంతం, మన ప్రజలు, మన వ్యాపారం అనే నినాదంతో మన ముందు భవిష్యత్తు తరాలకు కూడా మేలుకొలుపు ఉండాలని ఐక్యతతో దుకాణాలు బంధు పాటించి మద్దతు తెలిపాలని అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. వర్తక వ్యాపారులు, కిరణ జనరల్ స్టోర్ వ్యాపారస్తులు, వస్త్ర రెడీమేడ్ వ్యాపారస్తులు మెకానిక్, ఆటోమొబైల్, ఫర్టిలైజర్స్ మొబైల్ షాప్, ఎలక్ట్రికల్స్, పెయింట్స్ హోటల్ , బేకరీ ఫుడ్ వర్క్ మండల వ్యాపారస్తులు, టీవీ షో రూమ్స్ బైక్ షోరూమ్స్, నాయని బ్రాహ్మణుల సంఘం, ఇతర వ్యాపారుల సంఘాలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ మర్చంట్ అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, పెద్దలు ఉండేకోహహ్ రవికుమార్, సత్యనారాయణ, మారుతి రఘు, యన్. శ్రీనివాస్, బిలకంటి శ్రీనివాస్, మెకానిక్ రాము, అన్ని సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా యంత్రాంగం అప్రమత్తత, సమన్వయంతోనే

# ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు

జిల్లా యంత్రాంగంపై రాష్ట్రవిపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రశంసలు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గతకొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకారణంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా జిల్లా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని రాష్ట్రవిపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అరవింద్‌కుమార్ ప్రశంసించారు. గురువారం జిల్లాకేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వీడియోకాన్ఫరెన్స్‌హాలులో సమీక్షా సమావేశం జరిగింది. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్‌పిగైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్ తోపాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వరదలవల్ల తలెత్తిన సమస్యలు, వాటి నివారణకు చేపట్టిన చర్యలు, సహాయక చర్యలపై శాఖలవారిగా అధికారులు సమగ్ర నివేదికలు సమర్పించారు. ఆర్‌అండ్‌బిశాఖ అధికారులు వర్షాలకారణంగా రహదారులు, దెబ్బతిన్న ప్రదేశాలను వాటిపునరుద్దరణ పనులను వివరించారు. మున్సిపల్‌శాఖ అధికారులు తాగునీటీ సౌకర్యాలు, డ్రైనేజి సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు చెరువులు, వాగులు, ప్రాజెక్టులనీటిమట్టాలపై సమాచారం అందించారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయంలేకుండా చేపట్టిన చర్యలను వివరించారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధకశాఖలు పంటలు, పశువులపై వర్షాలప్రభావం, రైతులకు అందిస్తున్న సహాయం గురించి తెలియజేశారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రధానకార్యదర్శి అరవిందకుమార్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ముందుగానే అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయడం వలన ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనడంలో అధికారులు మరింత వేగంగా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సకాలంలో సమాచారం అందించి సహాయక చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. జిల్లాలో రానున్నరోజుల్లో వర్షం కురిసే అవకాశం ఉందని , వరద సమయంలో ముంపు బాధితులకు ఇబ్బందులు పునరావృత్తం కాకుండా చూడాలని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలవల్ల ఆయాశాఖలకు సంబంధించి వాటి నష్టంవివరాలను జిల్లా కలెక్టర్ తెలియపరచాలని సూచించారు. రానున్న రోజుల్లో భారీవర్షాలుపడే అవకాశం ఉందని వరదనివారణ చర్యలు ఇప్పటినుంచే చేపట్టాలని, అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతకుముందు నాగర్‌కర్నూల్ నియోజకవర్గపరిధిలోని చర్లతిరుమలాపూర్, సిర్సవాడలో గతకొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, వరదలప్రభావంతో జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్, సంబంధితశాఖల అధికారులు కలిసి ప్రత్యక్షంగా సందర్శించారు. వరదల కారణంగా రహదారులు, చెరువులు, వాగులు, వంతెనలు, తాగునీటి సౌకర్యాలు, వ్యవసాయ పొలాలు, విద్యుత్‌లైన్లు దెబ్బతిన్న ప్రదేశాలను పరిశీలించి అక్కడి పరిస్థితులను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. ప్రజల సూచనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి తారను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ అభివృద్ధికి సంబంధించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించిన నేపథ్యంలో పట్టణాభివృద్ధి, శాఖ కార్యదర్శి తార ని ఢిల్లీలోని వారి కార్యాలయంలో , ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ తో కలిసి మహబూబ్‌నగర్ క్లస్టర్ మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల అభివృద్ధి పైన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అభివృద్ధికి నోచుకోక పోవడంతో మహబూబ్‌నగర్ అంటేనే వెనుకబడిన జిల్లాగా, వలసల జిల్లాగా లేబర్ జిల్లాగా పేరుగాంచిందన్నారు. ఈ క్లస్టర్ లోని మూడు పట్టణాలు అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, విరివిరిగా అనేక కంపెనీలు వస్తాయని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ అభివృద్ధికి సంబంధించిన నివేదిక పంపించింది. కాబట్టి. ముందుగా మహబూబ్‌నగర్ క్లస్టర్‌కు ప్రాధాన్యత ఇచ్చి, ఎంపిక చేయాలని ఎమ్మెల్యే ఆమెను కోరారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ క్లస్టర్ నా పార్లమెంటు నియోజకవర్గంలోని పట్టణాలని మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధి చెందితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే తెలిపారు.

## జెడ్‌పి పీఠాన్ని కైవసం చేసుకుంటాం

బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల ఆశీర్వాదంతో వనపర్తి జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల రాజ్యాధికారమే లక్ష్యంగా బిసి పొలిటికల్ జెఎసిని స్థాపించి ఓ వైపు బిసిల హక్కుల కోసం పోరాడుతూనే ఈ ప్రాంత బిడ్డగా, ఇక్కడ జరుగుతున్న అవినీతిని, అధికారులు, ప్రజా ప్రతినిధుల అలసత్వాన్ని ఎండగడుతున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న నామినేటెడ్, ఇతర పదవులలో బిసిలకు 42 శాతం కేటాయించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి పొలిటికల్ జెఎసి తమ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుని జిల్లాలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజల కోసం పని చేసే వారిని ప్రజలే గెలిపిస్తారని, ప్రజల సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల కోసం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ , వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు అరవిందా చారి, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్ , కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్ , జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్ , శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్ ,ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్ , మదనాపూర్ మండల కన్వీనర్ నర్సింహయాదవ్ , యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం సేకరణ ముందస్తు కార్యాచరణ సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** వానాకాలం 2025–26 సీజన్‌లో జిల్లాలో ధాన్యం సేకరణకు ముందస్తుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆయా శాఖల అధికారులను రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహరెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహరెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో వానాకాలం 2025–26 ధాన్యం కొనుగోలు ముందస్తు కార్యాచరణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ క్రాప్ బుకింగ్ డేటా ప్రకారం మన జిల్లాలో వరి సాగు 171781 ఎకరాలలో జరిగినట్లు దాదాపు 4.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో 3.60 లక్షల మెట్రిక్ టన్నులను సన్నధాన్యం లక్ష మెట్రిక్ టన్నులు దొడ్డురకం ధాన్యం ఉత్పత్తి అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 3లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా వేయడం జరిగిందని తెలిపారు. రైతులకు బోనస్ ఇవ్వడం వలన మార్కెట్‌లో రేట్ లేకపోవడం వలన ఈ సారి సన్న రకం ధాన్యం అంతా కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయడం జరిగిందన్నారు. మిగతా ధాన్యం స్థానిక వినియోగం, ఇతర ప్రైవేట్ ట్రేడర్స్, మిల్లర్లు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సరిపడా గన్ని బ్యాగులు, మిల్లింగ్ సామర్థ్యం , స్టోరేజ్ స్పేస్ ముందుగానే ఏర్పాటు చేసుకునేలా ఇప్పుడే ప్రణాళికలు రూపొందించుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు అనగా తగినవన్ని టార్పాలిన్స్ కవర్లు, ప్యాడి క్లీనర్లు, ప్రేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలను సమకూర్చుకోవాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. ఇందుకోసం డిఆర్‌డిఓ110, డిసిఓ79, పి డి మెప్మా 1 మొత్తం 190 కొనుగోలు కేంద్రాలు ఏ ర్పాటు చేయాలని, ఇంకా అవసరం ఉన్న చోట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులు సన్నద్ధంగా ఉండాలని, ఎక్కడ కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. 2025–26 వానాకాలం సీజన్‌కు క్వింటాల్‌కు రూ.2389 సా ధారణ రకంకు రూ.2369 క్వింటాలుకు మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రవి నాయక్, జిల్లా సహకార అధికారి శంకరాచారి, ఇలా మార్కెటింగ్ అధికారిని బాలమణి, డిఆర్‌డిఒ అడిషనల్ పిడి శారద, వ్యవసాయ శాఖ ఎడి హైమావతి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహాధర్నా గోడపత్రిక విడుదల



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** ఉపాధ్యాయ, విద్యారంగం సమస్యల పరిష్కారానికి ఆగస్టు 23 న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్ లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రకటించారు. గురువారం టిఎన్‌జిఒ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమవేశంలో యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికీ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. మేనిఫెస్టోలో పొందుపరచిన ఎన్నికల హామీలను అమలు పరచడం లేదని విమర్శించారు. నూతన జిల్లాలకు డిఇఒ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఇఒ, నూతన మండలాలకు ఎఇఒ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని పలు రకాల డిమాండ్ చేశారు. ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సం దర్భంగా మహాధర్నా గోడపత్రికను యుఎస్‌పిసి నేతలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టియస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె. రవీకుమార్, డి.టి.ఎఫ్. జిల్లా అధ్యక్షులు రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే పంట నష్ట పరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** 15రోజులుగా కురుస్తున్న భారీ ముసురు వర్షాలతో రైతులు పూర్తిగా పంటలు నష్టపోయారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అశోక్ అన్నారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో రైతులు సాగుచేసిన వివిధ పంటలుపూర్తిగా నష్టపోయారని , పెట్టిన పెట్టుబడికూడా వచ్చేపరిస్థితిలేదన్నారు. భూపేందర్‌సింగ్ హుడా కమీషన్ సిఫారసులను అమలుచేసి రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పంటపొలాలను పరిశీలించి పంటనష్టాన్ని అంచనావేసి నివేదిక ఇవ్వాలన్నారు. దీంతో రైతులకు ఎంతనష్టం జరిగిందో పూర్తి వివరాలతో సమాచారం ఇచ్చి నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలకార్యదర్శి హన్మంతు, నాయకులు చంద్రశేఖర్, మల్లేష్, సుధాకర్ రాజు పాల్గొన్నారు.

## మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** పిఆర్‌టియు ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్రసంఘం ఆదేశానుసారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్వకుర్తినందు స్థానిక మండల విద్యాధికారి శంకర్‌నాయక్ చేతులమీదుగా సిపిఎస్‌కొరకు నిర్వహిస్తున్న మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ చేశారు. చలో హైదరాబాద్ సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినం ఇందిరాపార్కువద్ద జరిగే మహాధర్నా గోడపత్రికను గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆవిష్కరించారు. పిఆర్‌టియు మండల అధ్యక్షులు మర్యాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగుల సామాజిక, ఆర్థికభద్రతకు అడ్డంకిగా ఉన్న సిపిఎస్‌ను రద్దు చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకుమాట ఇచ్చి నేటికి రద్దుచేయలేదన్నారు. కావున సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ ఇందిరాపార్కువద్ద జరిగే మహాధర్నాలో సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రసూన, వెంకటరమణ, బాలునాయక్, పద్మ, విష్ణుమూర్తి, రియాజ్, జిల్లాబాధ్యులు అబ్దుల్‌సుభాన్, నారాయణరావు, శంకర్‌రావు, వహీద్, సందీప్, భాస్కర్ రావు, శ్రీనివాసులు, మల్లేష్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులకు, స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు మంజూరు



**ప్రజాపక్షం/ మక్తల్ :** పారిశుద్ధ్య పనుల కోసం స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఎస్. కిరణ్ అన్నారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా మక్తల్ (ఎంపీడీవో) కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో, గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ నిధులు అందక పోవడంతో స్థానిక సంస్థలు మురికి కాలువలను శుభ్రం చేయలేకపోతున్నాయి. దీని ఫలితంగా మురికి కాలువలు దుర్వాసనతో నిండిపోయి దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ అపరిశుభ్ర వాతావరణం, దోమల బెడద వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఈ వ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ తీవ్రమైన సమస్యపట్ల అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. కావున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు పారిశుద్ధ్య పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రంను దామరగిద్ద మండల (ఎంపీడీవో) కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు భగవంతు, జి. వెంకట్ రెడ్డి, కొలిమి రాములు,తదితరులు పాల్గొన్నారు.

## యూరియా అక్రమ రవాణా అరికట్టేందుకు కృష్ణ సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు



**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట జిల్లా నుండి ఇతర రాష్ట్రాలకు యూరియా అక్రమ రవాణాను అరికట్టేందుకు నారాయణపేట, కర్ణాటక బోర్డర్లో కృష్ణ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని యూరియా అక్రమ రవాణా పాల్పడే వారిపై కఠిన చర్యలుఏ తీసుకోవడం జరుగుతుందని జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లో సిబ్బంది 24/7 నిరంతరం పగడ్బందీగా అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తూ యూరియా అక్ర మ రవాణా చేసేవారిని పట్టుకోవడం జరుగుతుందన్నారు. యూరియా ఎరువులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎరువుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కృష్ణ ఎస్సై ఎస్ఎం నవీద్ తెలిపారు. గురువారం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సుదర్శన్ గౌడ్, కృష్ణ మండలం, తహసీల్దార్ శ్రీనివాస్‌లతో కలిసి కృష్ణ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## 23న యుఎస్‌పిసి మహాధర్నా

**ప్రజాపక్షం/ మాగనూర్ :** ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినప్పటికీ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ప్రవేశం నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దాస్తారం తీస్తున్నదని కాబట్టి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశల వారీ పోరాటంలో భాగంగా 23 న జరిగే మహా ధర్నాకు నారాయణపేట జిల్లాలోని మాగనూరు మండలంలోని ఉపాధ్యాయులందరు తరలివచ్చి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా పోరాటం చేయాల్సిందిగా కోరారు. అదేవిధంగా సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ లో పునరుద్ధరించాలన్నారు. కొత్తగా మంజూరైన మండలాలకు వెంటనే ఎంఇఒ పోస్టులు ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిఇఒ పోస్టులు, పిఆర్‌సి రిపోర్టును వెంటనే తప్పించుకొని ప్రభుత్వ ఉపాధ్యాయులకు టిఆర్‌ఎస్‌ను ప్రకటించాలన్నారు. ఏకీకృత సర్వీసులు తీసుకొచ్చి అందరూ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని. 5571 పిఎస్‌హెచ్‌ఎం పోస్టల్ మంజూర చేసి బి.ఎడ్‌డిఎడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు.



# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## సద్దలచెర్వును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు



ప్రజాపక్షం/సూర్యాపేట: సద్దలచెర్వును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అధికారులను అదేశించారు. గురువారం పట్టణంలోని సద్దల చెర్వును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు పక్కన ఖాళీ ప్రదేశంలో పిచ్చిమొక్కలను తొలగించి అందమైన పూలమొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం సృష్టించాలని అదేశించారు. మున్సిపాలిటి మాస్టర్ ప్లాన్ ప్రకారం సద్దల చెరువు పరిధి ఎక్కడ వరకు ఉందో మున్సిపల్ కమిషనర్‌ను, సద్దల చెరువు ఎఫ్టిఎల్ పరిధి ఎక్కడ ఉన్నదో ఇరిగేషన్ అధికారులను, ఖాళీ ప్రదేశంలో పర్యాటక శాఖ పరంగా ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో పర్యాటకశాఖ ఎఈని నివేదిక సమర్పించాలని అదేశించారు.



## రైతన్నను వేధిస్తున్న యూరియా కొరత

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ : రైతులను నెల రోజులుగా యూరియా కొరత తీవ్రంగా వేదిస్తుందని ఇది ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం నిద్రాహారాలు మాని లైన్‌లో చెప్పులు పెడుతూ అవస్థలు పడుతున్నారని ఎకరానికి 20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉందన్నారు.కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని కెసిఆర్ ప్రభుత్వంలో వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారని వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్ళంమని తెలిపారు. కనీసం సీజన్ లో నాలుగు సార్లు రివ్యూ జరిగేదనిరైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్,రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటింక సత్తయ్య గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి,మాజీ ఆర్వో మాలే శరణ్య రెడ్డి,అభిమన్యు శ్రీనివాస్,రావుల శ్రీనివాసరెడ్డి,పట్టణ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్ పాల్గొన్నారు.

## చిన్న పిల్లలకు సత్వర చికిత్స అందించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: సీజనల్ వ్యాధులబారిన పడిన చిన్న పిల్లలకు సత్వర చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. అంతేకాక ఆయా వ్యాధులకు సంబంధించి వ్యాధి నివారణ మందులు ముందే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.చిన్న పిల్లలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తల్లిదండ్రులలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.గురువారం ఆమె ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించి చిన్న పిల్లల వార్డును ఆకస్మిఖంగా తనిఖీ చేశారు.చికిత్స పొందుతున్న చిన్న పిల్లలను పరిశీలించిన అనంతరం వారి వివరాలను ఆసుపత్రి సూపరింటిండెంట్ అరుణ కుమారి,చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన లను అడిగి తెలుసుకున్నారు.సీజనల్ వ్యాధులతో ముఖ్యంగా జ్వరం తో ఆసుపత్రిలో చేరిన పిల్లలకు సంబంధించి మలేరియా,టైఫాయిడ్ ,డెంగ్యూ కేసుల వివరాలను అడిగారు. సీజనల్ వ్యాధులతో వచ్చిన చిన్న పిల్లలకు తక్షణ చికిత్స అందించాలని,ఇందుకు అవసరమైన మందులు ఎప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.ముందు జాగ్రత్తగా ఆసుపత్రిలో ఉన్న మందులు,ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.డాక్టర్ నగేష్, డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ స్వరూపా రాణి, తదితరులు ఉన్నారు.

## సోదరభావంతో గణేష్ చతుర్థి ఉత్సవాలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో గణేష్ చతుర్థి ఉత్సవాలను, నిమజ్జన కార్యక్రమాలను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సోదరభావంతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు వందల సంఖ్యలో విగ్రహాలు నెలకొల్పనున్నందున మండపాల వద్ద అధికారులు సలహాలు సూచనలు పాటిస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డివిజన్‌లో ఐదు ప్రాంతాలైనా వాడపల్లి కృష్ణానది, వేములపల్లిలో సాగర్ ఎడమకాల్వ, అనుముల మండలంలోని ఎడమకాల్వ 14వ మైలు వద్ద, సాగర్ డ్యాం దిగువన నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ శ్రీనివాసచారి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, నాయకులు రేపాల పురుషోత్తం రెడ్డి, రమేష్, మౌలానా మగ్దూం, మౌలానా జావెద్, హఫీజుద్దీన్, ఖుర్బాన్ అలీ, తహసీల్దార్లు, ఎంపీడీవో, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధులు, వికలాంగులు కిషోర బాలికలతో కొత్త సంఘాల ఏర్పాటు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ద్వారా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేసే కార్యక్రమం లో భాగంగా సంఘాలల్లో లేని మహిళలను కొత్త సంఘాలుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి వై. శేఖర్ రెడ్డి తెలిపారు.ఇప్పటికే ఉన్న సంఘాలలో సభ్యులను చేర్పించడం కార్యక్రమము కొనసాగుతున్నప్పటికి ఈ నెలలో ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టడము జరిగింది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మొదటిది వృద్ధ మహిళలను వృద్ధి సంఘాలుగా ఏర్పాటు చేయడం అంటే 60 సంవత్సరముల పై బడిన వృద్ధ మహిళలను 10 నుండి 15 మంది సభ్యుల వరకు ఒక సంఘముగా ఏర్పాటు చేయడము, వీరికి బ్యాంకు ఖాతా తెరవడం చేయడం వీరికి పొదుపులు సమావేశం అలవాటు చేయడం, చేస్తూ వీరికి సంబందించిన ఆరోగ్యం మానసిక సమస్యలు, ఆర్థిక అవసరాలు, సామజిక అవసరాలు ,బ్యాంకు రుణాలు సిఐఎఫ్ రుణాలు మ్యాచింగ్ గ్రాంట్లు లాంటి ప్రభుత్వం సహాయాలు కల్పించే అవకాశం ఉంటుంది అన్నారు. 13 సంవత్సముల నుండి 15 సంవత్సరముల వరకు15 సంవత్సరముల నుండి 18 సంవత్సరముల వరకు వయసు కలిగిన బాలికలతో కిషోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని వారి వారి వయసుకు తగినట్లుగా వారికి వచ్చే సమస్యలు బాలికలు మోసపోకుండా ఉండేందుకు దైర్యం, వారికి చట్టాలపై అవగాహన ఆరోగ్యం పై అవగాహన, మోసపోయినప్పుడు ఎదురుకునే దైర్యం, ఆలోచన ఎవరి వలన ఎలాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందో తెలియజేసే కార్యక్రమాల పై అవగాహన కల్పించ బడుతుందని తెలిపారు.

# పేదోడి ఆత్మ గౌరవానికి ప్రతీక రేషన్ కార్డులు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ప్రజాపక్షం/మోటకొండూర్ : పేదోల్ల ఆత్మ గౌరవానికి ప్రతీక రేషన్ కార్డులు అని, గత ప్రభుత్వం ఏ ఒక్కరికి ఒక్క రేషన్ కార్డు కాని, రేషన్ కార్డులో పేర్లు ఆడ్ చేయడం కాని జరుగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రేడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు పేదోల్లకు ఆరు గ్యారంటీలతో పాటు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులందరికి అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన గురువారం మోటకొండూర్ మండల కేంద్రంలోని మహలక్ష్మి పంక్షన్ హాల్‌లో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో పాల్గోని రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కార్యకర్తలకే సంక్షేమ ఫలాలు అందాయని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హూలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని అన్నారు. మోట కొండూరు మండలంలో కొత్త రేషన్ కార్డులు 928 మంజూరు చేసినట్లు, 3628 కొత్త యూనిట్లు ఆడ్ చేయడం జరిగినట్లు తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి పథకాలతో మిగులు రాష్ట్రాన్ని దోచుకుని తిన్నారని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మొదటి విడతలో 3700 ఇండ్లు మంజూరు చేసినట్లు, రెండవ విడుతలో 3500 ఇండ్లు మంజూరౌవుతున్నట్లు, పేదవారి కలలు సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గత యాసింగి సీజన్లో ఆలేరు నియోజకవర్గంలోని 135 చెరువు లలో నీళ్ల నింపినట్లు, ప్రస్తుతం వర్షాలు ఆలస్యంగా వచ్చినప్పటికీ అన్ని వాగులు పారి చెరువుల కుంటలు నిండినట్లు, రాబోయే ఫిబ్రవరిలో మరొకసారి గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్‌డిఓ క్రిష్ణా రెడ్డి, సిఐ శంకర్ గౌడ్,స్పెషల్ ఆఫీసర్ నరసింహా రావు, ఎంపిడిఓ ఇందిర, తహసిల్దార్ నాగ దివ్య, ఆర్ఐలు రామారావు, ఆసిప్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగాపురం మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తాం**

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను అందజేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాలు రేషన్ కార్డులను గత ప్రభుత్వం పంపిణీ చేయలేదని వారన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను దశలవారీగా మంజూరు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, తహసిల్దార్ లావణ్య పాల్గొన్నారు.



## మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాజీ ప్రసక్తే లేదు

గట్టుప్పలలో సరస్వతీ శిశు మందిర్ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/చండూరు /గట్టుప్పల : మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరికి సమాజ సేవ చేయాలనే ఆలోచన ఉండాలని మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి అన్నారు. గురువారం గట్టుప్పల మండల కేంద్రంలో ఇడెం శ్రీనివాస్ సొంత ఖర్చులతో కార్పోరేట్ స్థాయిలో నూతనంగా నిర్మించిన సరస్వతీ శిశుమందిర్ భవనాన్ని ఎంఎల్ఏ రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమాజ సేవ చేయాలనే తపన ఉండాలని కుటుంబం కోసమే కాకుండా సమాజం కోసం కూడా ఆలోచన చేసినప్పుడే సమాజంలో పేదరికం అనేది ఉండదన్నారు. బడి అంటే గుడి లాంటిదని గ్రామాలలో ఒక్కొక్క కులానికి ఒక గుడి ఉంటుంది కానీ ఊరందరి గుడి బడి మాత్రమేనని అన్నారు. నియోజకవర్గంలో మొదటి విడుతగా ప్రతి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను కార్పోరేట్ స్థాయిలో అభివృద్ది చేస్తానని అన్నారు. మునుగోడు నియోజకవర్గం అభివృద్ది విషయంలో రాజగోపాల్‌రెడ్డి రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తూ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుభం శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నామని జగన్నాథం , మాజీ జడ్‌పిటిసి గోపాల్, దండు యాదగిరిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఐఐహెచ్‌టి పోచంపల్లిలోనే ఏర్పాటుకు ప్రణాళికలు

రాష్ట్రంలోనే మొట్టమొదటి నేచురల్ డై యూనిట్ ఏర్పాటు

చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వెల్లడి




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : ఐఐహెచ్‌టి పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చినట్లు చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వెల్లడించారు. పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ సీఈవో కం చైర్మన్‌గా స్థాపించిన పోచంపల్లి ప్రొడక్షన్ హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ షోరూమ్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. షోరూంను ప్రారంభించిన ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి వస్త్రాలను పరిశీలించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా ప్రజాపక్షం అడిగిన ప్రశ్నకు సమాధానంగా తాత్కాలికంగా హైదరాబాద్‌లో ఐఐహెచ్‌టి ఏర్పాటు చేసి కోర్సులు నడుపుతున్నామని రెండు మూడు సంవత్సరాల్లో పోచంపల్లికి షిఫ్ట్ చేసి ఐఐహెచ్‌టి స్థాపించి ఉపాధి శిక్షణ కోర్సులు అందించి చేనేత పరిశ్రమ పునర్నిర్మాణంలో ప్రపంచవ్యాప్తంగా వస్త్ర ప్రపంచాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వీవర్ సర్వీస్ సెంటర్ అధికారి అరుణ్ కుమార్ ప్రోత్సాహంతో ఈ కంపెనీని స్థాపించడం చాలా సంతోషంగా ఉందని దీని ద్వారా చేనేత కార్మికులకు జీవనోపాధి కల్పించడమే కాకుండా ప్రొడక్షన్ పెంచడం ఉపాధి అవకాశాలు కల్పించడం మార్కెటింగ్‌కు మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఈ కంపెనీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోచంపల్లిలో పైలెట్ ప్రాజెక్టు కింద స్థాపించడం జరిగిందని పేర్కొన్నారు. దీనికోసం రూ.20 లక్షల రుణం మంజూరు చేసిందని తెలిపారు. ప్రొడ్యూసర్స్ కంపెనీ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్, ఎమ్మార్వో శ్రీనివాస రెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు భారత లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం ఉరుకులు...



ప్రజాపక్షం/ హాలియా: రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా దొరకడం లేదనే వదంతులు ఎక్కువై... అవసరం లేకున్నా కొందరు బడా రైతులు పెద్ద మొత్తంలో యూరియా నిల్వలు చేసుకుని కృత్రిమ కొరత కు కారణం అవుతున్నారు. గ్రామాలలో కొందరు వ్యాపారులు లైసెన్స్ లేకున్నా యూరియా నిల్వలు పెద్ద ఎత్తున చేసుకొని బహిరంగ మార్కెట్లో యూరియా కొరత తీవ్రంగా ఉందని ప్రచారం చేస్తూ రైతులు అవసరాలను ఆసరా చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనుముల మండలానికి ప్రస్తుత వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం నాలుగు వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని తేల్చారు. ఇందులో రెండు దఫాలుగా మొత్తం 1320 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశారు. గురువారం కొత్తపల్లి సహకార సంఘానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే పెద్ద మొత్తంలో బారులు తీరారు. దీంతో రైతుల మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకోవడంతో హాలియా ఎస్సై సాయి ప్రశాంత్, సీఐ సతీష్ రెడ్డిలు సహకార సంఘం వద్ద ఎటువంటి ఘర్షణలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడంతో యూరియా సరఫరా సక్రమంగా జరిగింది.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పెంచాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నల్లగొండ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌ను పెంచాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నల్గొండ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై గృహనిర్మాణ శాఖ అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల వారిగా సమీక్ష సందర్భంగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించగా, మొదటి ,రెండో విడతలో 3337 గృహాలు మంజూరు చేయడం జరిగిందని ,అందులో 1129 గ్రౌండ్ కాగా, బేస్మెంట్ స్థాయిలో 1037 రూఫ్ లెవెల్ స్థాయిలో 67 ,పూర్తి దశలో 25 ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నల్గొండ నియోజకవర్గంలోని మండలాల ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణ ఇంజనీర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రౌండింగ్ ను పెంచాలని చెప్పారు. గృహాలు నిర్మించుకోనెందుకు సుముఖత లేని లబ్ధిదారుల నుండి సమ్మతి తీసుకోవాలని చెప్పారు. పూర్తయిన గృహాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ద్వారా ప్రారంభోత్సవం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ తో పాటు ,కనగల్ , తిప్పర్తి మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఇందిరమ్మ గృహాలకు సంబంధించి ఇసుక ,మేషన్ల సమస్యలను తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంజూరైన మొత్తం గృహాలు గ్రౌండ్ అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంపీడీవోలపై ఉందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్ ,ఆర్డీఓ వై .అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 13వ వార్డు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి కస్పరాజు రమేష్ సమక్షంలో 13వ వార్డు భాషానాయక్‌తండాకు చెందిన బిఎస్‌పి, బిఆర్ఎస్‌పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి గండమల్ల వసంత, పోలేపాక సతీష్, సాయిరాజు, హుస్సేన్ లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, ధారావత్ వీరన్ననాయక్, చింతమళ్ల రమేష్, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, సాయినేత, పందిరి మల్లేష్, చింత వెంకన్న పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థకు ప్రభుత్వం పెద్దపీట

విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి: కలెక్టర్



ప్రజాపక్షం/యాదాద్రి : ప్రభుత్వం విద్యా వ్యవస్థకి పెద్దపీట వేసిందని, విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి, స్కూల్‌లో ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారని, అందరూ విధులకు హాజరయ్యారా అని అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పదవ తరగతిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా టీచర్లు కృషి చేయాలని, ఇప్పటి నుండే వాళ్ళకీ అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టులలో వెనకబడి ఉన్న విద్యార్థులకు స్పెషల్ క్లాస్ నిర్వహించాలన్నారు.

**పోష్ చట్టం పుస్తకం, వాతావరణ మార్పులపై అవగాహన కరపత్రాలు ఆవిష్కరణ**

పని ప్రదేశంలో మహిళలందరికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించవలసిన బాధ్యత యజమాని, యాజమాన్యాలదేనని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు , ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఈ చట్టం పట్ల అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న ఆక్షన్‌ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్టు సంస్థను ఈ సందర్భంగా అభినందించారు. జిల్లాలో అన్ని సంస్థల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఆక్షన్‌ఎయిడ్ కమ్యూనిటీ ట్రైనర్ సురుపంగ శివలింగం విజ్ఞప్తి మేరకు పోష్ చట్టం పుస్తకాలు మరియు వాతావరణ మార్పులపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలు జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆకాంక్ష్ యాదవ్, స్థానిక సంస్థల కలెక్టర్ భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ కోరారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహాతో కలిసి కలెక్టర్ శాంతిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రులలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, మండపాలలో షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీ అధికారులకు, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, మండపాల వద్దకు రోడ్డు ఏర్పాటు ఏయాలని, చిన్న పిల్లలకి, వృద్దులకి నిమజ్జనం వద్ద ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం అయిపోగానే వాహనాలు వెళ్లిపోయేలా ప్రణాళికల సిద్దం చేయాలని, మున్సిపాలిటిలలో శోభయాత్ర నిర్వహించేటప్పుడు చెట్లు అడ్డు తగలకుండా కొమ్మలు తొలగించాలని, రోడ్లపై గుంటలు పూడ్చాలని, స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, భక్తులకు తాగునీరు, వసతి కల్పించాలని, నిమజ్జనం చేసే ప్రదేశంలో వాహనాలు ప్రవేశించేందుకు బయటకు వెళ్లేందుకు వేర్వేరు రోడ్లు ఏర్పాటు చేయాలని అదేశించారు.

**శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలి : జిల్లా ఎస్‌పి కె.నర్సింహా**

ప్రజలను రక్షించేందుకు పోలీస్‌శాఖ ముందుగా ఉంటుందని, శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు ఆన్‌లైన్‌లో రిజిస్టేషన్ చేసుకుంటే దాన్ని తగినట్లుగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని పోలీస్‌స్టేషన్‌లో మొబైల్ ద్వారా, ఆన్‌లైన్‌లో ప్రతి మండపాన్ని రిజిస్టేషన్ చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు భానుపూరి గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు, విశ్వ హిందు పరిషత్ సభ్యులైన కృపాకర్, రుప్మారావు, రాజేశ్వరరావు, నర్సింహారావు, ఫరూక్, పండురంగచారి, విజయ్, కృష్ణ, రవిచంద్ర లు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగాశాంతియుత వాతావరణలో నిర్వహించేందుకు తమవంతు సహకారం అందిస్తామని నిమజ్జనం చేసే సద్దల చెర్వు వద్ద ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీవోలు, డిఎస్‌పిలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.




# ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించాలి

## ప్రతీ నాయకుడూ కార్యకర్త మాదిరిగా కృషి చేయాలి

### సిపిఐ మహాసభల్లో ప్రతినిధుల పిలుపు




ప్రజాపక్షం / కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజుల రామారం)

క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించడం ద్వారా సిపిఐ బలోపేతానికి పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పలువురు సిపిఐ నాయకులు అన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదికపై రెండో రోజు గురువారం చర్చలో వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి రాజారెడ్డి( జనగాం) మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో పేదలకు పంపిణీ చేసిన భూములు మళ్లీ కేంద్రీకృతం అవుతున్నాయని, ఈ కీలక భూసమస్యపై సిపిఐ మరో ఉధృతమైన భూపోరాటం నిర్వహించేందుకు సంసిద్ధం కావాలన్నారు. గోదా శ్రీరాములు (యాదాద్రి భువనగిరి) మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో మమేకం కావడం ద్వారా పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాల్సి ఉందన్నారు. ఎల్. దశరథ (కామారెడ్డి ) మాట్లాడుతూ తమ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని, గత ఏడాదితో పోల్చితే మరింతగా పార్టీ విస్తరించిందన్నారు. పేదల పక్షాన మరింత బలమైన పోరాటాలు నిర్వహించాల్సి ఉందని మంద పవన్ (సిద్దిపేట) అన్నారు. కె.భిక్షపతి (హన్మకొండ ) మాట్లాడుతూ హన్మకొండలో 15 ప్రాంతాల్లో భూపోరాటాల ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడం దేశంలో రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిందన్నారు. ఫారుఖ్ (మెదక్), ప్రభాకర్‌రెడ్డి (ఆదిలాబాద్) మాట్లాడుతూ భారీ వర్షాలతో ఆదిలాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని, రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. విజయ సారథి (మహబూబ్‌నగర్) కె.నీరజ్ కుమార్ (భూపాలపల్లి), బెజవాడ వెంకటేశ్వర్లు (సూర్యాపేట), మర్రి వెంకటస్వామి (కరీంనగర్), విజయలక్ష్మి (వికారాబాద్), ఇ.ఉమా మహేశ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), షేక్ బాష్‌మియా (వరంగల్), తాండ్ర సదానందం( పెద్దపల్లి), మాట్లాడుతూ జిల్లాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కడిక్కడ ఆందోళనలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలాన్నారు. వాసిరెడ్డి సీతారామయ్య, (సింగరేణి), ఎస్.బాల్‌రాజు (ఎఐటియుసి) తోట మల్లికార్జునరావు, అంజయ్య నాయక్ (గిరిజన సమాఖ్య) మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని, తద్వారానే సమస్యలు పరిష్కరం అవుతాయని అన్నారు.



# 'దళిత వాయిస్' పుస్తక మొదటి సంచికను ఆవిష్కరించిన డి.రాజా



ప్రజాపక్షం / కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజుల రామారం)

దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇంకా కుల వివక్షత, దళితులు, బడుగు బలహీనవర్గాలపై అత్యాచారాలు కొనసాగుతుండడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలలో రెండో రోజు గురువారం తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో ప్రచురిస్తున్న 'దళిత వాయిస్' ఆగస్టు – సెప్టెంబర్ మొదటి సంచికను డి.రాజా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, 'దళిత వాయిస్' గౌరవ సలహాదారులు ఎం.బాల నరసింహా, సంపాదకులు కె.ఏసురత్నం, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మారుపాక అనిల్ కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ సమాజంలో దళితులు, అల్పసంఖ్యాకుల వర్గాల ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేయాలన్నారు. మార్క్సిజం, అంబేద్కరిజం దేశ పరిస్థిలకు అన్వయించుకోవాలన్నారు. దళితుల సమస్యలపై దేశవ్యాప్తంగా అఖిల భారత హక్కుల ఉద్యమం (ఎఐడిఆర్‌ఎం) పోరాటాలు చేస్తుండడం, ఇటీవల హైదరాబాద్ లో ఆ సంఘం మహాసభలను నిర్వహించడం ద్వారా భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని నిర్ణయించడం హర్షణీయమన్నారు.


ప్రజాపక్షం దినపత్రికను చదువుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా


తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణతో...


ప్రజానాట్యమండలి కళాకారుల బృందం ఆటా... పాటా..




నవచేతన బుక్‌హౌస్‌లో పుస్తకాలు తిలకిస్తూ....


కందిమళ్ల ప్రతాపరెడ్డితో డి.రాజా కరచాలనం


సభా ప్రాంగణంలోని సిపిఐ నాయకుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డి.రాజా

**సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల రెండో రోజు చిత్రమాలిక**

ఫొటోలు.. అనిల్


కూనంనేని సాంబశివరావు, మారుపాక అనిల్ కుమార్, నెల్లికంటి సత్యం ముచ్చట్లు


మహిళా ప్రతినిధులు


సిపిఐ మహాసభల్లో వాలంటీర్లు


ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు


ఏఐవైఎఫ్ ప్రతినిధులు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com